వాసు ... గత వారం జరిగిన విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 157 పేజీలు: 12 వెల: 6.50

ప్రశ్న రావణ్‌కు 18 దాకా రిమాండ్ 3లో

రాజ్యసభ మూడు సీట్లకు నోటిఫికేషన్ 9లో

# 3 రీజియన్లలో క్రీడా సిటీలు



## రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ చేయాలి

### 51.88 చ.కిమీ విస్తీర్ణంలో వైజాగ్ బే సిటీ

### ప్రతి జిల్లాకు ఎకనమిక్ ప్రొఫైల్

### 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్

### మూడు ప్రాంతాలపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యానవన పంటల సాగుతో తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డ్ సృష్టించిన కడప జిల్లా లింగాలం మండలం స్ఫూర్తితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పురోగతికి హార్టికల్చర్ గ్రోత్ ఇంజిన్ అవు తుందని, 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలన్నారు. ఈ ప్రాంత స్థితిగతులు మార్చే శక్తి హార్టికల్చర్‌కు ఉందని...తిరుపతి ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌లో రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. పూర్వోదయ పథకం కింద రూ.40,000 కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో వచ్చే మరో రూ.60,000 కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని అధికారులకు సీఎం చెప్పారు. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల కన్నా సీమలోని ఓ మండలంలో ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉండటాన్ని అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో ప్రజలు రూ. 7.30 లక్షలు తలసరి ఆదాయం కలిగి ఉండడం హార్టికల్చర్ పంటల సాగు వల్ల కలిగే లాభాలకు నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. హార్టికల్చర్ కు అత్యంత అనువైన రాయలసీమలో ఆ దిశగా ప్రజలను మరింత ప్రోత్సహించాలన్నారు. సీమలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను తీసుకువస్తే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతాయని సిఎం అన్నారు. ఆ దిశగా జిల్లా అధికారుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. సచివాలయంలో సోమవారం రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ రీజియన్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణపై పలు మార్గదర్శకాలను సూచించారు. ఇప్పటికే విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఆవిష్కరించగా...6 నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యాక ముసా యిదాను ప్రజలు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏ రంగాల్లో తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అమరావతి, తిరుపతి, విశాఖలో అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారు >>2



సోమవారం ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటో

## యుద్ధవిమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం

### అత్యున్నత గౌరవం ప్రదర్శించిన ఇండొనేసియా ప్రభుత్వం

### జకార్తాలో స్వయంగా స్వాగతించిన అధ్యక్షుడు సుబియాంటో

**జకార్తా,జులై 6:** మూడుదేశాల పర్యటనలో భాగంగా తొలి దేశంగా ప్రధాని మోడీ ఇండోనేషియాలోకి ప్రవేశించగానే యుద్ధ >>2

# భారత్ ఎఐ రాజధానిగా ఎపి

### ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం

### రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లు

### సియోల్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్



సోమవారం సియోల్‌లో 'షూ ఆల్స్' కంపెనీ చైర్మన్ లీ చియాంగ్‌గెన్‌తో భేటీ అయిన మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై6,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడమే తమ ధ్యేయం ఏపీ మానవ వనరులశాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ( ఆర్ టి ఐ హెచ్ ) ద్వారా "వన్ ఫ్యామిలీ,వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ టెక్ స్టార్టప్ లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ అమరావతిలో ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఆర్ టీఐహెచ్ విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శాఖలతో పనిచేస్తోందన్నారు. టాటా, ఎల్ టీ, జీఎంఆర్, గ్రీన్‌కో, అదానీ, జేఎస్‌డబ్ల్యూ వంటి ప్రఖ్యాత సంస్థల సహకారంతో దీనిని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆర్ టీఐహెచ్ ఫుల్ లైఫ్ సైకిల్ ప్రోగ్రామ్స్ అయిన స్పార్క్ (ఆలోచనల రూప కల్పన), క్యాటలిస్ట్ (18 వారాల ఇంక్యుబేషన్), వెలాసిటీ ల్యాబ్ లలోకి కొరియన్ స్టార్టప్‌లను ఆహ్వానం పలుకుతు న్నామన్నారు. ఈ వేదిక ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్ లకు మద్దతునిచ్చింది, 5,200కు పైగా ఎంటర్ ప్రెన్యూర్ లను భాగస్వాములను చేసింది. ఏపీ ఇన్నోవేషన్ స్టార్టప్ పాలసీ 2024-29లో భాగంగా ప్రోటోటైపింగ్, డీప్‌టెక్ గ్రాంట్ల కింద 22 కోట్ల ఆర్.టి. ఐ హెచ్ .ఐ డి బి ఐ సీడ్ ఫండ్, 20 కోట్ల వరకు తి.నీ సీడ్ ఈక్విటీ, క్రెడిట్‌గ్యారెంటీ వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాం. 160కి పైగా విసి /ఏం జెల్ సిండికేషన్ నెట్‌వర్క్ కలిగిన ఆర్ టీఐహెచ్ ఇప్పుడు ఏఐ, క్వాంటం, అధునాతన తయారీ కోసం ఎస్ ఐ డి బి ఐ భాగస్వామ్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన డీప్‌టెక్ ఏం జెల్ ఫండ్‌తో ఇప్పుడు మరింతగా విస్తరించినట్లు తెలిపారు. స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దాం: ఆర్‌టీఐహెచ్‌ను కేంద్రంగా చేసుకుని ఇండియాకొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటు కోసం కలిసి పనిచేద్దామని కొరియన్ సంస్థలను ఆహ్వానిస్తున్నాం. ఒక ప్రత్యేక కొరియా డెస్క్, సాఫ్ట్‌ల్యాండింగ్ "విసి బే", కొరియన్ ఏజెన్సీలతో (కోట్రా/కె స్టార్టప్) సహఇంక్యుబేషన్ ఏర్పాటుచేస్తాం. దీనిద్వారా రెండువైపులా మార్కెట్ ప్రవేశం లభిస్తుంది. కొరియన్ స్టార్టప్‌లు భారతదేశంలోని టైర్ 2-3 మార్కెట్లలోకి, ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లు కొరియాలోకి రావడం సులభ తరమవుతుంది. భారతదేశ ఆక్వాకల్చర్‌లో ఆంధ్రప్రదేశ్ సుమారు 40 వాటాను కలిగి ఉంది, 1,053 >>2

## ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదలీలపై 13 నుంచి నిషేధం అమలు

**విజయవాడ,జూలై6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటా యింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వంతాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థికశాఖ (హెచ్‌ఆర్‌ప్లానింగ్‌పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీచేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టతఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సి న ప్రక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించింది. స్థానిక కేడర్ల పంపిణీ పూర్తయ్యే వరకు పరిపాలనా చర్యలపై పరిమితులు ఉంటాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.



అవ్వకు స్వయంగా ప్రసాదం అందిస్తున్న టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర

## ఈ జన్మకు ఇది చాలు స్వామీ!

### విఐపి బ్రేక్ దర్శనంతో పులకించిన 116యేళ్ల అవ్వ

### అంతటి వృద్ధాప్యంలోను కాలినడకన తిరుమలపైకి

**తిరుమల,జులై 6ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా రాజ్యాంగహోదాలోని ప్రముఖులకు లభించే విఐపి ప్రోటోకాల్ బ్రేక్ దర్శనం తరహాలో ఎలాంటి ఆర్భాటంలేకుండా 116ఏళ్ళ అవ్వకు ఆమె కుటుంబానికి దక్కడం సాక్షాత్తు ఆ దేవదేవుడు ఇచ్చిన అరుదైన అవకాశం. శతాధిక వయస్సు దాటినా ఆ అవ్వకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై అచంచలమైన భక్తివిశ్వాసాలు కలిగి ఉండటమే ఇందుకు నిదర్శనం. 116 ఏళ్ల వయస్సులోనూ మూడురోజుల క్రిందట అలిపిరి మెట్లదారిలో కాలినడకన తమిళనాడుకు చెందిన నవనీతమ్మ సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆ స్వామిని ప్రత్యేక దర్శనం చేసుకుని పులకించిపోయింది. ఈ జన్మకు ఇది చాలుస్వామీ అంటూ అవ్వ మనస్సులోనే ఉత్సాహం చూపింది. నవనీతమ్మ కాలినడకన తిరుమలకు రావడం, ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ >>2



## ఇంకా అన్వేషణే

### గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

### మరో ఘటనలోని 20 మంది సురక్షితం

### కర్రి చిన్నను జాగ్రత్తగా తీసుకు వస్తున్నాం: విశాఖ రేంజి ఐజి గోపీనాథ్ జెట్టి

**విశాఖపట్నం, జులై 6 ప్రభాత వార్త:** విశాఖ సముద్ర తీరానికి సమీపంలో గల్లంతైన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులోని ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరాయంగా కొనసాగుతుందని విశాఖ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గోపీనాథ్ జెట్టి తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన గాలింపు చర్యల వివరాలను వెల్లడించారు.జూలై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పడవ జూలై 4న తిరిగి చేరుకోవాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా ప్రమాదానికి గురై గల్లంతైందన్నారు. పడవలో మొత్తం ఏడుగురు మత్స్యకారులు ఉండగా, వారిలో కర్రి చిన్నను పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని తెలిపారు. మిగిలిన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. జూలై 4 అర్ధరాత్రి సమయంలో సమాచారం అందిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు భారత తీర రక్షక దళం, భారత నౌకాదళాన్ని అప్రమత్తం చేసి సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత తీర రక్షక దళానికి చెందిన రెండు నౌకలు, భారత నౌకాదళానికి చెందిన రెండు నౌకలు ప్రమాదం జరిగిన ప్రాంతంలో నిరంతర గాలింపు నిర్వహిస్తున్నాయన్నారు. అదేవిధంగా నౌకాదళం, తీర రక్షక దళానికి చెందిన డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్లు సముద్రంపై వైమానిక గాలింపు కొనసాగిస్తున్నాయని చెప్పారు. విశాఖపట్నంలోని ప్రాంతీయ ఆపరేషన్స్ స్టేషన్ (రోస్ ) ద్వారా ఎలక్ట్రానిక్ నిఘా కూడా నిరంతరం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం సముద్రంలో నాలుగు మీటర్ల వరకు ఎత్తైన అలలు, గంటకు సుమారు 50 నాటికల్ మైళ్ల వేగంతో వీస్తున్న గాలుల కారణంగా గాలింపు, రక్షణ చర్యలకు తీవ్ర >>2



సోమవారం ముగ్గురు అదనపు న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్

## ముగ్గురు జడ్జిల ప్రమాణ స్వీకారం

**విజయవాడ,జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులుగా సోమవారం ప్రమాణం చేశారు.హైకోర్టు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం,ఆలపాటి గిరిధర్,పురుషోత్తమ్ కుమార్ చింతలపూడిలచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనియామకాలతో ఏపీ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29నుంచి 32కు చేరింది. ఈకార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు,బార్ కౌన్సిల్ ప్రతినిధులు,హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులురిజిస్ట్రార్లు,న్యాయశాఖ అధికారులు,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు కొన్ని చోట్ల ఈదురుగాలులతో వానలు

**విజయవాడ,జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీరం దాటినట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన ఆరు గంటలలో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయువ్యదిశగా కదిలిన వాయుగుండం.. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటినట్లు సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాయుగుండం రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేనట్లు తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసేనట్లు పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు,మంగళవారం ఈ పరిస్థితి ఉండవచ్చని, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వర్షం కురిసే సమయంలో కల్వర్టులు, కాలువల సమీపంలోకి వెళ్లవద్దని సూచించింది,. ఎల్‌నినో ప్రభావం ఖరీఫ్ సీజన్ మీద పడుతోంది. ఎల్‌నినో కారణంగా అడపాదడపా వానలు పడుతున్నా.. సాగుకు అనుకూల వాతావరణం ఉండటం లేదు. అలాగే కృష్ణా పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలలోనూ జూన్ నెలలో ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు.



ముంబయిలో భారీ వర్షాలకు కాలువలా కనిస్తున్న ఓ రహదారి

### ముంబయి నుంచి కాశ్మీర్ దాకా

## వరద ముంపు

### ఉగ్రరూపంతో ప్రవహిస్తున్న నదులు

### కొండచరియలు విరిగిపడి పలువురు దుర్మరణం

### వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

### మహారాష్ట్రలో భారీ వర్షాలకు 10మంది మృతి

**శ్రీనగర్,జులై 6:** జమ్మూకశ్మీర్‌లో అటు ప్రకృతి విపత్తు ఒక విలయంగా మారింది. దోడాకిశ్త్‌వాడ్ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా చీనాబ్ నది ఉగ్రరూపం దాల్చింది. రాంబన్ జిల్లాలోని బగ్లిహార్ డ్యామ్ ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అధికారులు సోమవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లను ఎత్తివేసి నీటిని కిందకు విడుదల చేశారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, మునుపెన్నడూ లేని విధంగా డ్యామ్ గేట్లను తెరవడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ ప్రాంతంలో ఒక్కసారిగా మేఘ విస్ఫోటం సంభవించడంతో ఊహించని రీతిలో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడటంతో రహదారులన్నీ బురదమయంగా మారాయి. ఈ ప్రకృతి ప్రకోపానికి కిశ్త్‌వాడ్‌లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు సైట్ తీవ్రంగా దెబ్బతింది. కొండల నుంచి దూసుకొచ్చిన భారీ రాళ్లు, మట్టి పెళ్లల కింద ప్రాజెక్టుకు చెందిన అనేక వాహనాలు, మిల్లులు, ఇతర యంత్రాలు పూర్తిగా కూరుకుపోయాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, భారత ఆర్మీ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. భారీ యంత్రాల సహాయంతో బురదను తొలగించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. బాధితులకు, పర్యాటకులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది ఈ వరద విపత్తుల నడుమ సింధు జలాల ఒప్పందం పై భారత్ తన కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్తాన్ శాశ్వతంగా, నమ్మదగిన రీతిలో స్వస్తి పలికే వరకు 1960 నాటి ఈ ఒప్పందం సస్పెన్షన్ లోనే ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ >>2

7-7pg2exHMNWJQE_7-7pg2exHMNWJQE.qxd 06/Jul/26 11:58 PM Page 1





సోమవారం జకార్తాలో ప్రధాని మోదీతో ముచ్చటిస్తున్న ప్రవాస భారతీయులు

## యుద్ధవిమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం

>> విమానాలతో స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ప్రధాని మోదీ విమానం నుంచి వీక్షించారు. ప్రస్తుతం ఈజెట్ రక్షణగా వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.రాజధాని జకార్తాకు చేరుకున్న మోడీకి ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా స్వాగతం పలికారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరోసారి చాటిచెప్పారు. మోడీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన క్షణం నుంచి ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ప్రత్యేక ఎస్కార్ట్‌ను అందించాయి. భారత ప్రధాని విమానాన్ని జకార్తా వరకు భద్రతా పరిరక్షణతో వెంట తీసుకెళ్లడం ద్వారా ఇండోనేషియా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ప్రదర్శించింది. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, దౌత్య ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా భారత్‌ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, సముద్ర భద్రత, ఇండోపసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా భారత్‌ఇండోనేషియా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోడీ పర్యటనలో పలు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశమున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి.

# ఇంకా అన్వేషణే

>> ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ అందుబాటులో ఉన్న అన్ని వనరులతో 72 గంటల ప్రామాణిక సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మరొక 24 గంటల పాటు తొలి విడత రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని, తాజా సమాచారం అందిన వెంటనే వెల్లడిస్తామని గోపీనాథ్ జెట్టి తెలిపారు. బాధిత కుటుంబాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాత్రికే ఒడ్డుకు చిన్నను తీసుకొస్తాంమెర్చంట్ వెసెల్‌లో సురక్షితంగా ఉన్న కర్రి చిన్నను తీరానికి తీసుకురావడానికి కోస్ట్ గార్డ్, నౌకాదళం ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మరో నౌకకు మార్పిడి చేయడం లేదా హెలికాప్టర్ ద్వారా తరలించడం ప్రమాదకరంగా ఉండటంతో ఆపరేషన్‌ను జాగ్రత్తగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో విశాఖ పోర్టు అధికారులతో చర్చించి సంబంధిత వాణిజ్య నౌకకు ముందుగానే బెర్తింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇదే క్రమంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ మత్స్యకారులంతా వేటకు వెళ్లటప్పుడు తప్పకుండా బోటుకున్న ట్రాన్స్ పాండర్ ను తప్పకుండా ఆన్ చేసి ఉంచాలని విజ్ఞప్తి చేశారు.మరొక ఘటనలో 20 మందిని సురక్షితంగా రక్షించారు. ఇదిలా ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇంజిన్ దెబ్బతిని సముద్రంలో చిక్కుకుపోయిన మరొక మత్స్యకార పడవలోని 20 మంది మత్స్యకారులను కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, భారత తీర రక్షక దళం, ఒడిశా మెరైన్ పోలీసు సంయుక్తంగా సురక్షితంగా రక్షించారని తెలిపారు. **ఆరు గంటల పాటు తిరగబడిన బోటుపైనే ఉన్నారు : ఎమ్మెల్యేవంశీ** "నేను కర్రి చిన్నాతో మాట్లాడాను. ఆయన చెప్పిన దాని ప్రకారం. నాలుగో తేదీ సాయంత్రం 3.00 గంటల ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న బోటు సాంకేతిక సమస్యల వల్ల తిరగబడిపోయింది. ఆ సమయంలోనే కర్రి చిన్న వాళ్ల అన్నయ్య బోటు కిందకు పోయారు. మిగిలిన వారంతా తిరగబడిన బోటుపైనే రాత్రి 9.00 గంటల వరకు ఉన్నారు. ఆ బోటు క్రమేపీ మునిగిపోయింది. తెడ్డు ఆధారంగా వారంతా కొంత దూరం ఈదుకుంటూ వచ్చారు. వస్తూ వస్తూ ఉండగా ఒకిద్దరు మధ్యలో ఆగిపోయారు. నలుగురు కొంతవరకు వచ్చి ఆగిపోయారు. చిన్న ఒక్కడే ఈదుకుంటూ వచ్చి అక్కడికి దగ్గరలో లంగరు వేసి ఉన్న పనామా జెండాతో ఉన్న షిప్‌ను పట్టుకున్నడు. గట్టిగా అరవటంతో అందులో ఉన్న సిబ్బంది చూసి లైఫ్ జాకెట్ ఇచ్చి చిన్నాను రక్షించారు" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వివరించారు.

## పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం,అలసత్వం ఉండకూడదని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఆయా ప్రభుత్వ శాఖల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కార్యచరణ చేపట్టాలన్నారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని ఆయన స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలి. విశాఖ సముద్ర తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏపీ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. 5 రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు నియంత్రణా తగ్గాలి... గంజాయి మూలాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. కార్పోరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ద పెట్టాలని ఆదేశించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

## నాగరాజు కస్టడీ షరతుల సవరణపై నేడు హైకోర్టు తీర్పు

**విజయవాడ.జూలై6,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులోనిందితుడిగా ఉన్న సస్పెండైన సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు షరతులు విధించింది. ఈ షరతులను సవరించాలని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు పూర్తికాగా, హైకోర్టు తన తీర్పును రేపటికి రిజర్వ్ చేసింది.చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక వాదనలు వినిపించారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతులు కారణంగా దర్యాప్తు ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిందితుడిని ప్రశ్నించే విధానంలో విధించిన పరిమితులు దర్యాప్తు సమగ్రతను ప్రభావితం చేస్తాయని వాదించారు. విచారణ సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించాలని తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే ఆడియో రికార్డింగ్ చేయడం వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టుకు వివరించారు.నిందితుడు నాగరాజు తరఫున కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించడం వల్ల ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదించారు. దర్యాప్తు అవసరాల దృష్ట్యా ఈ విధానం సమంజసమైనది పేర్కొన్నారు.నాగరాజు తరపు న్యాయవాది భిన్న వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని పొంచి ఉందని, భద్రతాపరమైన కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించకూడదని హైకోర్టును అభ్యర్థించారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న హైకోర్టు, ఈ అంశంపై మంగళవారం ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది.

## పలువురు ఐపిఎస్ అధికారుల బదలీ

**విజయవాడ.జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాలకు ఓఎస్డీలను, అదనపు ఎస్పీలను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా మార్కాపురం జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి (రాజమండ్రి) అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు. అలాగే మండా జావలి ఆల్ఫోన్స్‌ను పోలవరం జిల్లా ఓఎస్డీగా నియమించారు. అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉన్నతాధికార వర్గాలు వెల్లడించాయి.

# 3 రీజియన్లలో క్రీడా సిటీలు

>> లకు సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో మూడు ప్రాంతాల్లోనూ స్పోర్ట్స్ సిటీల అభివృద్ధి జరగాలన్నారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంలో సూర్య లంక సహా వివిధ ప్రాంతాల్లోని బీచ్ ఫ్రంట్ లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లోని 51.88 చదరపు కి.మీ. విస్తీర్ణంలో వైజాగ్ బే సిటీ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేలా ప్రముఖ సంస్థల్ని ఆహ్వానించాలన్నారు. బే సిటీలో 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యత ఉందని గుర్తించినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే విశాఖ ఎకనామిక్ రీజియన్లో ఇప్పటికి మొత్తం 49 ప్రాజెక్టులు రాగా...వీటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని, మరో 12 త్వరలో గ్రౌండ్ కానున్నాయని అధికారులు వివరించారు. మరో 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయని చెప్పారు. అయితే వీటితో పాటు వచ్చే 3 నెలల్లో లక్ష చదరపు అడుగుల్లో ఇంటర్నేషనల్ కన్వెన్సన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అరకు పాడేరువిశాఖను పర్యాటక సర్కిల్‌గా రూపొందించి ప్రత్యేక ఆకర్షణ తీసుకురావాలన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లతో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందన్నారు. వెల్నెస్ సెంటర్లకు ప్రత్యేకంగా భూ కేటాయింపులు జరపాలన్నారు. రాష్ట్ర జనాభాలో 32 శాతం అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో నివసిస్తున్నారని, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. భౌగోళికంగా రాష్ట్రానికి మధ్యలో ఉండటం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండటం ఏఈఆర్‌కు కలిసొచ్చే అంశమని అన్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం...మొత్తం 9 జిల్లాలు అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఉండగా వీటిలో అన్నింటికన్నా కృష్ణా జిల్లా తలసరి ఆదాయంలో ముందుందని అధికారులు చెప్పారు. జిల్లాల వారీగా రీజియన్ అభివృద్ధి జరిగేలా వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు, కొల్లేరసరస్సును రీజియన్ అభివృద్ధి కోసం వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు.

**వీఈఆర్, ఏఈఆర్‌తో పోటీపడేలా టీఈఆర్:** ఖనిజ సంపద నుంచి హార్టికల్చర్ వరకు...పుణ్యక్షేత్రాల నుంచి పర్యాటక ప్రాంతాల వరకు రాయలసీమకు ఉన్న అనుకూలతను మార్కెటింగ్ చేసుకోవాలని సీఎం అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తే పెద్దఎత్తున పెట్టుబడులు... తద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీ పడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి జరగాలన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఐఐటీ వంటి విద్యా సంస్థలు, గోల్డ్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరులు రాయలసీమ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గండికోట, హార్సిలీహిల్స్, తలకోన వంటి పర్యాటక ప్రాంతాలను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. శ్రీసిటీ దేశంలోనే నెంబర్ వన్ ఇండస్ట్రియల్ పార్క్‌గా నిలుస్తోందని, అలాగే ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్... ఇలా అన్ని రంగాల్లోనూ పెట్టుబడులకు తిరుపతి రీజియన్ అనుకూలమన్నారు. ఇచ్ఛాపురం నుంచి చెన్నయ్ వరకు నాలుగు వరుసల రైల్వే లైన్ వస్తోందని... మౌలిక వసతులను వినియోగించుకుని టీఈఆర్‌ను మరింతగా ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచన చేయాలన్నారు.

**0.90 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా టీఈఆర్:** స్వర్ణాంధ్ర 2047 విజన్ మేరకు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా ..తిరుపతి ఎకనమిక్ రీజియన్ వాటాగా 0.90 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యం పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. టీఈఆర్ ప్రణాళికల కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య...మొత్తం 9 జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రతీ 2 నెలలకు ఒకసారి 3 ఎకనామిక్ రీజియన్లపై సమీక్ష నిర్వహిస్తామని సీఎం అన్నారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈ మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్,

## డి.సిఎం పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు

**గన్నవరం(కృష్ణా), జులై 6, ప్రభాతవార్త :** ఎన్నికలకు ముందు తన కుమార్తె మరణానికి కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన జనసేనాని పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత కేసును నీరుగార్చేవిధంగా మాట్లాడుతూ తమన మోసం చేసారని సుగాలి ప్రీతీ తల్లి పార్వతి సోమవారం కృష్ణాజిల్లా గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసారు. గత ఎన్నికల సమయంలో సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి అంశాన్ని తరచు ఎన్నికల సభలలో ప్రస్తావించిన పవన్ కళ్యాణ్ తాము అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా ప్రీతి కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పార్వతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రీతి కేసులో సాక్ష్యాలు లేవంటూ నిందితులకు మేలు చేకూర్చేలా మాట్లాడుతూ తమ కుటుంబాన్ని మోసం చేసారని ఆమె ఆరోపించారు. తమను మోసం చేసిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పార్వతి ఫిర్యాదుపై విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని గన్నవరం సిఐ శివప్రసాద్ తెలిపారు. కాగా ఈకేసులో నేరానికి సంబందించిన అంశాలు లేనందున కేసు నమోదు చేసే అవకాశాలు లేవనే చెప్పాలి. ఈఉదతంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోలీసు కేసులు పెట్టడం సాధ్యమా కాదా అన్న అంశం తీవ్ర చర్చనీయంశంగా మారింది.

## లిక్కర్ రవాణా స్కామ్ కేసులో రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్

**విజయవాడ.జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ రవాణా స్కామ్ కేసులో రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసారు..రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని నాంపల్లి కోర్టులో ఎ2 రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌లో కోరారు..ఈ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 13కు వాయిదా నాంపల్లి కోర్టు వేసింది.ఈ క్రమంలో ఇదే కేసులో .నిందితులు వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, కారుమూరి సునీల్‌ను వారం రోజులు కస్టడీ కోరుతూ పిటిషన్ ఈడీ దాఖలు చేసారు. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది.

## అయోధ్య ట్రస్టు తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణమోహన్

**అయోధ్య,జులై 6:** అయోధ్య రామమందిర్ విరాళాల చోరీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. విరాళాలు కాజేసిన నిందితులు పట్టుబడేంత వరకు పదవిలో కొనసాగబోనని జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, కోశాధికారి అనిల్ మిశ్రాలు సమర్పించిన రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. అనంతరం ట్రస్టీ సభ్యుల్లో ఒకరైన మధ్యంతర కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. త్వరలోనే సంస్థాగత సమీక్ష అనంతరం తాత్కాలిక కోశాధికారి పేరును కూడా వెల్లడిస్తామని ట్రస్టీ తెలిపింది. ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామ జన్మభూమి కాంప్లెక్స్‌లో సోమవారం శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ మూడుగంటలకు పైగా సమావేశమైంది. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాలను ఆమోదించిన ట్రస్టీ తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. అనంతరం ట్రస్ట్ కోశాధికారి స్వామీ గోవింద్ దేవ్ గిరి మీడియాతో మాట్లాడుతూ రామ మందిర్ విరాళాల చోరీ ఘటన తమ సంఘాన్ని తీవ్రంగా బాధించిందని చెప్పారు. రామమందిర్ విరాళాల చోరీ మమ్మల్ని చాలా బాధించింది. పెద్దమొత్తం కాజేశారా చిన్న మొత్తమా అనేది రెండో విషయం. అంతకంటే ముఖ్యంగా అలాంటి పవిత్రమైన చోట విరాళాల చోరీ జరగడం మమ్మల్ని క్షోభకు గురి చేస్తోందని గోవిద్ దేవ్ గిరి ఆవేదన వ్యక్తం చేశారు. విరాళాల చోరీకి బాధ్యులైన వారిని పట్టుకునేంతవరకు తాను కార్యదర్శిగా కొనసాగడం సమంజసం కాదని చంపత్ రాయ్ రాజీనామా చేశారని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామాను అంగీకరించడం లేదా తిరస్కరించం వంటివి ఎక్కువ రోజులు మా చేతుల్లో ఉండవు. రాజీనామాను వెంటనే ఆమోదిస్తాం. మాకు వేరే దారి లేదని గోవింద్ దేవ్ గిరి తెలిపారు. జూలై 22వ తేదీన మరోసారి సమావేశం అవుతామని ట్రస్ట్ వెల్లడించింది. ఈ సమావేశంలో ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్పించిన తుది నివేదికను సమీక్షిస్తామని, ఆ తర్వాత కొత్త సభ్యులను, కార్యవర్గాన్ని నియమిస్తాని తెలిపింది.



ముంబై ప్రాంతంలో భారీ వర్షాలకు విరిగిపడిన వృక్షాలు

# భారత్ ఎఐ రాజధానిగా ఎపి

>> డీప్‌టెక్, ఫ్రాంటియర్ టెక్, అధునాతన తయారీ హబ్ లలో పెట్టుబడులు కొరియన్ సంస్థలకు లాభసాటి కాగలవని మంత్రి లోకేష్ చెప్పారు.

**అమరావతిలో తొలి క్వాంటంఏఐ యూనివర్సిటీ:** ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం మాధ్యేయం. ఇందులో భాగంగా గూగుల్ ఏఐ హబ్ (ఏప్రిల్ 2026లో శంకుస్థాపన చేశాం. రిలయన్స్, సిఫీ, కంట్రోల్‌ఎస్ తదితర సంస్థలు ఏపీలో 10 గిగావాట్ల డేటాసెంటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాయి. తద్వారా స్టార్టప్‌లకు సరసమైన ధరలకు పెద్ద ఎత్తున కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. భారతదేశపు మొట్టమొదటి క్వాంటం, ఏ ఐ విశ్వవిద్యాలయం అమరావతి క్వాంటం వ్యాలీలో ఆవిష్కృతమవుతోంది. దీనిద్వారా భారతదేశపు అత్యంత అధునాతన 133క్యూబిట్ ఐబీఎం క్వాంటం సిస్టమ్ టూల్, ఐబిఎం - టిసిఎస్ క్వాంటం క్లౌడ్ సర్వీసెస్, ఒక క్వాంటం హార్డ్‌వేర్ పార్క్ అందుబాటులోకి రానున్నాయి. కొరియన్ డీప్‌టెక్ స్టార్టప్‌ల పరిశోధన, సహఅభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయండి:** దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ సీఈవో లీ చియాంగ్‌గెన్ తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... షూఆల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఎంవోయూ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రూ.300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆర్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేసి, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా మార్చాలని కోరారు. షూఆల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్ మాట్లాడుతూ... మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్సార్ప్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బాక్టీరియల్ మెటీరియల్స్ ఏకీకరణతో ఎం ఎఫ్ డి ఎస్ సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్ తయారీలో తమ సంస్థ ప్రత్యేకతకలిగి ఉందని చెప్పారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి ఏఐ స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్ అన్నారు.

# ఒప్పందమా! యుద్ధమా?

## ఇప్పటికీ చర్చల ద్వారానే పరిష్కారం ఆశిస్తున్నా

### 9.1కోట్లమంది ఇరాన్‌ప్రజలకు హానిచేయకూడదనే భావిస్తున్నా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్,జులై 6:** అమెరికాతో ఇరాన్ ఒప్పందం చేసుకోకపోతే మిషన్ పూర్తి చేస్తామంటూ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేసారు. ఓవక్క ఇరాన్‌లో దివంగత సుప్రీం లీడర్ అయొతుల్లా ఖొమైనీ అంత్యక్రియల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్‌కు ఆగ్రహాన్ని రప్పించాయి. అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న వేళ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. అయితే తాను ఇప్పటికీ చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నానని కూడా వెల్లడించారు. ట్రంప్ మాట్లాడుతూ ఒప్పందం జరిగినా, జరగకపోయినా చివరికి గెలిచేది అమెరికానే అని అన్నారు. అయితే 9.1 కోట్ల మంది ఇరాన్ ప్రజలకు ఎలాంటి హాని జరగకూడదనే ఉద్దేశంతో తాను ఒప్పందానికే ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. ఇరాన్ ఇప్పటికే కొన్ని అంశాల్లో అమెరికాకు హామీలు ఇచ్చిందని, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే చర్చల ప్రక్రియలో భాగంగా ఇరాన్ వద్ద ఉన్న అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియాన్ని కూడా అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల ఇరాన్‌పై చేపట్టిన చర్యల ఫలితంగానే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గాయని ట్రంప్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా చూపిన కఠిన వైఖరి కారణంగా చమురు ధరలు ఉద్రిక్తతలకు ముందున్న స్థాయికంటే కూడా తగ్గాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావాలన్న ఉద్దేశం తమకు లేదని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చల ద్వారా పరస్పర అంగీకారంతో శాంతియుత పరిష్కారం సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని మరోసారి వెల్లడించారు.

# ఈ జన్మకు ఇది చాలు స్వామీ!

>> కావడంతో ఆమె భక్తికి పలువురు ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సోషియల్ మీడియా ఖాతాల్లో భక్తికి వయస్సు అడ్డురాలేదని, శ్రీవారిపై భక్తులకు ఉన్న విశ్వాసానికి ఈ వృద్ధురాలే నిదర్శనమని పోస్ట్ చేశారు. ఈ క్రమంలో వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా ఆదివారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ సూచనలతో టిటిడి విజిలెన్స్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, తమిళనాడు చెన్నైకు చెందిన నవనీతమ్మ తిరుపతిలో ఉన్నట్లు కనుగొన్నారు. ఛైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నవనీతమ్మతోపాటు ఆమె కుటుంబ సభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించారు. ఛైర్మన్ కార్యాలయం సిబ్బంది స్వయంగా ఆమెను బయోమెట్రిక్ కేంద్రం నుండి ఆనందనిలయం వరకు వెంట ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శతాధిక వృద్ధ భక్తురాలికి వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం నవనీతమ్మ మనవడు దిక్పతి మాట్లాడుతూ ఆ దేవదేవునిపై అచంచల భక్తివిశ్వాసాలే శ్రీవారి రూపంలో టిటిడి అధికారులు తమ అమ్మమ్మతో పాటు కుటుంబ సభ్యులకు ఎంతో గొప్ప దర్శనభాగ్యాన్ని కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయం వెలుపల టిటిడి సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన తరువాత 116ఏళ్ల అవ్వ తిరుమలలో భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

# ముంబయి నుంచి కాశ్మీర్ దాకా వరద ముంపు

>> శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు.

**ముంబయి,థాణె,రాయ్‌గడ్‌ప్రాంతాల్లో జల విలయం**

**ముంబయి,జులై 6:**భారీ వర్షాలు మహారాష్ట్రను కుదిపేస్తున్నాయి. ముంబై, పుణె, థానే, రాయగడ్ ప్రాంతాలు వానలకు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలకు సోమవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఒకరు గల్లంతయ్యారు. ఎడతెరిపి లేని వానలతో పుణె జిల్లా మావల్ తహసీల్‌లోని పటాన్‌లో ఈరోజు తెల్లవారుజామున 4:25 గంటలకు పలు ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 30 నుంచి 35 మంది గ్రామస్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ కొండచరియలు విరిగిపడ్డాయని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనతో ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపుణె హైవేపైభారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని ఆయన వెల్లడించారు. సుమారు 100 టన్నుల శిథిలాలు ఒక్కసారిగా ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేపై పడ్డాయని పేర్కొన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని.. ఇప్పటివరకు దాదాపు 70 శాతం శిథిలాలను తొలగించినట్లు సీఎం వివరించారు.



పూణే ప్రాంతంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్

పుణె నుంచి ముంబైకి వెళ్లే ట్రాఫిక్ కోసం ఒక లేన్‌ను తిరిగి తెరిచామని, రాబోయే కొన్ని గంటల్లో ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిస్థాయిలోపనిచేస్తుందని ఆయన వెల్లడించారు. 16 రైళ్లను రద్దు చేయగా మరికొన్నింటిని దారి మళ్లించారు. భద్రతా కారణాల దృష్ట్యాముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపూణే హైవేపై రాకపోకలను కూడా తాత్కాలికంగా నిలిపి వేశారు. అత్యసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

## వారం - వర్జ్యం

07-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
సప్తమి మ.1.20
ఉత్తరాభాద్ర సా.4.19
వర్జ్యం : తె.4.07-తె.5.41,
దు.ఉ.8.17-ఉ.9.09, 2)రా11.59-రా.12.51
శుభసమయం : ఉ.9.30-10.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. వస్త్రలాభం కలదు.

**వృషభం:** భూవివాదాలు తీరి లబ్ది పొందుతారు. కొన్ని ఆర్థిక కారణాల వల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. పెట్టుబడుల విషయాలలో నిదానం అవసరం.

**కర్కాటకం:**కళలు, రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్త్రలాభం.

**సింహం:**ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. కొత్త పెట్టుబడులకు అనుకూలం. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** విద్యావరంగా పురోభివృద్ధి బాగుంటుంది. నూతన వైద్య, విధానములు అనుకూల ఫలితములను ఇస్తాయి.

**తుల :**వృత్తి సంబంధమైన వ్యవహారాలలో ఒత్తిడి అధికం అవడం వల్ల శరీరం అలసటకు గురౌతుంది. బంధువుల కలయిక.

**వృశ్చికం:** బ్యూటీపార్లర్లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. ఎదుటి వారి విషయాలలో జోక్యం చేసుకోవద్దు.

**ధనుస్సు:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఈ రోజు మరిన్ని అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**మకరం:** అవసరమైన సమాచారము కొరకు ధనమును, పాత పరిచయములను ఉపయోగిస్తారు. వాహనాలు కొనుగోలు.

**కుంభం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. కాని దైవాను గ్రహం వలన మీ ఊహ వాస్తవికతకు దూరం అవుతుంది.

**మీనం:** ఆర్థిక వ్యవహారాలలో పురోగతిని సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

7-7Pg3exHMNWJQEK_7-7Pg3exHMNWJQEK.qxd 06/Jul/26 11:39 PM Page 1



## ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణకు ప్రభుత్వ ఆదేశాలు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా ఉపాధిలో కీలకమైన స్థానిక కేడర్ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యక్ష నియామకాల నియంత్రణకు సంబంధించి పలు ఆదేశాలు ఇచ్చింది. కేడర్ బలాన్ని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది బలాన్ని నిర్ధారించడం, పంపిణీ చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులు- 2025 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణకు ప్రభుత్వం ఈ ఆదేశాలిచ్చింది. కేడర్ బలం నిర్ధారణ, పంపిణీకి మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుత ఉద్యోగుల లోకల్ కేడర్‌ను ఆయా విభాగాధిపతులు నిర్ధారిస్తారు. ఈ విభజన భవిష్యత్తు ప్రత్యక్ష నియామకాలపై ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 26 జిల్లాలకు లోకల్ కేడర్ నిర్ధారిస్తారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలు ఈ పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ జిల్లాలకు ఉద్యోగులను తాత్కాలికంగా కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.

## రావణ్‌కు 18వరకు రిమాండ్ రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై నమోదైన కేసులో కోర్టు అతనికి రిమాండ్ విధించింది. బచ్చులకూరి జోసెఫ్‌పై గన్నవరానికి చెందిన జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ బిఎన్ఎస్‌లోని 152 సహా పలు సెక్షన్లు, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)లోని సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలు మోపారు. రావణ్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 18 వరకు రిమాండ్ విధించారు. యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చులకూరి జోసెఫ్) రిమాండ్ రిపోర్టులో గన్నవరం పోలీసులు కీలక అంశాలు పేర్కొన్నారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. "యువత, విద్యార్థులను రావణ్ రెచ్చగొడుతున్నాడని, అతడిపై తెలుగు రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి. రావణ్ నిషేధిత మావోయిస్టు సంస్థ వైపు యువతను ఆకర్షించేలా ప్రకటనలు చేస్తున్నారు. రావణ్‌పై రాష్ట్ర వ్యాప్తంగా 9 కేసులు నమోదయ్యాయి. మతపరమైన విభేదాలు రెచ్చగొట్టేలా రావణ్ తీరు కనిపిస్తుంది. రాష్ట్రంలో అశాంతిని సృష్టించి యుద్ధం చేయాలనే ఉద్దేశం రావణ్‌లో ఉంది. ఇటీవల ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో రావణ్ రెచ్చగొట్టేలా మాట్లాడారు. రావణ్ అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. పదవుల్లో ఉన్న వారిని రావణ్ దూషించారు. రావణ్, వ్యవస్థలపై ప్రజల్లో ద్వేషం, వైషమ్యాలు సృష్టిస్తున్నారు. మావోయిస్ట్ హిడ్మాను కీర్తిస్తూ రావణ్ ప్రసంగాలు చేశారు. మావోయిస్టు భావజాలాన్ని రావణ్ ఫోన్‌లో గుర్తించాం. దేవుళ్లను అవమానించడం, కించపరచడమే లక్ష్యంగా రావణ్ పని చేస్తున్నారు. రావణ్ పేరు పెట్టుకోవడం కూడా అందులో భాగమే. రావణ్‌కు సహకరిస్తున్న వ్యక్తులు ఎవరో తేల్చాల్సి ఉంది. నిందితుడు రావణ్ విచారణకు సహకరించటం లేదు" అని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

## విదేశీ పెట్టుబడుల కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌ల నియామకం

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశీ పెట్టుబడుల కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో పెట్టుబడుల కోసం ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువని ప్రభుత్వం నియమించింది. పశ్చిమాసియా, ఇతర దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావిని నియమించింది. యూరప్‌కు ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమించింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లపోతు నియమించింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సమన్వయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. జీఓ ఆర్టీ నంబర్ 1333 ద్వారా ఈ నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ అనుసంధానంపై ఏపి ప్రభుత్వం దృష్టి సారించింది.

## ధైర్యంగా ఉండండి

- గాలింపు చర్యలు ముమ్మరం చేశారు
- గల్లంతైన మత్స్యకార కుటుంబాలకు బిజెపి చీఫ్ మాధవ్ పరామర్శ
- చేపల వేటకు వెళ్లే వారికి బీమా తప్పనిసరిగా చేయాలని వినతి



**విశాఖపట్నం, జులై 6 ప్రభాతవార్త:** విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతు కావడం అత్యంత దురదృష్టకరమని, వారిని క్షేమంగా తీసుకురావడానికి ప్రభుత్వ యంత్రాంగాలు అన్నీ సమన్వయంతో పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. సోమవారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్న ఆయన గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, కేంద్ర సంస్థలు బాధిత కుటుంబాలకు అండగా ఉంటాయని భరోసా కల్పించారు. అనంతరం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో ఘటనపై సమీక్ష నిర్వహించి గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ నౌకలు, ఇతర రక్షణ బృందాలతో గాలింపును మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వేటకు వెళ్ళే మత్స్యకారులకు ప్రమాద బీమా తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా లైఫ్ జాకెట్లు కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయాలని ఆవిధంగా చేస్తే వారి ఆచూకీ తెలుసు కోవడానికి మార్గం సులభంగా ఉంటుందని అన్నారు. మెకనైజ్డ్ బోట్లుకు జిపిఎస్ అందుబాటులోకి తీసుకు రావడంతో రక్షణ చర్యలు పర్యవేక్షణ పెంచాలని, మత్స్యకారులు వేటకు వెళ్ళే మెకనైజ్డ్ బోట్లు కోస్టు గార్డ్ కార్యాలయానికి జిపిఎస్ విధానం అనుసంధానం చేయాలని మాధవ్ సూచించారు. ప్రతి క్షణం విలువైనదేనని, గాలింపు చర్యల్లో ఎలాంటి అలసత్వం లేకుండా యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని ఆయన అధికారులను కోరారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో విద్యుత్ పరికరాల తయారీ యూనిట్ పెట్టండి

- హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పోరేషన్ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో మంత్రి లోకేష్ భేటీ
- ఎపిలో మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయండి
- సాఫ్ట్-ఇపిఐ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్‌కు మంత్రి వినతి
- సియోల్ సెమీ కండక్టర్స్ డిస్ ప్లే ఫ్యాబ్ నెలకొల్పండి
- సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో లోకేష్



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పోరేషన్ పవర్ సిస్టమ్స్ పియు ప్రెసిడెంట్ యోకోటా తకేషితో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లోని హ్యోసంగ్ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం రూ.8వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ నెట్‌వర్క్ కలిగి ఉందని చెప్పారు. 2034నాటికి 15గిగావాట్ల ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌తో, 160 జి డబ్ల్యు క్లీన్ ఎనర్జీ సాధన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 7,248 ఎండబ్ల్యూ కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటన్నింటికీ భారీ స్థాయిలో 765/800 కె.వి ట్రాన్స్‌ఫార్మర్లు, జిఐఎస్, స్టేట్ కామ్ పరికరాలు అవసరం అవుతాయన్నారు. వీటితోపాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ నేపథ్యంలో, విద్యుత్ పరికరాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాలు తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పోరేషన్ పవర్ సిస్టమ్స్ పి యు ప్రెసిడెంట్ యోకోటా తకేషి మాట్లాడుతూ హో సాంగ్ టీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. (పుణె, ఖేడ్ సిటీ) 2006 నుండి భారత్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది చెప్పారు. భారతదేశంలో 66-800 కె.వి జిఐఎస్ పరికరాలను తయారు చేసే ఏకైక సంస్థ హ్యోసంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మాత్రమేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని యోకోటా తకేషి చెప్పారు.

**జిజన్ ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఈడీ, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ అధికారులతో లోకేష్ భేటీ:** దక్షిణ కొరియాకు చెందిన జిజన్ ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఇడి, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ స్టాఫ్ ఇపిఐ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్‌సుంగ్ చోలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని. డిస్‌ప్లే తయారీదారుల కోసం ఎపిలో మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటుచేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఐఐటీ సహకారంతో ఒక అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్, ఎపిటాక్సీ, ఏమో సివిడి, మైక్రో ఎల్ఇడిలలో ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే సాఫ్ట్‌ఇపిఐ అకాడమీని ఎపి ప్రభుత్వంతో కలిసి ఏర్పాటుచేయాలని కోరారు. సాఫ్ట్ ఈపీఐ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్ మాట్లాడుతూ తమ సంస్థ దక్షిణ కొరియాలో జన్ ఎపివేఫర్లు, మైక్రో ఎల్ఇడి ఉత్పత్తులను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తుందని చెప్పారు. భారత్‌లో ప్రస్తుతానికి ప్రత్యక్ష తయారీ, కార్యకలాపాలు లేవని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు.

**సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో మంత్రి లోకేష్ భేటీ:** సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ 2026లో భారతదేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25శాతం, గత 24నెలల్లో 240 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని చెప్పారు. పరిశ్రమ అవసరాలను గుర్తించి, నైపుణ్యాలను అందించడానికి నైపుణ్యం, కౌసలం పథకాలను ప్రారంభించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కియా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఎల్‌జీ కెమ్, ఎంసీఎన్ఎక్స్ (కెమెరా మాడ్యూల్స్), సోలమ్ (ఏసీ విడిభాగాలు), హ్వాసంగ్ (పాదరక్షలు) వంటి 40కి పైగా కొరియన్ కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉందని, బుల్లెట్ రైళ్లు, రేర్ ఎర్త్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నగరాన్ని నిర్మించడంలో కేంద్రం మద్దతుతో ఏపీ ముందుకెళుతోందన్నారు. ఇటీవల ఇండియా సెమీ కండక్టర్స్ మిషన్ ఆమోదించిన ప్రాజెక్ట్ ఏఎస్ఐపీ, ఏపీఏసీ లిమిటెడ్ కొరియన్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిని శ్రీసిటీ లేదా దాని పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ తమ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీ మాట్లాడుతూ భారత్‌లో తమ సంస్థ ప్రస్తుతం సేల్స్, డిస్ట్రిబ్యూషన్ కార్యాలయానికి మాత్రమే పరిమితమైనట్లు తెలిపారు. భారత్‌లో నేరుగా లేదా జాయింట్ వెంచర్ ద్వారా పెట్టుబడి ప్రణాళికలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ

# వారిది అజమాయిషీ... మాది అభివృద్ధి: కేంద్ర మంత్రి రామ్మోహన్



**శ్రీకాకుళం, జులై 6 ప్రభాతవార్త:** గత ప్రభుత్వ పాలన సమయంలో సమస్యలపై, ప్రజలపై అజమాయిషీ ఉండేది కానీ.. పరిష్కారం, ప్రయోజనాలు ఉండేవి కావని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం నాడు జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. తొలుత హిరమండలం మండలంలోని ధనుపురం గ్రామం వద్ద 29 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను ప్రారంభించారు. అనంతరం పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ నాయుడుకు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్డు నుండి మెళియాపుట్టి వరకు 3.40 కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. పాతపట్నం కేజీబీవిలో 2.55 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన అదనపు వసతి గృహాలను ప్రారంభోత్సవం చేశారు. లోపల గదులను పరిశీలించి సూచనలు చేశారు. పాతపట్నం మండలం కోదూరు వద్ద 2.30 కోట్ల రూపాయలతో నిర్మించిన పీఎం జన్మాన్ హాస్టల్ భవనాలను ప్రారంభించారు. పాతపట్నం మండలం సీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 36 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో ప్రహరీ గోడ, కొత్తూరు మండలం నివగాం నుండి గొట్ట వరకు 2.80 కోట్ల నాబార్డ్ నిధులతో బిటి రోడ్డు, నివగాం నుండి పాతపాడు వరకు 1.50 కోట్ల ఏపీఆర్.ఆర్.పీ నిధులతో నిర్మించిన బిటి రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఎల్.ఎన్.పేట మండలం తాయిమాంబపురం వద్ద బొతాడసింగి వద్ద 2.37 కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సీదిలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు తన కుటుంబంతో పాతపట్నం నియోజకవర్గంకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తామెప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతంలో వేరే పార్లమెంట్ పరిధిలో ఉన్న పాతపట్నం నియోజకవర్గం తన తండ్రి దివంగత ఎర్రంనాయుడు చొరవతో శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో చేరిన వైనాన్ని వివరించారు. రాష్ట్రంలో ప్రజలపై అజమాయిషీ చెయ్యాలని వైసీపీ సర్కారు ప్రయత్నిస్తే మనసారా కోరుకుని కూటమి సర్కారుకు పట్టం కట్టి బరువైన బాధ్యతను అప్పజెప్పారని రామ్మోహన్ నాయుడు అన్నారు. పాతపట్నం నుండి కుప్పం వరకు, అనంతపురం నుండి నెల్లూరు వరకు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టే బాధ్యతను అప్పజెప్పారని అప్పుల ఊబి నుండి అభివృద్ధి వైపు బలమైన అడుగులు వేస్తున్నామని రామ్మోహన్ నాయుడు అన్నారు. అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా ప్రజలకు చేరువ చేశామని రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలను అమలుపరిచి ప్రజామోదాన్ని సంపాదించామని స్పష్టం చేశారు. ఇల్లు, ఫించనులు బాధ్యతగా అందిస్తామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, అధికారులు స్థానికులు పెద్దఎత్తున భాగస్వామ్యం అయ్యారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ఇంకా డోలీ మోతలే!

- కారుమానుకొండలో బాలిక పాము కాటు
- 7 కిలోమీటర్లు డోలి మోతతో వైద్యశాలకు తరలింపు



**పోలవరం, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం జిల్లాలోని కూనవరం మండలం కారుమానుకొండ గ్రామానికి చెందిన చందా సమ్మక్క ప్రియా అనే యువతి పాము కాటుకు గురైంది. దాంతో పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు కొండలపై నుంచి సుమారు 7 కిలోమీటర్ల పాటు ఆ యువతని డోలిలో పెట్టుకొని కాలినడకన సోమవారం ఉదయం కూటూరు ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తెలంగాణలోని భద్రాచలం తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఎత్తైన కొండలపై అనేక కొండారెడ్డి గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు నేటికీ సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో కొండలపై నుంచి ఎక్కటం, దిగటం అనేది ఒక్క కాలినడక మాత్రమే మార్గం ఉంది. రహదారి సౌకర్యం లేని కార్మానుకొండ గ్రామంలో కొండరెడ్డి కుటుంబానికి చెందిన చంద్ర లక్ష్మయ్య కుమార్తె సమ్మక్క ప్రియ. ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. నిద్రమత్తులో ఉన్నప్పుడు తనను ఏదో పురుగు కుట్టిందని భ్రమించిన ఆ యువతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. పాముకాటుకు గురైనట్లు పసిగట్టిన కుటుంబ సభ్యులు ఆ యువతీ నడవలేని స్థితిలో ఉండటంతో డోలి ఏర్పాటు చేసుకొని ఏడు కిలోమీటర్ల పాటు కొండలపై నుంచి దిగి నడుచుకుంటూ సోమవారం ఉదయం కూటూరు పి.హెచ్.సికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా బాలిక పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉంచి వైద్యులు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బాలికను రక్త పింజర పాము కాటుకు గురైనట్టు వైద్యులు గుర్తించారు. ఇప్పటికే రెండు యూనిట్లు ప్లాస్మా ఎక్కించినట్లు వైద్యులు తెలిపారు.



## బిసిల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ లక్ష్యం

- మూడు బడ్జెట్లలో రూ.1.37 లక్షల కోట్ల కేటాయింపుతో చరిత్ర
- బిసి విద్య, గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి భారీ ప్రాధాన్యం: మంత్రి సవిత

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసిల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో బిసిలకు మరోసారి మంచి రోజులు ప్రారంభమయ్యాయని అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బిసి సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ సాధికారత, రాయలసీమ అభివృద్ధి, గత ప్రభుత్వ వైఖరిపై విస్తృతంగా మాట్లాడారు. సమాజంలో సగానికి పైగా ఉన్న బిసిల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. మూడు బడ్జెట్లలో కలిపి రూ.1.37 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించడం చరిత్రలోనే తొలిసారని, బిసిల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, భోజనం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా సాంకేతిక విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో బిసి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మంత్రి తెలిపారు. బిసి విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు శ్రీసత్యసాయి జిల్లా టేకులోడు, విశాఖ జిల్లా సింహాచలంలో రెండు ఎక్సలెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.




గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కొత్త పరిశ్రమను కూడా రాష్ట్రానికి తీసుకురాలేదని మంత్రి విమర్శించారు. 'జె ట్యాక్స్' పేరుతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలను కూడా రాష్ట్రం నుంచి వెళ్లగొట్టిందని ఆరోపించారు. రాయలసీమ అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకమైన అభిమానం ఉందని మంత్రి తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, ఐటి, డిఫెన్స్, విద్య, పర్యాటకం, హార్టికల్చర్ వంటి అన్ని రంగాల్లో రాయలసీమకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలు నేడు పెట్టుబడుల గమ్యస్థానాలుగా మారుతున్నాయంటే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వమే కారణమని మంత్రి సవిత పేర్కొన్నారు.

## ముగ్గురు పిల్లల్ని కంటే నగదు పురస్కారం

- కాన్పుల మధ్య విరామం.. తల్లీబిడ్డకు క్షేమం
- 11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ప్రచారం: మంత్రి సత్యకుమార్



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాన్ని అందచేయనున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో మూడు జంటల(మొత్తం 84 జంటలు)కు రూ.5 వేల చొప్పున నగదును అందచేస్తామని తెలికాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్లపాటు ఎడమ పాటించిన దంపతులకు కూడా నగదు పురస్కారాన్ని ఇస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఆరు ్జటలకు పై విధంగానే రూ.5వేల చొప్పున నగదు అందచేస్తామని మంత్రి తెలిపారు. ఎక్కువ మంది ఉంటే లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్ల వరకు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని పాటిస్తే మాతృత్వ మరణాల్లో 30 శాతం, శిశు మరణాల్లో 10 శాతం వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం, అవాంఛిత గర్భధారణలను నివారించడం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జులై 11 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. "పిల్లల మధ్య ఎడం పాటిద్దాం.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం'' అనే నినాదంతో ఈసారి ప్రచారం సాగనుంది. గర్భధారణకు సరైన సమయాన్ని ఎంచుకోవడం, కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు కలుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పంచాయతీరాజ్ సంస్థలు, పురపాలక సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మహిళా శిశు అభివృద్ధిశాఖ సిబ్బంది, ఇతర ప్రజా భాగస్వామ్య సంస్థలను ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ .చక్రధర్ బాబు తెలిపారు. ఉత్తమంగా పనిచేసిన వైద్యులు, సిబ్బందికి నగదు పురస్కారాలు ఇవ్వనున్నట్లు చక్రధర్ బాబు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కలిపి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.56 లక్షలను విడుదల చేశామని చెప్పారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Lakshmi Narasimha swamy Temple
Balasinganapalli(V), Chennuru(M), Kadapa District
e-Procurement Tender
NIT.No.P/COE/1027/2026, Date:20.05.2026
e-Tenders are invited through the e-Procurement portal for Construction of Compound wall and 3 Storied Rajagopuram. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee


అనేక విత్తనాలను విత్తడం ద్వారా ఏ విధంగా నేల సారవంతమౌతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

న- జెఫర్‌సన్

# అడుగంటుతున్న భూగర్భజలాలు!

నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో భూగర్భమట్టాలు దిగజారిపోతున్నాయి. యేటేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో పెరిగిపోతున్న బోరుబావుల సంఖ్యనే ఉదహరించవచ్చు. భూగర్భ జలాల వాడకం దాదాపు ఎనభైశాతం వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భజలాల భర్తీకి గట్టిప్రయత్నాలు జరగకపోవడంతో మట్టాలు భారీగా పడిపోతున్నాయి. ఈసారి పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో కారణంగా వాతావరణ సంక్షోభంతో భారత్‌లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఏర్పడబోతున్నట్లు వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్‌నినోగా మారడం అత్యంత ప్రమాదకరంగా అంచనాలు వేస్తున్నారు. దేశంలో నైరుతి రుతుపవనాలను అడ్డుకొని వర్షపాతాన్ని బాగా తగ్గించే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితులు వచ్చే యేడాదిలోనూ కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం బాగాపడిపోయే ప్రమాద సంకేతాలు అయితే వెలువడుతున్నాయి. భారతదేశం సాగులో యాభైరెండు శాతానికిపైగా వర్షాధారం మీదనే ఆధారపడి ఉంది. ఈ పరిస్థితుల్లో రుతుపవనాల ప్రభావం ఎల్‌నినోతో తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ రంగం ప్రమాదంలో పడుతుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి. భారత్‌లో 1951 నుంచి ఎల్‌నినో ఏర్పడిన సంవత్సరాల్లో దాదాపు అరవైశాతం లోటుతోనో లేక సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదై వ్యవసాయరంగంపై ప్రభావం చూపింది. ఈ యేడాది చివరి నాటికి బలమైన ఎల్‌నినో ఏర్పడనున్నట్లు చెబుతున్నారు. 1950 నుంచి ఇప్పటి వరకు ప్రపంచంలో 1982, 1991, 1997, 2015లలో సూపర్ ఎల్‌నినోలు వచ్చాయి. నైరుతిలో భారత్ తక్కువ వర్షపాతం నెలకొంటుందని, తూర్పు, పడమర, గాలి వలయం తేమతో కూడిన గాలి పైకి వెళ్లకుండా అణచివేయడంతో అటు నైరుతి రుతుపవనాల ప్రభావం తగ్గి వర్షపాతం పడిపోతుందని చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిపెట్టాలని రైతులకు పాలకపెద్దలు సూచనలు ఇస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా దాదాపు మూడువందల కిలో ఘనపు మీటర్ల మేర భూగర్భజలాలను భారత్‌లో వినియోగించుకుంటున్నారు. దేశంలో ఆరువేల ఐదువందల డెబ్భైరెండు భూగర్భ జలాల బ్లాకులుండగా వీటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలను తోడేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాక్‌ల పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉంది. భారత్‌లో బోరుబావుల సంఖ్య ఇప్పటికీ గత ఏడు దశాబ్దాల్లో 180 రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. వీటివల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే అయినా నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా నానాటికీ బోరుబావుల మీదనే అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలను వృధా చేయడం నానాటికీ పెరిగిపోతున్నది. పంజాబ్‌లో డెబ్భైశాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడుల్లో నలభైశాతం పైగా భూగర్భజలాలు వాడుతున్నారు. ముఖ్యంగావిద్యుత్ సబ్సిడీలు ఉచితంగా ఇస్తున్న రాష్ట్రాల్లో నీటి వినియోగం తారాస్థాయికి చేరుకున్నదనే చెప్పొచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశవనరుల్లో అరవైశాతానికిపైగా హరించుకుపోతాయని గతంలో ప్రపంచబ్యాంకు నివేదిక హెచ్చరించింది. దేశంలో అధిక శాతం జిల్లాలో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం అంగీకరించడం కలవరపరిచే పరిణామం. గతంలో పార్లమెంటులోనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం 254 జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షారత, 34 జిల్లాలోని భూగర్భజలాలల్లో పాషాణం స్థాయి అధిక శాతంలో ఉన్నదనే విషయం వెలుగుచూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పాషాణం లాంటిలోహాలను భూగర్భ జలాల నుంచి తొలగించడం కష్టంగా మారిందని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఇక కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతల పానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో కూడా వాడకం పెరిగిపోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపించిన కారణంగా భూగర్భజలాలసమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టి వేయలేం. సూపర్ ఎల్‌నినో కారణంగా భూగర్భ జలాల సమస్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషితనీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం.

ఓరిమికి అపారమైన శక్తి ఉంది. దండించే అధికారం ఉన్నా దండించకపోవడం నిజమైన ఓర్మి.



ఎమ్.కె. గాంధీ

కృతజ్ఞత అన్నది గొప్పగా అలవర్చుకున్న గుణాల ఫలం. దీనిని మనం మోటు మనుషులలో చూడలేం. అంత నాజూకైంది.



శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు

### డిజిటల్ ట్రాకింగ్ అవసరం

నగరాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లలో తరచూ వెలుగుచూస్తున్న ఆహార భద్రతా ఉల్లంఘనలు ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలవినియోగం, అపరిశుభ్రమైన వంటగదులు, పురుగుల సమస్య, కృత్రిమ రంగుల వాడకం వంటి ఘటనలు వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. లాభాల కోసం ప్రాథమిక పరిశుభ్రత ప్రమాణాలను విస్మరించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఆహార నాణ్యతలో చిన్న నిర్లక్ష్యంకూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. అప్పుడప్పుడు నిర్వహించే ఆకస్మిక తనిఖీలతో మాత్రమే ఈసమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఆహార భద్రతాశాఖ నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ నమూనా పరీక్షలు, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. ప్రతి హోటల్, రెస్టారెంట్ బయట పరిశుభ్రత రేటింగ్‌ను స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పెరిగిన ఫీజుల భారం

విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది. విద్య మన సమాజ అభివృద్ధికి పునాది. అయితే ఇటీవలికాలంలో పెరుగుతున్న ఫీజులు మధ్యతరగతి దిగువమధ్య తరగతి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో కుటుంబాలు తమ సామర్థ్యానికి మించి ఖర్చు చేయాల్సివస్తోంది. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ఫీజుల విషయంలో సమతుల్యత అవసరం. విద్యాసంస్థలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలి. సామాజిక బాధ్యతలో భాగంగాకార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల భారం తగ్గించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్య హక్కుగా అందరికీ చేరేలా తగిన నియంత్రణలు, సహాయక చర్యలు అవసరం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### బెదరింపులు ఆపాలి

కొందరు రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల, రాజకీయ అండతో, పలుకుబడితో భూమి కబ్జాలు, రోడ్లు ఆక్రమించి, ప్రజలను బెదరించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా చేయడంవల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీరిపై పోలీస్ శాఖ ద్వారా కౌన్సిలింగ్ చేయాలి.

### సమన్వయంతో పనిచేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, యుద్ధ వాతావరణాలు నెలకొన్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలో స్థిరంగా ముందుకు సాగుతోందని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి పేర్కొనడం ఆశాజనక పరిణామం. వికసిత భారత్ లక్ష్య సాధనలో ఆర్థిక సంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, యువత సాధికారత, మహిళల భాగస్వామ్యం, సహకార సమాఖ్య వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశం ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబడగలదు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధే వికసిత భారత్‌కు పునాదిగా మారుతుందని ప్రధాని చెప్పిన మాటల్లో గొప్ప దూరదృష్టి కనిపిస్తోంది. వ్యవసాయం, వ్యాపారం, శాస్త్రసాంకేతిక రంగాలు, నవీన ఆవిష్కరణలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. మహిళ ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితే కుటుంబం బలపడుతుంది.

- ఎం.నారాయణస్వామి, మహబూబ్‌నగర్‌జిల్లా

### ప్రమాదకరంగా రోడ్డు ప్రయాణాలు

వాతావరణ మార్పులతో ఇటీవల కాలంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగామారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి ఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపై ఉన్న చెట్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖవారు విద్యుత్ వైర్లు తెగిన చోట ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మరమ్మత్తులుచేయాలి. వానాకాలంలో రోడ్లవెంట ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

### ఫోన్లలోనే..మానవ సంబంధాలు

నేడు సమాజంలో మనుషులు అవసరం ఉంటేనే ఫోన్లు చేస్తున్నారు. నేరుగా కలుస్తున్నారు. అవసరం లేకుంటే అర సంవత్సరం అయినా అర్సుకోరు ఎలాఉన్నారు. పరిస్థితులు ఏంటి అని. అంత సమయంలేని జీవితం గడుపుతున్నారు మరి సమాజం. కేవలం అవసరం ఉంటేనే గుర్తుకొస్తారా? కొంచెం సమయం కూడా కేటాయించలేకపోతున్నారు. భవిష్యత్తులో కేవలం మెసేజ్‌లు మాత్రమే చేస్తారేమో అని భయమేస్తుంది.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రయాణికుల భద్రత!

**ప్రభుత్వాల ఈ.విపాలసీ ఫలితంగా పరిశ్రమకూ, ఔత్సాహికులైన కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, రాయితీల నేపథ్యంలో భారీ మొత్తంలో ఇ.విలు రోడ్ల పైకి వస్తున్నాయి. ఐతే ఆశ్చర్యకరంగా వాటిని నిరంతరం ఉపయోగించడానికి అవసరమైన మేరకు రీచార్జ్ చేయడానికి కావలసిన సంఖ్య లో ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడం వాటి వినియోగానికి ప్రధాన అవరోధంగా మారుతున్నది. విద్యుచ్ఛక్తి వాహనాల కొనుగోలుకు ఆర్థిక సదుపాయాన్ని సమకూరుస్తున్న ప్రైవేట్ ఫైనాన్సర్‌లు కొనుగోలుదారులు వాయిదాలను చెల్లించనప్పుడు రిమోట్ ద్వారా బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి ఇ.విలను లాక్ చేస్తున్నారనే ఆరోపణ లు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అదే నిజమైతే ఇలాంటి సాంకేతికత ఉగ్రవాదులు, దేశద్రోహుల చేతుల్లోకి వెళ్తే ప్రయాణీకుల భద్రతతోపాటు దేశ భద్రతకు పెనుప్రమాదం వాటిల్లుతుందనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కొన్ని యాప్‌లను డిజిటల్ ప్లాట్ ఫాంల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.**



డాక్టర్ నీలం సంపత్

ఆధునిక మానవులు సాధిస్తున్న అద్భుతమైన సాంకేతిక ప్రగతి, ప్రతిఫలంగా అభివృద్ధిలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్న ఆటోమొబైల్ రంగ పరిశ్రమ, కోట్ల సంఖ్యలో రహదారులపై శరవేగంగా పరుగులు పెడుతున్న రకరకాల చిన్నా, పెద్ద వాహనాల మూలంగా కార్బన్ మోనాక్సైడ్ కాలుష్యంతో భూతాపం పెరుగుతోంది. సదరు వాహనాల వినియోగం కోసం సాంప్రదాయ శక్తి వనరులైన బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల నిల్వలు రోజు రోజూ అడుగంటి పోతున్నవి. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాంప్రదాయ శక్తి వనరుల కొరతతో ఆటోమొబైల్ రంగం అంతరించిపోయే ప్రమాద మున్నది. ఫలితంగా దేశ ఆర్థికాభివృద్ధికి ఇరుసుగా కొనసాగుతున్న ఉపరితల రవాణా రంగం పెను ప్రమాదంలో చిక్కుకోక తప్పదు. తదనంతర పరిణామాల నేపథ్యంలో దేశ ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విపత్తు నుండి దేశ ప్రజలను కాపాడడానికి ప్రభుత్వం శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగానికి ప్రత్యామ్నాయంగా సాంప్రదాయేతర శక్తి వనరులైన సోలార్, విండ్ పవర్, హైడల్ పవర్, టైడల్ పవర్‌లను, బయోగ్యాస్, బయోమాస్ తదితర పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించాలనే లక్ష్యంతో ఇంధన విధానాన్ని రూపొందించి ముందుకు సాగుతున్న వైనం అభినందనీయమే. ఆధునిక మానవాళి నడవడిక, దైనందిన వ్యవహార శైలి ఫలితంగా భారీ మొత్తంలో వాహనాల వినియోగం కారణంగా కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులతో భూతాపం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. తద్వార సౌకర్యవంతమైన ఆధునిక మానవ జీవనానికి ఊపిరులూదాల్సిన రవాణా రంగం పర్యావరణ విచ్ఛిత్తికి కారణంగా మారుతూ మాన వాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. ఈనేపథ్యం లో ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ కోసం 17 సుస్థిరతతో కూడిన అభివృద్ధి లక్ష్యాలను గుర్తించి వాటి సాధన ప్రపంచ దేశాల బాధ్యతగా నిర్దేశించిన వైనం బహిరంగ రహస్యమే. ఉపరితల రవాణా రంగంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, వ్యయ నియంత్రణ, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ లాంటి చతుర్ముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్న మన దేశం నేషనల్ ఎలక్ట్రికల్ బస్ కార్యక్రమాన్ని ప్రారంభించి అందులో భాగంగా వివిధ కార్పొరేట్ సంస్థల నుండి టెండర్లను ఆహ్వానించింది. సదరు కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా టెండర్‌ని దేశంలో కమర్షియల్ ఇ.విల తయారీలో దాదాపు గుత్తాధికారిగా కొనసాగుతున్న జై భారత్ మారుతి సంస్థ (జె.బి.యమ్) సంస్థ దక్కించుకుంది. అందులో భాగంగా సెప్టెంబర్ 2023 లోనే తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖకు పది సంవత్సరాల కాలపరిమితి తో 500 ఎలక్ట్రికల్ బస్సులను పంపడం గమనార్హం. సదరు బస్సులను టి.జి.యస్.ఆర్. టి.సి రాష్ట్రంలోని వివిధ బస్‌డిపోలకు పంపించడం గమనార్హం. ఆ క్రమంలో కరీంనగర్ రీజియన్‌కు 104 ఇ.వి.బస్సులు కేటాయించడం జరిగింది. ఒప్పందంలో భాగంగా ఇ.వి బస్సులను సమకూర్చడం, వాటికి డ్రైవర్లను నియామకం చేయడం, నిర్వహణలో అవసరాన్ని బట్టి తగు రిపేర్లు చేయించడం జె.బి.యమ్ సంస్థ బాధ్యతయే. ఇక తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కండక్టర్లను నియామకం చేసుకుని ప్రయాణికుల నుండి రోజువారీ రెవెన్యూని వసూలు చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కిలోమీటర్‌కి రూ.



39.80 ల చొప్పున జె.బి.యమ్ యాజమాన్యానికి చెల్లించాల్సి ఉందే. ఎలక్ట్రిక్ వాహనాల పనితీరుని ప్రశ్నార్థకంగా మారుస్తూ వాహనాలలో ప్రయాణిస్తున్న వారిని ప్రమాదాలకు గురిచేస్తున్నది నాణ్యత లేని విదేశీ బ్యాటరీలేననేది నిపుణుల వాదన. వాహనాలు ప్రయాణాలు చేసేటప్పుడు మొరాయించడం, అగ్నికి ఆహుతవడం, భద్రతతో కూడిన ఛార్జింగ్ నియమ నిబంధనల పట్ల స్పష్టత లేకపోవడం, ఛార్జింగ్ సదుపాయాల కొరత, ఛార్జీ చేసేటప్పుడు కనెక్టర్ల సమస్యలతో పేలి పోవడం లాంటి ప్రమాద ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిన్నటికి నిన్న కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఒకటి తిమ్మాపూర్ దగ్గర క్షణాలలో కాలి బూడిదయ్యింది. రెండు మూడు రోజుల వ్యవధిలో మరో బస్సు స్థానిక బస్‌డిపో ఆవరణలోనే ఛార్జ్ చేస్తున్న సమయంలో అగ్నికి ఆహుతైంది. పై రెండు ఘటనల్లో అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. ఈ దుర్ఘటనలు జరిగిన తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో జె.బి.యమ్ సంస్థ టి.జి.ఆర్.టి.సి కి సమకూర్చిన 500 ఇ.వి లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. మరో వైపు సదరు దురదృష్టకర సంఘటనలపై శాఖాపరమైన సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలను ఇస్తూనే చైనా బ్యాటరీ టెక్నికల్ టీమ్ నేతృత్వంలో టి.జి.యస్.ఆర్.టి.సి ఇంజనీర్లబృందం జతగా నిలిపివేసిన 500 ఇ.వి.లలో 150 బస్‌లను తనిఖీచేసి అవి లోపరహితంగా వంద శాతం ఫిట్‌గా ఉన్నాయని ప్రకటించి వాటిని వాడుకలోకి తీసుకురావడం జరిగింది. ఇక మిగతా 350 ఇ.వి.ల నాణ్యతాపరంగా ఫిట్‌గా ఉన్నాయని తేలిన తర్వాతనే వాటిని రవాణాశాఖ ఉపయోగిస్తుందేమో! ఒక వేల అవి కూడా నాణ్యత పరంగా ఫిట్‌గా ఉన్నాయని తేలితే ఇ.విలు దగ్ధం కావడానికి కారణాలేమిటో మరింతలోతుగా, మరో కోణంలో అధ్యయనం కొనసాగించక తప్పదు. అధ్యయనాలు, ఫలితాలు ఎలా ఉన్నా ప్రస్తుతం ప్రజల ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఇ.విలలో ప్రయాణాలు చేయక తప్పదు. రాష్ట్ర రహదారుల పై భారీ మొత్తంలో వాహనాలు విడుదల చేస్తున్న కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్న వారికి రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డిస్కౌంట్ మరిన్ని ప్రోత్సాహకాలు, వాయిదాల పద్ధతిలో ఋణ సదుపాయాల కల్పనలతోపాటు ధర ఎక్కువైనా సదరు వాహనాలు ఇస్తున్న మైలేజీ ఆర్థికంగా ఆకర్షణీయంగా ఉంటున్న నేపథ్యంలో వాటికి డిమాండ్ పెరుగుతోంది. డిమాండ్‌కి సరిపడా విద్యుచ్ఛక్తి వాహనాలనుఉత్పత్తి చేయడం కోసం బడా బడా ఆటోమొబైల్ పరిశ్రమలతోపాటు చిన్నచిన్న స్టార్టప్‌లకు సైతం ప్రభుత్వం అవసరమైనప్రోత్సాహకాలను, రాయితీలను అందిస్తున్న క్రమంలో కొంతమంది ఉత్పత్తి దారులు లాభాలకోసం ఇ.విల తయారీలో నాణ్యత లేని బ్యాటరీలను ఉపయోగిస్తున్న కారణంగా వారు ఉత్పత్తి చేస్తున్న ద్విచక్ర విద్యుత్ వాహనాలు ప్రమాదాల పాలిట బడుతున్నవనేది నిపుణుల నిశ్చితాభిప్రాయం. స్వదేశంలో బ్యాటరీల తయారీ అంతంత మాత్రంగానే జరుగుతుండడం వాటి తయారీకి సంబంధించి రీసెర్చ్ జరగక పోవడం, అధిక శాతం బ్యాటరీలను చైనా తదితర విదేశాలనుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఏదేమైనా ప్రభుత్వాల ఈ.విపాలసీ ఫలితంగా పరిశ్రమకూ, ఔత్సాహికులైన కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలు, రాయితీల నేపథ్యంలో భారీ మొత్తంలో ఇ.వి లు రోడ్ల పైకి వస్తున్నాయి. ఐతే ఆశ్చర్యకరంగా వాటిని నిరంతరం ఉపయోగించడానికి అవసరమైన మేరకు రీచార్జ్ చేయడానికి కావలసిన సంఖ్యలో ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్లు లేకపోవడం వాటి వినియోగానికి ప్రధాన అవరోధంగా మారుతున్నది. విద్యుచ్ఛక్తి వాహనాల కొనుగోలుకు ఆర్థిక సదుపాయాన్ని సమకూరుస్తున్న ప్రైవేట్ ఫైనాన్సర్‌లు కొనుగోలు దారులు వాయిదాల ను చెల్లించనప్పుడు రిమోట్ ద్వారా బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్‌ను హ్యాక్ చేసి ఇ.విలను లాక్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేల అదే నిజమైతే ఇలాంటి సాంకేతికత ఉగ్రవాదులు, దేశద్రోహుల చేతుల్లోకి వెళ్తే ప్రయాణీకుల భద్రతతోపాటు దేశ భద్రతకు పెనుప్రమాదంవాటిల్లుతుందనే ఉద్దేశంతో వీటికి సంబంధించిన కొన్ని యాప్‌లను డిజిటల్ ప్లాట్ ఫాంల నుండి బ్లాక్ చేయాలని ఆదేశాలు జారీచేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు

# వ్యాధులు కాదు.. నిర్లక్ష్యమే అసలు వైరస్!

ఫిరోజ్ ఖాన్

ప్రతి వర్షాకాలం కేవలం పచ్చదనాన్నే కాదు.. ప్రజారోగ్యానికి ఒక హెచ్చరికను కూడా తీసుకొస్తుంది. మనల్ని అనారోగ్యానికి గురిచేస్తున్నది నిజంగా వైరస్‌లేనా? లేక వాటికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్న మన నిర్లక్ష్యమా? వర్షాలు సహజం, కానీ వాటి వెంట ప్రతి ఏడాది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, కలరా, టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి వ్యాధులు పునరావృతం కావడం కేవలం ప్రకృతి ప్రభావం మాత్రమే కాదు, ప్రజారోగ్య నిర్వ హణ, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, పౌర బాధ్యత వంటి అంశాలతో ముడిపడి ఉన్న సంక్లిష్ట వాస్తవం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు చారిత్రాత్మక స్థాయికి చేరుకున్నాయి. భారత ప్రభుత్వ నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ గణాంకాలు కూడా ప్రతి వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా కేసులు గణనీయంగా పెరుగుతున్న ధోరణిని సూచిస్తున్నాయి ఇదే సమయంలో అంతర్జాతీయ వైద్య పరిశోధనా పత్రిక 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్'లో ప్రచురితమైన అధ్యయనాలు కూడా వాతావరణ మార్పులు వెక్టర్‌బోర్న్ వ్యాధుల భౌగోళిక విస్తరణను ప్రభావితం చేస్తున్నాయని సూచిస్తున్నాయి. కాబట్టి వ్యాధులను కేవలం వైద్య సమస్యగా కాకుండా, ప్రజారోగ్య నిర్వహణకు సంబంధించిన సామాజిక సవాలుగా చూడాల్సిన అవసరం ఉంది. సీజనల్ వ్యాధుల నివారణలో బాధ్యతను ఒకే వర్గంపై మోపడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు. స్థానిక సంస్థలు డ్రైనేజీ నిర్వహణ, చెత్తతొలగింపు, యాంటీ లార్వా చర్యలు, ఫాగింగ్, తాగునీటి భద్రత, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలను సకాలంలో అమలుచేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయి. మరోవైపు, ప్రతి కుటుంబం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకాకుండాచూడడం, కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, నీరు నిలిచే పాత్రలను తరచూ శుభ్రం చేయడం వంటి చర్యలు తీసుకోవడం కూడా అంతే అవసరం. భారత వైద్య పరిశోధనా మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ అధ్యయ నాల ప్రకారం, డెంగ్యూ వ్యాప్తి చేసే 'ఈడిస్ ఈ జిప్టి' జాతి దోమలు ఇంటి ఆవరణలో నిల్వ ఉండే స్వచ్ఛమైన నీటిలోనే ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. అందువల్ల ప్రభుత్వంచర్యలు తీసుకోవడం మాత్రమే సరిపోదు, ప్రజల భాగస్వామ్యం కూడా విజయానికి కీలకం. ప్రభుత్వం, ప్రజ లు అనే భాగస్వామ్య దృక్పథమే ప్రజారోగ్యానికి బలమైన రక్షణ. సీజనల్ వ్యాధుల అసలు ప్రభావం ఆసుపత్రిగోడల వద్ద ఆగిపోదు. అది కుటుంబాల ఆదాయం, పిల్లల చదు వు, ఉపాధి, జీవనోపాధిపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపు తుంది. ప్రతివర్షాకాలం మనకు ఒకే పాఠాన్ని గుర్తు చేస్తుం ది. వ్యాధులు ఒక్కసారిగా పుట్టవు. వాటికి అనుకూల పరి స్థితులు క్రమంగా ఏర్పడ తాయి. అందువల్ల ప్రజారోగ్య విజయాన్ని ఆసుపత్రుల్లోని పడకల సంఖ్యతో కాకుండా, వ్యాధులు రాకముందే

# నూతన మార్పునకు నాంది పలికే సంస్కరణలు



నాదెండ్ల శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడింది అనడానికి ప్రభుత్వం ఇటీవల విద్యారంగంలో మార్పులు తీసుకురావడానికి చేపడుతున్న నిర్ణయాలే నిదర్శనం. 1,441 పాఠశాలలను మూసివేసి 2026-27 యూడైస్ లెక్కల నుండి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 640 పాఠశాలల్లో కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ఉండి, ఒక్కవిద్యార్థి కూడా లేకపోవడంతో అందులో పనిచేస్తున్న ఉ పాధ్యాయులను వేరే పాఠశాలలకు డిప్యుటేషన్‌పై వంపించి వాటిని కూడా త్వరలో మూసివేయాలని నిర్ణయించింది. దీనితో ప్రభుత్వ విద్య పట్ల పాలక వర్గాలకు ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 2,081 జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు ఉన్నట్టు తేలగా, ప్రస్తుతానికి 1,441 స్కూళ్లను మూసివేయడంతో పాటు, మిగిలిన 640పాఠశాలలను మూసివేస్తే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 24వేలలోపే పరిమితం కానుంది. గ్రామాలలో పాఠశాలలు మూతపడటం వల్ల పేద, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదంఉంది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కంటే వాటిని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. తెలంగాణ సర్కార్ ఏడాదిన్నర క్రితం తెలంగాణ విద్యా కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ తన అధ్యయనంలో రాష్ట్రంలో విద్యా వెనుకబాటును స్పష్టంగా గుర్తిస్తూ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. అదే సమయంలో ప్రస్తుతం విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి విద్యారంగం వెనుకబాటు నుండి బాగు చేయడానికి వలు సిఫార్సులు కూడా చేసింది. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ రూపొందించిన నూతన విద్యా విధానం 2020లోని అశాస్త్రీయ విధానాలను తిరస్కరించాలని, ఉచిత నిర్బంధ విద్య బోధనను 18ఏళ్ల వరకు పెంచాలనే సిఫార్సులు వీటిలో అత్యంత అవసరమైనవి. బడి బయట ఉన్న పిల్లల నుండి అసలు బడి అంటే ఏంటో తెలియని వారి సంఖ్యను కూడా వాస్తవాల రూపంలో వెలుగులో తెచ్చింది. ఈవాస్తవాలే ఇప్పటి ప్రభుత్వానికి కంటగింపుగా మారాయి. 100 మంది విద్యార్థులలో 26 మంది మాత్రమే ప్రభుత్వ బడులలో చేరుతున్నారని సగానికి ఎక్కువ మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని, ప్రభుత్వ రంగంలో 36 శాతం ఏకోపాధ్యాయ బడులు కాగా, 86శాతం బడులలో అన్ని తరగతుల విద్యార్థులను ఒకేగదిలో కూర్చోబెట్టి విద్యాబోధన జరుపుతున్నారని పేర్కొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని, కనీస సౌకర్యాలు లేవని కూడా తేల్చింది. నాణ్యమైన విద్యా బోధనలో మన స్థానం 26 అని, మూడవ తరగతి విద్యార్థులకు వారి కింది తరగతి పుస్తకం కూడా చదవలేని వెనుకబాటు తనంఉందని, ఇంకా ఉన్నత విద్యా సంస్థలకు 77శాతం కళాశాలకు న్యాక్ గుర్తింపులేకపోవడం, యూనివర్సిటీల్లో 80శాతం ఖాళీలతో భ్రష్టు పట్టించిన విషయాన్ని కుండ బద్దలు కొట్టి తెలియజెప్పింది. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యమైన విద్య కోసం సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందించాలన్న తెలంగాణ విద్యా కమీషన్ లక్ష్యం విస్తృత ఆశయాన్నిప్రతిబింబించింది. దీనితో కొత్త ఆశలు రెక్కలు తొడిగాయి, విద్యా కమిషన్ చాలా శ్రమకోర్చి పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి ప్లస్ టు స్థాయివరకు శ్రేష్టమైన విద్యకోసం తీసుకురావాల్సిన మార్పు లను సూచిస్తూ నివేదిక సమర్పించింది. ఫీజుల నియంత్రణ కు సంబంధించి నివేదిక సమర్పించింది. అయిదేళ్ళ ప్రణా ళికను ఖచ్చితమైన బడ్జెట్ అంచనాలతో నివేదికను రూపొం దించింది. కానీ ప్రభుత్వం ఆ నివేదికతో సంబంధం లేకుం డానే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించింది. విద్యాకమీషన్ ఇంకా ఉన్నత విద్య, ఒకేషనల్, టెక్నికల్ విద్యకు సంబంధించిన అంశాలపై చర్చలు, నివేదికలు పూర్తి చేయలేదు. అన్ని విషయాలతో సమగ్ర నివేదిక కూడా తయారుకాలేదు. ఈలోపే ప్రభుత్వం గత నెలలో తెలంగాణ విద్యా విధానం



(టిఈపి) రూపొందించడానికి ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌ను రూపొందించారు. ఈప్రక్రియను అంతా పరిశీలిస్తే విద్యా కమిషన్‌లో నిర్మాణ సంబంధలోపాలు, విద్యావిధాన రూపకల్పన ప్రక్రియకు సంబంధించిన లోపాలు స్పష్టంగా కనబడుతున్నాయి. దీంతో ఈ సంస్కరణల లక్ష్యం నెరవేరు తుందా అనే అనుమానం కూడా కలుగుతుంది. నేటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదిక అమలుపై స్పష్టత ఇవ్వలేదు. ఇకపోతే తెలంగాణలో పాఠశాల విద్య అంటే ప్రైవేట్ విద్య మాత్రమే అనే భావన నెలకొని ఉంది. అందులోనూ ముఖ్యంగా తల్లి దండ్రులకు టక్కునగుర్తొచ్చేదినర్సరీ, ఎల్.కె.జి, యుకెజి బోధన, ఇంగ్లీష్ మీడియం బోధన చేసే ప్రైవేట్ పాఠశాలలే. ఈ రకమైన ప్రైవేట్ బోధన మాత్రమే నిజమైన, నాణ్యమైన చదువుగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి సందర్భం లో మురళి కమీషన్ ప్రభుత్వ రంగంలో కూడా నర్సరీ, ఎల్.కె.జి, యుకెజిలను బోధించే పూర్వ ప్రాథమిక విద్యను తీసుకురావాలని, నర్సరీ నుండి పి.జి వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్య బోధన జరపాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, సౌకర్యాలు కలిగినట్టి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో విస్తరించిప్రభుత్వ విద్యలో నాణ్యత పెంచాలని, ప్రతి తర గతికి ఒక గది నిర్మాణం చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌళిక సదుపాయాల కల్పన, నిత్యం మాని టరింగ్ కోసం జిల్లాస్థాయి పర్యవేక్షణ బోర్డు ఏర్పాటుచేయా లనడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు చాలా ఉపయో గకరమే. పాఠశాల విద్యలో మరోసిఫార్సు ఆయా సొసైటీ లుగా కొనసాగుతున్న గురుకుల విద్య సంస్థలను ఒకటిగా కలపడం. కుల వ్యవస్థను సుస్థిరం చేస్తున్న ఆయా కులాల గురుకులాలను కలిపి ఇంటిగ్రేటెడ్ గురుకులాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పౌరసమాజం నుంచి వచ్చినదే. ఇక ఇంటర్మీడియట్ విద్యలో చేసిన సిఫార్సులను పరిశీలిస్తే మెజారిటీ సిఫార్సులు ప్రైవేట్ కళాశాలల, కోచింగ్ సెంటర్ల దోపిడీని అరికట్టడానికి వచ్చినవే. ప్రైవేట్ పాఠశాలల జూనియర్ కళాశాలలో ఫీజుల నియంత్రణ చట్టం రూపొందించాలని సిఫార్సు చేయడం ఆహ్వానించదగినదే. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతంచేయాలి. బడుల్లో మెరుగైనమౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠశాలలను మూసివేయడం సమస్యకు ముగింపు కాదు. వాటికి పూర్వ వైభవం తీసుకురా

## కారుణ్య నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రభుత్వ ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సూచించారు. సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో కారుణ్య కోటా కింద ఉద్యోగాలు పొందిన ఏడుగురికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఒక ఉపాధి మాత్రమే కాకుండా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచే బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలు ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, డీఆర్ఓ పి. వెంకటరమణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



2026 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక తెలిపారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం) సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఎంపిక ప్రక్రియ చేపడతామని తెలిపారు. స్వీయ నామినేషన్, ఐదుగురు సహచర ఉపాధ్యాయుల సిఫార్సు, లీప్ యాప్ ద్వారా పనితీరు ఆధారిత విధానాల్లో ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, డైట్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న, కనీసం పదేళ్ల ప్రభుత్వ సేవ పూర్తిచేసిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, వినూత్న బోధనా విధానాలు, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి, సేవాభావం వంటి అంశాలను ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. అర్హులైన ఉపాధ్యాయులు జూలై 15లోగా ఆయా డివిజన్ ఉప విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అనంతరం డివిజన్, జిల్లా స్థాయిల్లో ఎంపికలు పూర్తి చేసి తుది జాబితాను జూలై 28న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని పేర్కొంటూ, అర్హులైన ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక కోరారు.

## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ

**- జిల్లా పోలీస్ మీకోసం కార్యక్రమానికి 85 ఫిర్యాదులు**

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో "మీకోసం (పీజీఆర్ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక ఫిర్యాదులను అందజేయగా, మొత్తం 85 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారులతో అధికారులు ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా పోలీసు సేవలు అందించడమే పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శి సీఐ రామారావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, గుడ్లూరు ఎస్సై కె. వెంకట్రావు, ప్యానెల్ అడ్వొకేట్ బి. బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాసిన్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి

**ఒంగోలు, ప్రభాతవార్త**



డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి వేడుకలు, ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మా నాయక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్లు మధుసూదన్‌రెడ్డి, మాల్యాద్రి, హెచ్‌డబ్ల్యూఓ అధ్యక్షులు డి.అంకబాబు, జిల్లా అధ్యక్షులు ఆనంద్, ఎమ్మార్పీఎస్ ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షులు జే.ఆంజనేయులు, రాష్ట్ర డప్పు కళాకారుల అధ్యక్షులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుక

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలులోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ పరిశీలకులు మాదాసి వెంకయ్య, సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకులు బొట్ల రామారావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జి.దేవప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యారజర్ల రమేష్‌బాబు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మేళం గురవయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దాసరి కోటేశ్వరరావు, దామరాజు క్రాంతి కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జిల్లా ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ దొనకొండ యోహాను, రాష్ట్ర ఎసీస సెల్ జాయింట్ సెక్రటరీ దుడ్డు వినోద్, ఒంగోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవరపల్లి రమణయ్య, ఒంగోలు నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు పీటర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ ప్రధాన కార్యదర్శి దేవరపల్లి అంజిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి వైవి గౌతమ్ అశోక్, ఒంగోలు నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ అధ్యక్షులు పెట్లూరు ప్రసాద్, టి.కరుణాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఎస్.ఐ. మూర్తిని సత్కరించిన ఎస్ఐ అజయ్ బాబు

**సంతనూతలపాడు, జూలై 6, ప్రభాతవార్త**



సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ లో సోమవారం రాత్రి జరిగిన పదవీ విరమణ అభినందన కార్యక్రమంలో ఏ.ఎస్.ఐ. పీ.వీ.ఎస్. మూర్తిని సంతనూతలపాడు సబ్ ఇన్స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు, పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. జూన్ 30న ఏ ఎస్ ఐ. మూర్తి పదవీ విరమణ అయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మూర్తికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఏ. ఎస్. ఐ. సేవలను సబ్ ఇన్స్పెక్టర్ అజయ్ బాబు తన ప్రసంగ న్నలో అభినందించారు. 33 సంవత్సరాలు పాటు పోలీస్ డిపార్ట్మెంట్లో మూర్తి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. సంతనూతలపాడు పోలీస్ స్టేషన్లో మూర్తి కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు ప్రారంభించారు. చివరికి ఏఎస్ఐ.గా పోలీస్ స్టేషన్లో పదవీ విరమణ అయ్యారు. పలువురు మూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్ఐ. లు వెంకట్రావు, ప్రసాద్, భాస్కరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## ముండ్లమూరు ఎస్సైగా కోటేశ్వరరావు

**ముండ్లమూరు, జూలై 06, ప్రభాతవార్త**



ముండ్లమూరు ఎస్సైగా పి.కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గుంటూరు జిల్లా కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సై పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రకాశం జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు కోటేశ్వరరావుని ముండ్లమూరు స్టేషన్‌కి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడతానని అధికారులు, మండల ప్రజలు నాయకులు సహకరించాలన్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## కలెక్టర్‌ను కలిసిన నూతన డిపిఆర్ఓ ఎస్ రవికుమార్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో)గా ఎస్.రవికుమార్ నియమితులయ్యారు. సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతల స్వీకరణకు ముందుశుభాకాంక్షలు అందుకున్నారు. నెల్లూరులో డివిజనల్ పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ పదోన్నతి పొందిడీపీఆర్వోగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ నిర్ణయాలను మీడియా ద్వారా సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, సహోద్యోగులు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు అందజేశారు.

# పోలీస్ బండి నడిచేదెలా..?

- నిర్వహణకు సరిపోని మెయింటెనెన్స్ డబ్బులు
- వెహికల్స్‌కు నెలకు ఇస్తుంది వంద-120 లీటర్ల డీజిల్ కోట.. కానీ రెండింతల అదనంగా అవసరం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 1000ల పోలీసు వాహనాలు
- పీటీ వారెంట్లు, బందోబస్తు, కోర్టు డ్యూటీ ఖర్చులు అదనం
- తగ్గించుకునేందుకు, సెటిల్‌మెంట్లపై దృష్టి

**ఒంగోలు, ప్రభాతవార్త**

పోలీసు స్టేషన్‌ల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నది. పోలీసు స్టేషన్‌ల ప్రభుత్వం ప్రతి నెల ఇస్తున్న మెయింటెనెన్స్ ఖర్చు రూ.25వేల నుంచి రూ.50వేలు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఒక స్టేషన్ అధికారికి నెలకు 100 నుంచి 120 లీటర్ల డీజిల్ కోట ఉంది. కానీ 250 నుంచి 300 లీటర్ల డీజిల్ వినియోగం అవుతుంది. దాంతో పాటు బందోబస్తు, పీటీ వారెంట్లు, కోర్టు డ్యూటీ, ఎస్కార్ట్ ఖర్చులు అదనంగా ఉంటాయి. వీటన్నింటిని భారం తట్టుకునేందుకు పోలీసులు పక్క చూపులు చూస్తున్నారు. ఆదాయం సమకూర్చుకు నేందుకు అక్రమ దందాలు, పంచాయతీ సెటిల్‌మెంట్లపై దృష్టి సారించాల్సి వస్తుంది. ఈ వేటలో సామాన్యులు బలి అవుతున్నారన్నది కూడా బహిరంగ రహస్యమే. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 53 పోలీసు స్టేషన్‌లు ఉండగా ఐదు సబ్ డివిజన్ కార్యాలయాలు, 16 సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. వివిధ కేటగిరిలో పని చేసే విభాగాలన్నింటికి కలిపి సుమారు దాదాపు వెయ్యి పోలీసు వాహనాలు ఉన్నాయి. ఇందులో స్టేసన్ అధికారుల వాహనాలు, పెట్రో వాహనాలు, బ్లూకోట్స్, ఎస్కార్ట్, బందోబస్తు వాహనాలు ఉన్నాయి. వీటిలో పోలీసు స్టేషన్ అధికారులకు ఇచ్చే వాహనాలు వంద నుంచి 120 లీటర్ల వరకు నెలకు డీజిల్ కోటా ఉంది. ప్రకాశం జిల్లా కేంద్రం కావడంతో పోలీసు స్టేషన్ అధికారులకు 200లకు పైగా డీజిల్ వినియోగం అవుతుంది. మార్కాపురం జిల్లా కాబట్టి ఇక్కడి కూడా పోలీసు స్టేషన్ అధికారులకు అదే రీతిలో ఉంటుంది. మండల పోలీసు స్టేషన్‌లది అదే పరిస్థితి. ప్రతి రోజు గ్రామాలు




సర్కిల్ కార్యాలయం బందోబస్తు తిరగడం వల్ల డీజిల్ కోటా కన్నా అదనంగా అవుతుంది. మండలంలో సీఎం బందోబస్తు ఉన్నా, మంత్రుల మీటింగ్ ఉన్నా అదనంగా డీజిల్ వినియోగించాల్సి వస్తుంది. పోలీసు వాహనాలకు ఇన్సూరెన్స్ కూడా చేయడం లేదు. వాహనాలు ప్రమాదాలు గురైన, టైర్లు మార్చాలన్నా ఇతరత్ర మెయింటెనెన్స్ కూడా సంబంధిత అధికారులే భరించాల్సి వస్తుంది. ఈ ఖర్చుల భారం అధికమించేందుకు చాలా మంది పోలీసులు పక్కదారులు వెతుకుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ పోలీసు స్టేషన్ పరిధిలో నడిచే ఇసుక దందా, మట్టి, అక్రమ దందా, భూ పంచాయతీలు, స్టేషన్‌కు వచ్చే పంచాయతీలను ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు సంపాదించే వేటలో చాలామంది పోలీసు స్టేషన్ నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణకు సమయం కేటాయించడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తే డబ్బులు ఇవ్వాల్సిందేనన్న స్థితికి వచ్చింది. ప్రభుత్వం, ఉన్నతాదికారులు దృష్టి సారించి పోలీసు స్టేషన్ నిర్వహణను మెరుగుపరిచి సామాన్యులు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని దొంగతనాల కేసులో అంతర్‌రాష్ట్ర దొంగల ప్రమేయం ఉన్నప్పుడు ఆయా రాష్ట్రాలకు పోలీసు బృందాన్ని పంపించాల్సి వస్తుంది. వారి ఖర్చులన్ని పోలీసులే భరించాలి. కొన్ని రోజుల పాటు వారం రోజులు అక్కడే ఉండాల్సి వస్తుంది. సీఎం బందోబస్తుకు వచ్చే పోలీసులకు భోజనం ఖర్చులు, పీటీ వారెంట్‌లోని ఖైదీలను పట్టుకురావడం, కోర్టు డ్యూటీ, ఐజీ కార్యాలయాలకు తిరగడం, హైకోర్టు రిట్ పిటిషన్లు ఉంటే కోర్టుకు వెళ్ళడం, వీఐపీ ఎస్కార్ట్ వంటి ఖర్చులు, పోలీసు స్టేషన్‌లో నిర్వహించే అధికారులకు అదనపు భారంగా మారుతున్నాయి. కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని పట్టుకొస్తే వారికి కూడా భోజన ఖర్చులు పోలీసులే భరించాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఎస్‌హెచ్‌ఓ పోలీసు స్టేషన్‌లకు నెలకు 50వేలు, మండల పోలీసు స్టేషన్‌లకు రూ.20వేలు ఇస్తున్నట్లు సమాచారం. ఇది కూడా మూడు ఆరు నెలలకు ఒక సారి ఇస్తున్నారు. ఆ డబ్బులు స్టేషన్ నిర్వహణ, అంటే స్టేషనరీ, పీ ఇతరత్ర ఖర్చులకు మాత్రమే సరిపోతున్నాయి. ఇది వరకు ఈ ఖర్చులు కూడా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల నుంచి వసూళ్లు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

## ఒంగోలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమీక్ష

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కలిసి ఒంగోలు నగర పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. నగరంలో మౌలిక సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, వీధి దీపాల ఏర్పాటు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రతి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఒంగోలు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరాన్ని చర్చించారు. నగరాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని సమావేశంలో సూచించారు.

## బాబు జగజీవన్‌రామ్‌కు ఎమ్మెల్యే దామచర్ల నివాళి



డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నివాళులర్పణ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో సామాజిక న్యాయం సాధనలో, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన విశిష్ట సేవలను ఎమ్మెల్యే స్మరించారు. సమానత్వ సమాజ నిర్మాణానికి బాబు జగ్జీవన్‌రామ్ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రతి పౌరుడు సమాన అవకాశాలు పొందేలా ఆయన జీవితాంతం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## నవోదయ విద్యాలయాలకు ఎంపీ నిధుల నుండి మొబైల్ డిస్పెన్సరీ వాహనాలు

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**




ఒంగోలు, మార్కాపురం జవహర్ నవోదయ విద్యాలయాలకు ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా మొబైల్ డిస్పెన్సరీ వాహనాలను ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి అందించారు. విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు మరింత వేగంగా అందించడంతో పాటు విద్యాలయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒక్కో విద్యాలయానికి రూ.7.25 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒంగోలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం స్పందన హాల్ ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సమక్షంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రజాప్రతినిధులు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యా సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. మొబైల్ డిస్పెన్సరీ వాహనాల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులకు తక్షణ వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుకానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సి. శివరాం, మార్కాపురం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఎ. రఘు, సూపరింటెండెంట్ పి. మల్లికార్జునరావు, మార్కాపురం సూపరింటెండెంట్ ప్రసాద్, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పుల ఉరి

**పామూరు, జులై 16, ప్రభాతవార్త**



అప్పుల బాధ తాళలేక ఒక వ్యక్తిమృతి చెందిన సంఘటన పామూరులో సోమవారం జరిగింది. పామూరు గ్రామ పంచాయతీకి చెందిన పోకూరు బాలకృష్ణ(39) తన వ్యాపారి నిమిత్తం ఇతరుల వద్ద తీసుకున్నప్పుడు తిరిగి సకాలం లో చెల్లించలేక తనకు రావాల్సిన అప్పులు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాల నందు ఉరి వేసుకుని మృతి చెందారు. ప్రతి ఒక్కరితో కలివిడిగా ఉంటూ అకస్మాత్తుగా మృతి చెందడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు. భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కట్టా అనూక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నారుల్లో వైకల్యాలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంది

**- జిల్లా కలెక్టర్ ఏ.రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లోని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)లో ఒమేగా రిహాబ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ.రాజాబాబు మాట్లాడుతూ చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లేదా బాల్యంలో గుర్తించే వైకల్యాలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే వారి జీవితంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని అన్నారు. సంతానం కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాలు అపారమని, అలాంటి సమయంలో పిల్లలకు ఏదైనా వైలక్యం ఉందని తెలిసినప్పుడు కుటుంబం ఎదుర్కొనే మానసిక వేదనను ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రపంచ స్థాయి వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్న అపోహలను ప్రజలు విడిచిపెట్టాలని, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు భరించక ముందే జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఉచితంగా నాణ్యమైన వైద్యం, అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు, పునరావాస సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ కేంద్రంలో జరుగుతున్న మంచి సేవలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్లు సూచించిన ఫాలో- అప్ తేదీలను తల్లిదండ్రులు తప్పకుండా పాటించాలని, ప్రారంభ దశలో నిరంతర చికిత్స అందిస్తే మెరుగైన





ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి సులభంగా అందేలా జిల్లాన యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమాజంలో దివ్యాంగ చిన్నారులకు అండగా నిలుస్తూ సేవలందిస్తున్న ఒమేగా రిహాబ్ ఫెడరేషన్, ఆసుపత్రికి సేవలందిస్తున్న మురళీకృష్ణని, జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ బృందాన్ని, ముఖ్యండా డాక్టర్ సునీతని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ఆశను, ఆత్మ విశ్వాసాన్ని అందించే వైద్యులు, సేవా సంస్థల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు బాల భవిత కేంద్రంలో వారికి అందుతున్న సేవల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, బాల భవిత కేంద్రం నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, వైద్య విభాగ అధిపతులు డాక్టర్ మస్తాన్ భాషా, డాక్టర్ ఏడుకొండలరావు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ తిరుపతిరెడ్డి, దివ్యాంగుల సఖ అడిషనల్ డైరెక్టర్ సువార్తమ్మ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.



## జులై 14 లోపు ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలు బీఎల్‌వోలకు అందజేయండి

### - తహసీల్దార్ సీహెచ్ అశోక్ కుమార్‌రెడ్డి



**పెద్దదోర్నాల, జులై 6, ప్రభాతవార్త**
ఓటర్ల జాబితా సమగ్ర సవరణ 2026 కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ ఏ పని చేయడానికి ఎన్యుమరేషన్ ఫారాలను ఈనెల 14వ తేదీ లోపు సంబంధిత బూత్ లెవల్ అధికారులకు తప్పనిసరిగా అందజేయాలని దోర్నాల మండల తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అదికారి సీహెచ్ అశోక్ కుమార్‌రెడ్డి సూచించారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా తప్పులు లేకుండా రూపొందించేందుకు ఈ పక్రియ అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ఓటర్లు తమ వ్యక్తిగత వివరాలను సరి చూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు తొలగింపుకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసి నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు. గడువులోపు ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు వివరాల పరిశీలనలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## దేశ సమగ్రత కోసం పోరాడి అమరత్వం పొందిన మహనీయుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ

### - బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు



**మార్కాపురం టౌన్, జులై 6, ప్రభాతవార్త**
జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లోకి వెళ్ళడానికి పర్మిట్ విధానాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమగ్రత కోసం పోరాడి జైలులోనే అమరత్వం పొందిన మహనీయుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు కొనియాడారు. మార్కాపురం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు భారతీయ జన సంగ్ వ్యవస్థాపకులు అపర విద్యావేత్త మరియు అఖండ భారత దేశ ఐక్యత కోసం పోరాడిన వీరుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు మాట్లాడుతూ అఖండ భారత్ కోసం ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధానులు రెండు జెండాలు ఉండకూడ దని ఏక్ దేశ్ మే దో విధాన్ దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి చాలాంగే అని కాశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం గలమెత్తిన సింహమన్నారు. 33 ఏళ్లకే కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ అయి మాతృభాషకు భారతీయ సంస్కృతికి మరియు వందేమాతరంతో విద్యాసంస్థల్లో జాతీయ చైతన్యం నింపిన దేశభక్తుడు అని పివి.కృష్ణారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కొక్కెర శ్రీనివాసరావు, డాక్టర్ కిరణ్, బొంతల కృష్ణ, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జీవీ రెడ్డి, పాలంకయ్య, బొచ్చు మల్లారెడ్డి, ముని తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన...ఉపాధి హామీ కూలీల సంక్షేమమే మోదీ సర్కార్ లక్ష్యం

### - బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం టౌన్, జులై 6, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతి, గ్రామీణాభివృద్ధికి, ముఖ్యంగా పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ దిశగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం వీబీ-గ్రామ్-జీ పథకం కింద రాష్ట్రానికి రికార్డు స్థాయిలో నిధులను విడుదల చేసిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, పేద కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తొలి విడతలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,414 కోట్లను విడుదల చేయడం రాష్ట్ర అభివృద్ధిపై మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ కూలీల వేతనాలను 10 శాతం పెంచి వారి జీవనోపాధికి మరింత భరోసా కల్పించిందన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేసేలా ఉందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



**చీరాల, జులై 6, ప్రభాతవార్త**
జులై 1 నుంచి 7 వరకు జరుగుతున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈపురుపాలెం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఒంగోలు వారు, ప్రొటెక్ట్ సంస్థ వారు పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి జి.నాగ శేష రత్నం, ద్వితీయ బహుమతి జి.తన్మయ శ్రీ, జి.అక్షయ, తృతీయ బహుమతి ఎం.కుసుమలను ప్రధానోపాధ్యాయులు హెూరా నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కోఆర్డినేటర్ జి.రత్న కుమారి, ఎం.విశాఖబాబు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.శిరీష, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కే.జాలయ్య, రిటైర్డ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రిసోర్స్‌పర్సన్ చింతం మయూరి, ఉపాధ్యాయులు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శివయం చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మాట్లాడుతూ విత్తన బంతులు ద్వారా అడవులను పెంచే విధానాన్ని పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విత్తన బంతుల తయారీపై విద్యార్థులకు శిక్షణ నిమిత్తం విచ్చేసిన చింతం మయూరి మాట్లాడుతూ ఒక వంతు నల్ల మట్టి ఒక వంతు ఎర్రమట్టి అందులో సగం పశువుల పేడ తను మెత్తందులో నీటితో కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాన్ని మట్టిలో పెట్టి బంతులుగా చేయడం నేర్పించారు. నేర్పించినటువంటి విత్తనాలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం



**చీరాల, జులై 6, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ కమ్యూనిటీ హాల్ నందు 2026-27 నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా రోటేరియన్ పాస్ట్ గవర్నర్ టి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొని రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ప్రెసిడెంట్ తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, సెక్రటరీ చందలూరి బాల వెంకటేశ్వరరావు, కోశాధికారి పోలుదాసు రామకృష్ణ, క్షీరపురి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ముప్పల వంశీ కృష్ణ, సెక్రటరీ డాక్టర్ బొర్రుగడ్డ రవితేజ, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ గవర్నర్ మాట్లాడుతూ రోటరీ చిన్న చిన్న కార్యక్రమాలు చేయకుండా శాశ్వతంగా గుర్తుండి పోయేవి మంచి కార్యక్రమాలు చేయాలని అదే విధంగా పిల్లలకు స్కిల్స్, చిన్న పిల్లలకు గుండెకు రంధ్రం పడితే సర్జరీ, ప్రమాదంలో చేయి మోచేతి కింద వరకు పోయిన వారికి ఉచితంగా చేతులు పెట్టించటం వలన వ్యాయామం, భోజనం చేయుటకు ఉపయోగపడుతుంది. యువత కి ఇంగ్లీష్ ధారాళంగా మాట్లాడుటకు శిక్షణ తరగతులను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ బాబురావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాలాది కృష్ణమూర్తి, బాబిన నాగ మల్లేశ్వరరావు, కరణం శ్రీనివాసబాబు, గుర్రం రాఘవరావు, సుభాషిణి, బందారుపల్లి హేమంత్ కుమార్, శీరాం రమేష్, జివ్వె ప్రసాద్, గుజ్జ కుమార్ తదితర రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

## కారంచేడులో డిప్యూటీ కలెక్టర్ లవన్న పర్యటన



**పర్చూరు,జులై 6, ప్రభాతవార్త**
కారంచేడు మండల పరిధిలోని కారంచేడు స్వర్ణ గ్రామాలలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సోమవారం డిప్యూటీ కలెక్టర్ లవన్న ఎమ్మార్వో మాధవిలతో కలిసి సందర్శించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయవలసిన అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ మంత్రి ఆనంను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుచిత్ర



**నాగులుప్పలపాడు, జులై 6, ప్రభాతవార్త**
దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమ్మనబ్రోలులో దద్దాల దగ్గర వెలసియున్న వెంకటేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, ప్రకాశ మల్లేశ్వరస్వామి దేవాలయాలు శిథిలావస్థలో ఉండి వర్షం కురవడం వలన వర్షపునీరు దేవాలయాలలోకి వెళ్లడం జరుగుతోందని గోడలు శిథిలావస్థలో ఉన్నాయని, ధ్వజస్తంభాలు చెదలుతిని విరిగి పోయాయని, ఈ మూడు దేవాలయాలను పునర్నిర్మించాలని కోరారు.

## పొగాకు వేలంకేంద్రం సందర్శించిన ఎమ్మెల్యే

### - పొగాకుకు మద్దతు ధర ఇవ్వాలి - ఇండెంటు ప్రకారం కొనాలి

### - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు జూలై 6, ప్రభాతవార్త**
పొగాకుకు కిలో1కి రూ.200తగ్గకుండా కొనుగోలు చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. అదే విధంగా బోర్డు ఇచ్చిన ఇండెంటు మేర 140మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాల్సిందేనని ఆయన తెలిపారు. ఈ మేరకు కొనుగోలు కంపెనీలుతోపాటు బోర్డు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం ఆయన కందుకూరులోని 27వ నంబరు పొగాకు వేలం కేంద్రంను సందర్శించారు. రైతునాయకులు తాటికొండ వెంకట రమణయ్యతోపాటు పలువురు రైతులతోకలిసి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. నాణ్యమైన పొగాకును సైతం కిలో1కి రూ.160 నుంచి 200 రూపాయల లోపే ఎక్కువగా కొనుగోళ్లు జరుపుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వలేటివారిపాలెం, యర్రారెడ్డిపాలెంల నుంచి సుమారు 500కిపైగా పొగాకు చెక్కులు అమ్మకానికి వచ్చాయన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వడంలేదన్నారు. పొగాకు బోర్డు, కంపెనీల ప్రతినిథులు, రైతులతో ముందుస్తుగా ఏర్పాటు చేసుకున్న ఇండెంటు మేరకు మద్దతు ధర ఇవ్వాల్సిందేనన్నారు. రూ.200లకి తగ్గకుండా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం సూచించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నో బిడ్స్ ఉండకూడదన్నారు. రైతుల కష్టాన్ని గుర్తించాలని, సహనాన్ని పరీక్షించొద్దని ఆయన కంపెనీ ప్రతినిధులతోపాటు బోర్డు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడి శ్రీనివాసరావు, ఏడి రహీం, వివిద హోదాల్లోగల తెదేపా నేతలు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మినరసింహం, అల్లం వెంకటేశ్వర్లు, వలేటి నరసింహం, మన్నం కృష్ణ, కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, వడ్డేళ్ల రవిచంద్ర, అత్తంటి శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

### - 37 మంది - రూ.20.5 లక్షలు - ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు జూలై 6, ప్రభాతవార్త**
ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్దానిక తెదేపా కార్యాలయంలో సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కందుకూరు అర్బన్ పరిధిలో 37 మందికి రూ.20,48 లక్షల విలువైన చెక్కులు సోమవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ పండ్ పథకం ఉపయోగపడుతుందన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికి ఈ పథకం కింద సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 1525 మందికి రూ.11.7కోట్లు అందించినట్లు తెలిపారు. ఇందులో కందుకూరు అర్బన్ పరిధిలో 306 మందికి రూ.2.7కోట్లు అందజేశామన్నారు. అనుభవశాలి చంద్రబాబు రాష్ట్రముఖ్యమంత్రిగా ఉండడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో వివిద తెదేపా అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, మహిళా నేత పువ్వాడి మౌనిక, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, తల్లపనేని రవి తదితరులు పాల్గొన్నారు.

## కుక్కగాటు పట్ల అప్రమత్తం - డా॥సుధాకర్



**కందుకూరు జూలై 6, ప్రభాతవార్త**
ప్రజాజీవనంలో వెన్నంటి ఉండే కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాచవరం పశువైద్యాధికారి డా॥ ఎస్.సుదాకర్ ప్రజలకు సూచించారు. వీటి బారిన పడితే వెంటనే పశువైద్యశాలను సంప్రదించాలన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం మాచవరం పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర రేబిస్ వ్యాధినివారణకు ప్రతి ఏడాది యాంటీ ర్యాబిస్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది పాల్గొన్నారు.

## కోవూరులో యాంటీ రేబిస్ టీకాలు



కందుకూరు జూలై 6, ప్రభాతవార్త
మండలంలోని కోవూరు పశువైద్యాశాలలో పెంపుడు కుక్కలకు ఆంటీ రేబీస్ టీకాలను చేశారు. జూనోసిస్ డే సందర్భంగా సందర్భంగా సోమవారం డాక్టర్ వై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలు కుక్కలకు ఈ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికొకసారి ఈ వ్యాక్సిన్ ఇవ్వడం వలన రేబిస్ వ్యాధి నుంచిరక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డా॥ శ్రీకాంత్‌తోపాటు వెటర్నరీ అసిస్టెంట్ పి.విజయ, శోభన్ బాబు పాల్గొన్నారు.

## బస్సులను కండిషన్‌లో ఉంచాలి - డీఎస్పీ



**కందుకూరు జూలై 6, ప్రభాతవార్త**
అన్నిరకాల స్కూలు బస్సులను మంచి కండిషన్‌లో ఉంచాలని కందుకూరుసబ్ డివిజనల్ పోలీస్ అధికారి సిహెచ్‌వి బాలసుబ్రహ్మణ్యం వాహనచోదకులకు సూచించారు. సోమవారం మార్కెట్ యార్డు ఆవరణలో పోలీస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో స్కూలు బస్సులు తనిఖీ నిర్వహించారు. బస్సుల ఫిట్‌నెస్ కండిషన్‌ను పరిశీలించారు. వాహనచోదకులకు ట్రాఫిక్ నిబందనలతోపాటు పలు అంశాలను గుర్తుచేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్పి సిహెచ్ వి.బాలసుబ్రమణ్యం, మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, సీఐ షేక్ అన్వర్‌భాషా, టౌన్ ఎస్సైపి, శివ నాగరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి



**కందుకూరు జూలై 6, ప్రభాతవార్త**
భారతీయ జనసంఘ స్దాపకుడు డా॥శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశఐక్యతకు జీవితాంతం కృషిచేశారని బాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.రాఘవయ్య అన్నారు. స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన 125వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఒకదేశానికి ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు, రెండు పతాకాలను వ్యతిరేకించి ఏకైక వ్యక్తి శ్యాంప్రసాద్ అన్నారు. కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమేనని ఆయన గట్టిగా వాదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ, లింగసముద్రం మండల అధ్యక్షులు చుండి మురళిధర్, మట్లే ఏడుకొండలు జిల్లా కిసాన్ మోర్చా భాద్యులు జొన్నాదుల సురేష్ పట్టణశాఖ ప్రధాన కార్యదర్సులు మాటూరు రమేష్ నాయుడు, రావి సరిత సీనియర్ నాయకులు ముచ్చల భూషయ్య, గట్టమనేని హరిబాబు మన్నేపల్లి వరప్రసాదరావు విశ్రాంత అధ్యాపకులు ఆకురాతి బలరామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 8 న వైఎస్ జయంతిని జరపండి

### - వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా



**కందుకూరు జూలై 6, ప్రభాతవార్త**
దివంగత ముఖ్యమంత్రి డా॥ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతివేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కందుకూరు వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ వైసీపీ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, మండల కేంద్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి స్వర్ణ యుగ పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద వర్గ ప్రజలు, మహిళలు సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తు చేసుకొని ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించాలని తెలియజేశారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్న మాజీ సీఎం జగనన్నకు పార్టీ శ్రేణులు అండగా నిలబడెందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## పాస్టర్ శిఖామణి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్



**నాగులుప్పలపాడు, జులై 06, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన నాగులుప్పలపాడు గ్రామ పాస్టర్ ముంగర శిఖామణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్ సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పాస్టర్ శిఖామణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ వెంట మోదేపల్లి మాజీ ఎంపీటీసీ అనపర్తి వర్ధనరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ డిజిటలైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి



**తాళ్లూరు, జులై 6,ప్రభాతవార్త**
సర్ డిజిటలైజేషన్‌ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని దర్శి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో ఏశాంతి లక్ష్మి సూచించారు. మండలంలోని విఠలాపురం గ్రామంలో సర్ సర్వే కార్యక్రమంలో భాగంగా సోమవారం 245,248 నెంబర్ పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ నెల 14 వ తేదీ కల్లా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ ఓలకు సూచనలు చేశారు. ఎవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అధికారులు, సిబ్బంది అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు, తప్పులకు తావు లేకుండా నిబంధనల ప్రకారం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బచ్చుల వెంకట రమణారావు, ఆర్ ఐ ఎంవీఎస్ సుధీర్ కుమార్, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ సుజాత, బీఎల్ ఓలు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**తాళ్లూరు,జులై 6, ప్రభాతవార్త**
మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని తూర్పు గంగవరంలో మహిళలకు నేరాలు, చట్టాలు, ఆన్ లైన్ మోసాలుపై అయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆరుబయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటిపై విలువైన వస్తువులు ధరించి బయట నిద్రించరాదని, మీ విలువైన వస్తువులను ఇంట్లో భద్రపరచుకోవాలన్నారు. ప్రయాణ సమయాల్లో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఆన్ లైన్ ద్వారా జరిగే మోసాలు, రోడ్డు ప్రమాదాలపైఅవగాహన కల్పించారు. ఎస్ఐ వెంటమాలకొండయ్య, రాములు, అంజిబాబు, వాసు, సిబ్బంది ఉన్నారు.

## కంప్రహేన్సివ్ పెన్షన్ ప్లాన్ పెన్షనర్‌ల అందరికి వర్తింప చేయాలి





**మార్కాపురం,జూలై 6, ప్రభాతవార్త**
మార్కాపురం రిటైర్డ్ అసోసియేషన్ వారి నెల సరి మీటింగ్ పెన్షనర్ భవన్‌లో ఈ రోజు సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిధి చీఫ్ మేనేజర్ శ్రీ దేవకీ వేణు ప్రసాద్‌ని ఆహ్వాంచడం జరిగింది. సభకు అధ్యక్షులు బాల సుబ్బారావు మాట్లాడుతు పెన్షనర్‌లకు సంబంధించి కంప్రహేన్సివ్ పెన్షన్ ప్లాన్ ను మార్కాపురం పెన్షనర్‌ల కందరికి వర్తింప చేయాలి అని వేణు గారిని కోరటం జరిగింది. సన్మాన గ్రహీత వేణు పెన్షనర్‌లు అందరికి బ్యాంకు తరుపున కావలిసిన అన్ని సౌకర్యంలు ఏర్పాటు చేస్తాము అని హామీ ఇచ్చారు. ప్రజలు అందరికి జీరో అకౌంట్ లు ఓపెన్ చేసే ఏకైక బ్రాంచ్ స్టేట్ బ్యాంకు అని సభ కు తెలియచేసారు. పెన్షనర్స్ అందరికి అప్పటికి అప్పుడు వాట్సాప్ నెంబర్ ద్వారా ఏయే ఇన్ఫర్మేషన్ పొందవాచ్చ అనే విషయం అప్పటికి అప్పుడు తెలియ చేశారు. సభా అనంతరం శ్రీ వేణుకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, చెంచయ్య, బాలాశంకర్, జయపాల్, డేవిడ్ స్టోన్, నాగేశ్వరావు, డేవిడ్ రాజు, హాసన్ బాష తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో పంటలు మార్పిడి చేసుకోవాలి



**నాగులుప్పలపాడు, జులై 6, ప్రభాతవార్త**
ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్న నేపథ్యంలో పంటలు మార్పిడి చేసుకోవాలని వ్యవసాయాధికారి పి.వెంకటరావు తెలిపారు. సహకార సంఘ వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరు సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యాప్ ద్వారా ఎరువులను నమోదు చేసుకునే విధంగా పంటల సాగులో మెలుకువలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి వెంకటరావు మాట్లాడుతూ వర్షాభావం కొరత నేపథ్యంలో వర్షాభావం తట్టుకొనే పంటలైన సజ్జ, జొన్న తదితర పంటలను సాగు చేసుకోవాలన్నారు. పొలాల్లో రైతువారి కుంటలను ఏర్పాటు చేసుకుని వర్షం పడినప్పుడు నీటిని నిల్వ చేసుకుంటే పంటలు బెట్టకు వచ్చినప్పుడు స్ప్రింక్లర్ల ద్వారా పంటలను తడుపుకోవచ్చన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులపై దృష్టి సారించాలన్నారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారిణి సంధ్య, సొసైటీ త్రిసభ్యకమిటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, డైరక్టర్లు పెంటాల శ్రీనివాసరావు, సీఈఓ సన్నపనేని కోటేశ్వరరావు, సిబ్బంది జి.బసవపున్నయ్య, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## పెద్దగొల్లపల్లి గ్రామ కమిటీ ఆమోదం..

### - వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసి పనిచేద్దాం

### - చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి



**హనుమంతునిపాడు, జులై 6, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలంలోని పెద్ద గొల్లపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీకి ఆమోదం లభించడం పట్ల పార్టీ స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, మండల అధ్యక్షులు ఎక్కంటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకుడు గాయం బలరామిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ప్రతి కార్యకర్త సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అలాగే గతంలో గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన నక్క అరుణ, గ్రామ కన్వీనర్‌గా పని చేసిన దేవిరెడ్డి శంకర్‌రెడ్డి చేసిన సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్షుడు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీ సభ్యులందరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, జగనన్న నాయకత్వంలో నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు అండగా అందరూ ఐకమత్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దల సలహాలు, సూచనలను గౌరవిస్తూ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. హనుమంతునిపాడు మండలంలోని ఇతర గ్రామాలకు పెద్దగొల్లపల్లి ఆదర్శంగా నిలిచి పార్టీ బలోపేతంలో రోల్ మోడల్ గ్రామ కమిటీగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యకర్తల ఐక్యత, ప్రజాసేవ, పార్టీ అభివృద్దే గ్రామ కమిటీ ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

## గుంటకల రంగమ్మ భౌతికకాయానికి దద్దాల నివాళి



**హనుమంతునిపాడు, జులై 6, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం వేములపాడు పంచాయతీలో పార్టీ నాయకులు గుంటకల పెద్దన్న సతీమణి గుంటకల రంగమ్మ అనారోగ్యం కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఉదయం పార్టీ శ్రేణులతో కలిసి ఆమె భౌతికకాయిన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రంగమ్మ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, గొబ్బిళ్ళ శ్రీనివాసులు యాదవ్, తిండి రాజారెడ్డి, గుంటక రమణారెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, చక్కా బాల చెన్నయ్య, మాలపాటి వెంకటయ్య, మాలపాటి రామిరెడ్డి, భూతపాటి దేవయ్య, కేతబైన రామయ్య, శ్యామల శివారెడ్డి, భూతపాటి చిన్న బాల నరసయ్య, షేక్ కమల్, కాయకోకుల శ్రీను, గుంటగాని రామయ్య, భూతపాటి సురేష్, మల్లెల పవన్, పేరూరి వెంకటేశ్వర్లు, మల్లెల వెలుగొండయ్య, మాలపాటి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలి

### - బీజేపీ మండల అధ్యక్షుడు గుంటకల నరేష్



**హనుమంతునిపాడు, జులై 6, ప్రభాతవార్త**
దేశ సమైక్యత, ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప దేశభక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ మండల అధ్యక్షుడు గుంటకల నరేష్ కొనియాడారు. సోమవారం వేములపాడు గ్రామంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని బీజేపీ మండల అధ్యక్షుడు గుంటకల నరేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి త్రిమూర్తులు, 24వ బూత్ అధ్యక్షులు నారాయణరెడ్డి, వీరయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

7:7.qxd 7/6/2026 11:01 PM Page 1



# మార్కాపురం వార్త



## అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

### - ఏఐటియుసి మార్కాపురం కలెక్టరేట్ వద్ద నిరసన

### - కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ



**మార్కాపురం, జూలై 6, ప్రభాతవార్త**
ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం జిల్లా ఏఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కాంట్రాక్టర్లు మారుతున్న సమయంలో కార్మికులకు రూ.12 వేల వేతనం చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ, వాస్తవానికి కేవలం రూ.9 వేల మాత్రమే అందజేస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని, దీనిపై ప్రశ్నించిన లేదా హక్కుల కోసం మాట్లాడిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని, వారి వేతనాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల శ్రమకు తగిన గౌరవం కల్పించి, కనీస వేతన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు, ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## ఓఎస్డీ (అడ్మిన్)గా నవజ్యోతి మిశ్రా నియామకం



**మార్కాపురం, జూలై 6, ప్రభాతవార్త**
నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లా ఓఎస్డీ (అడ్మిన్)గా ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సాయి ప్రసాద్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నవజ్యోతి మిశ్రా గతంలో చింతపల్లి ఏఎస్పీగా విధులు నిర్వహించి సమర్థ అధికారిగా గుర్తింపు పొందారు. మార్కాపురం జిల్లా పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు వివిధ శాఖల సమన్వయం, శాంతిభద్రతల నిర్వహణ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. జిల్లా యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగాతీర్చిదిద్దేందుకు ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆయన నియామకంతో జిల్లా పరిపాలనకు మరింత వేగం చేకూరుతుందని స్థానిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి : తహశీల్దార్ చిరంజీవి

### - డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం





**మార్కాపురం, జూలై 6, ప్రభాతవార్త**
ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని మార్కాపురం మండల తహశీల్దార్ కె చిరంజీవి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని దరిమడుగు, పెద్ద నాగులవరం, కొండేపల్లి, రామచంద్రపురం పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ సందర్శించి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, సూపర్వైజర్లతో మాట్లాడిన ఆయన మరణించిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, ద్వంద్వ ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేసి ఓటరు జాబితాను కచ్చితంగా రూపొందించాలని సూచించారు. అలాగే డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మండలంలో సుమారు 70 శాతం మంది ఓటర్లు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత, మధ్య వయస్కులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ఓటర్ల నుంచి కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని తహశీల్దార్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల పరిశీలన

### - 16 హైరిజల్యూషన్ కెమెరాలతో నేరాల నియంత్రణకు బలోపేతం

### - జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**మార్కాపురం, జూలై 6 ప్రభాతవార్త**
మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 16 హైరిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా బ్యాగుల దొంగతనాలు, ద్విచక్ర వాహనాల చోరీలు, మొబైల్ ఫోన్ చోరీలు వంటి నేరాలను వేగంగా గుర్తించి, నిందితులను పట్టుకోవడంతో పాటు దొంగిలించిన వస్తువులను రికవరీ చేయడం సులభమవుతుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కాపురంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన డీఎస్పీ యు నాగరాజు, సీఐ అల్తాఫ్ హుసేన్, సంబంధిత ఎస్ఐలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కంభంలో ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుక



**కంభం, జూలై 6, ప్రభాతవార్త**
జనసంఘ్ పార్టీ సంస్థాపక దినోత్సవ రూపశిల్పి, మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి జయంతి కార్యక్రమాన్ని కంభం పట్టణంలోని స్థానిక బిజెపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు బాదం కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాదం కిషోర్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకోసం ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రావణ్ పై జనసైనికుల ఫిర్యాదు



**రాచర్ల, జులై 6, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రశ్న రావణ్ పై రాచర్ల జనసైనికులుస్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు స్థానిక ఎస్సై శివకు పోలీస్ స్టేషన్‌లో సోమవారం లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో యుయస్ నాయుడు, అలిశెట్టి వెంకటేశ్వర్లు, తిరుమల శెట్టి వెంకట్రావు, వేశపోగు చిన్న జనార్దన్, కోటేశ్వరరావు, రాజు తదితరులు ఉన్నారు.

## సర్ కార్యక్రమ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్



**రాచర్ల, జూలై 6 ,ప్రభాతవార్త**
మండలంలోని ఆకవీడు, చోళ్ళవీడు గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమాన్ని సోమవారం రాచర్ల తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని అన్నారు. మరణించిన, శాశ్వత వలస,డబుల్ ఎంట్రీ ఓటర్ల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని అలాగే డిజిటైజేషన్ త్వరితగతిన నూరు శాతం పూర్తి చేయాలని బిఎల్ఓ లను సూపర్వైజర్లను ఆదేశించారు. ఓటర్ల నమోదు మరియు తొలగింపుల్లో సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. సర్వే నత్తనడకన సాగుతుందని, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు వేగం పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల బిఎల్ఎలు, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ తీరును పరిశీలించిన కలెక్టర్ విజయ సునీత



**పొదిలి, జులై 6, ప్రభాతవార్త**
పొదిలి పట్టణంలో సర్ కార్యక్రమం జరుగుతున్న తీరును మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం రాత్రి 7 గంటలకు పరిశీలించారు. సర్ ప్రక్రియ తీరుతెన్నులను ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్ కార్యక్రమానికి గడువు తక్కువగా ఉన్నందున త్వరగా పూర్తి చేయాలని బీఎల్‌వోలు, సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా ప్రజలు కూడా బీఎల్ఓలకు సహకరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వీరితో పాటు మార్కాపురం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పకడ్బందీగా చేపట్టాలి

### - మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరి, జులై 6, ప్రభాతవార్త**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధికారులను కోరారు.సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు, సచివాలయ సిబ్బందితో కలిసి ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కాలం చెల్లిన వ్యక్తుల పేర్లు ఇంకా జాబితాలో ఉంటే వాటిని వెంటనే తొలగించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రత్యేకసవరణ ప్రక్రియను నిర్వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని షేక్ అబ్దుల్ గఫార్ విజ్ఞప్తి చేశారు.



## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

### - ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరిస్తాం

### - జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

### - పోలీస్ మీ కోసం కార్యక్రమంలో 47 ఫిర్యాదుల స్వీకరణ






**మార్కాపురం, జూలై 6, ప్రభాతవార్త**
ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఖిపోలీస్ మీకోసంఖి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారంపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై మొత్తం 47 ఫిర్యాదులను సమర్పించారు. ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వికలాంగులు, వృద్ధులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అందిన వినతులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే విచారణ ప్రారంభించి,చట్టప్రకారం పారదర్శకంగా విచారణ నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లా పోలీసు కార్యాలయానికి రావడం సాధ్యంకాని ప్రజలు తమకు సమీపంలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం లేదా సబ్‌డివిజన్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని ఎస్పీ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని, ప్రతి వినతిని బాధ్యతగా స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భూ వివాదాలు, కుటుంబ కలహాలు, భర్త లేదా అత్తారింటి వేధింపులు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలు, చీటింగ్ కేసులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి,సమగ్ర విచారణ అనంతరం చట్టపరిధిలో న్యాయం అందించేందుకు జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు,ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మార్కాపురం సిఐఅల్తాఫ్ హుస్సన్, వైపాలెం సిఐ కె అజయ్‌కుమార్, కనిగిరి సిఐ శ్రీనివాసులు తదితర అధికారులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ - దద్దాల



**కనిగిరి, జులై 6, ప్రభాతవార్త**
స్వాతంత్ర్య సోరాటంలో తమ వంతు పాత్ర పోషిస్తూ, సామాజిక సమానత్వం,అణగారిన వర్గాల ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోదుడు డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ అని కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్అన్నారు. బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురష్కరించుకుని పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పోలీసు స్టేషన్ ఆవరణలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబుజగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమసమాజ స్థాపనకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. అంటరానితనంపై పోరాటం చేస్తూనే దేశ రక్షణ, వ్యవసాయ కార్మిక శాఖల మంత్రిగా, ఉప ప్రధానిగా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చింతకుంట్ల సాల్మన్‌రాజు, గూడూరి అబ్రహం లింకన్, ఓకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, చింతగుంట్ల కిశోర్‌బాబు, సైకం ఏడుకొండలురెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, శ్యామల సాంబిరెడ్డి, మల్లెల వెలుగొండయ్య, గోడి నారాయణరెడ్డి, కస్తాల బాలాజీ, మూలే రాజశేఖర్‌రెడ్డి, తెల్లగడ్డ వెంకటరావు, డబ్బుకొట్టు రవికుమార్, షేక్ సన్నీ, సంగు కృష్ణారెడ్డి, కరాటపు రాజారావు, యర్రబల్లి ఆంథోని, షేక్ ఖాజావ్, చీమలదిన్నె రమేష్, పగడాల శివకృష్ణ, తాతపూడి నాని, గంజి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టీడీపీ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన ఉమర్ ఫరూక్ హుస్సేన్

### - మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా సర్టిఫికేట్ అందజేత



**కనిగిరి, జులై 6, ప్రభాతవార్త**
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో కనిగిరి పట్టణ 25వ యూనిట్ ఇన్‌చార్జి ఉమర్ ఫరూక్ హుస్సేన్ పాల్గొని సోమవారం విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసినట్లు ధృవీకరణ సర్టిఫికేట్‌ను అందుకున్నారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, ప్రజలతో సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారం, నాయకత్వ లక్షణాలపై నిర్వహించిన ఈ శిక్షణలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లో మరింత సమర్ధవంతంగా తీసుకెళ్లేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలు పెంపొందాయని ఉమర్ ఫరూక్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉమర్ ఫరూక్ హుస్సేన్‌కు అభినందనలు తెలియజేసి, పార్టీ అభివృద్ధికి మరింత సమర్థంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## జులై 8 న కేకే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరం

**కనిగిరి, జులై 6, ప్రభాతవార్త**
కనిగిరిలోని కేకే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుడ్లూరు మండలం వేమవరం గ్రామంలోని శ్రీ అంకాలమ్మ గుడి వద్ద జులై 8న ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ జనరల్, ల్యాప్రోస్కోపిక్, జీఐ సర్జన్ డాక్టర్ నంబుల మాల్యాద్రి సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ నంబుల మాల్యాద్రి రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించనున్నారు. ఉచిత ఓపీతో పాటు మధుమేహం, రక్తపోటు, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. అలాగే అవసరమైన వారికి వ్యాధి నిర్ధారణ, చికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించిన వైద్య సలహాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో నమోదు చేసుకున్న రోగులకు హెర్నియా, లైపోమా, థైరాయిడ్ గడ్డలు, రొమ్ము గడ్డలు, పిత్తాశయ రాళ్లు, అపెండిసైటిస్, సిస్టులు, ఫైల్స్, ఫిషర్, ఫిస్టులా తదితరవ ఆ్యధులకు సంబంధించిన పరీక్షలు, వైద్య సలహాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న పాత వైద్య రికార్డులు, పరీక్షల నివేదికలు, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలు వెంట తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8008037496 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుక



**యర్రగొండపాలెం, జులై6, ప్రభాతవార్త**
భారత మాజీ ప్రధాని,ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. యర్రగొండపాలెం పట్టణంలోని కొలుకుల సెంటర్ కూడలిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వర్ధంతి సభను నిర్వహించారు.నియోజకవర్గ శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చిన పార్టీ శ్రేణులు స్థానిక యర్రగొండపాలెం పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి,దేశ రక్షణకు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకులా ముసాలారెడ్డి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీవిశ్వనాథ్,జడ్పీటీసీ విజయభాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘ నాయకులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం నిర్మాణం కోసం రూ.50 వేలు విరాళం



**గుడ్లూరు, జులై 6, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం నిర్మాణం కోసం ఉలవపాడు మండలం చాగొల్లు గ్రామానికి చెందిన శ్రీఆలూరి వెంకయ్య, ధర్మపత్ని అమరావతి, కుటుంబ సభ్యులు సతీష్, రమ్య, దేవాన్ష్, లిఖిత్ రూ.50వేల రూపాయలు విరాళం అందించారు. చాగొల్లు గ్రామంలో ఆ మొత్తం ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావుకు అందజేశారు. విరాళం రసీదును అందజేసి హనుమంతరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ నిర్మాణం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ ప్రాంగణంలో స్వామి వారి చుట్టూ శ్రీ రామనామ జపంతో ప్రదక్షిణ చేసి మనసులో సంకల్పం స్వామివారికి జపంతో ప్రదక్షిణ చేసి మనసులో సంకల్పం స్వామివారికి విన్నవిస్తే ఆ సమస్యకు స్వామి పరిష్కారం చూపిస్తూ భక్తులకు కొంగుబంగారంగా ఉన్నారని ప్రతిష్ఠకు ముందే శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి లీలలు చూపుతున్నారని తెలిపారు. భక్తులు ధన,వస్తు రూపంలో విరాళం సమర్పిస్తున్నారని సిమెంటు, ఇటుకలు సమర్పణతో ఆలయం నిర్మాణం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. 54 అడుగుల ఎత్తు విరాట్ ఆంజనేయస్వామి వారి విగ్రహ నిర్మాణం కోసం రూ.59,999 రూపాయలు విరాళం అందించిన వారి పేర్లు ప్రత్యేక శిలా ఫలకం మీద వ్రాయడం జరుగుతుందని హనుమంతరావు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ రామనామ జపం, హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిరంతరాయంగా 2022 నుంచి ప్రతి ఆదివారం, మంగళవారం, శనివారం రోజున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి అందజేత



**మార్టూరు, జులై 6, ప్రభాతవార్త**
మార్టూరు మండలం లక్కవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో 34 మంది విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్షుడు కొర్రపాటి సుబ్రమణ్యం, కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు మాదాల సాంబశివరావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రిని అందించడం ద్వారా విద్యాభివృద్ధికి సహకరించడం రోటరీ క్లబ్ యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## పిడుగు సత్యనారాయణ దశదిన కర్మ కార్యక్రమంలో కదిరి పార్థసారథి



**సీఎస్‌పురం, జులై 6, ప్రభాతవార్త**
శీలంవారిపల్లి గ్రామానికి చెందిన పిడుగు సత్యనారాయణ దశదిన కర్మ కార్యక్రమం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారధి పాల్గొని సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడుగు వారి నారాయణ, ఇరగని చలపతిరావు, మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, తికెణం లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**కొనకనమిట్ల, జులై 6, ప్రభాతవార్త**
మండలంలోని సిద్దవరం భారతీయ జనతా పార్టీ 168 బూత్ నందు భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు అపరవిద్యావేత్త,అఖండ భారతదేశం ఐక్యత కోసం పోరాడిన వీరుడు దివంగత శ్యాంప్రసాద్ ముఖర్జీ 125 జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శతకోటి ప్రమాణాలతో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మన్నం సురేష్, జిల్లానాయకులు కళ్ళంసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భార్య హత్య కేసులో జీవిత ఖైదు

### - సమర్థవంతమైన దర్యాప్తుతో నేరం రుజువు

### - పోలీసు బృందాన్ని అభినందించిన ఎస్పీ



**మార్కాపురం, జూలై 6 ,ప్రభాతవార్త**
భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది.కంభం గ్రామానికి చెందిన గోన సత్యం, తన భార్య గోన అనితతో తరచూ గొడవలు పడుతూ ఆమెపై అనుమానం పెంచుకుని వేధింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో 2018 మే 13న ఇంట్లో నైలాన్ ప్లాస్టిక్ వైర్‌తో అనిత గొంతు బిగించి హత్య చేసినట్లు ఫిర్యాదు అందడంతో కంభం పోలీస్ స్టేషన్‌లో హత్య, వేధింపుల కేసు నమోదు చేశారు. అప్పటి కంభం ఎస్ఐ ఎం. రామా నాయక్ కేసు నమోదు చేయగా, అప్పటి మార్కాపురం సీఐ ఎం. బీమా నాయక్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.విచారణ సందర్భంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పర్యవేక్షణలో సాక్షులను సమయానికి కోర్టులో హాజరుపరచడం, పటిష్టమైన ట్రయల్ మానిటరింగ్ నిర్వహించడం ద్వారా నిందితుడిపై నేరం రుజువైంది.దీంతో మార్కాపురం ఆరవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవాని నిందితుడు గోన సత్యానికి జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో సమర్థవంతంగా విధులు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి, అప్పటి సీఐ బీమా నాయక్, ప్రస్తుత కంభం సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ శివకృష్ణారెడ్డి, కోర్టు లైజన్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్, హోమ్ గార్డులను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## నిరుపేద విద్యార్థిని తండ్రి వైద్యఖర్చుకు సేవా సదన్‌సాయం

**వలేటివారిపాలెం, జూలై 6, ప్రభాతవార్త**



వలేటివారిపాలెం మండలం అత్తింటివారిపాలెం ఎస్‌సీ కాలనీలో జడ రాజేంద్ర అనే వ్యక్తి వెన్నెముక ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. వారి పిల్లలు పోకూరు జెడ్ పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుతున్నారు. వాళ్ళ నాన్నకు ఆపరేషన్ చేయడం తప్పనిసరని అందుకు 2లక్షలు డబ్బులు అవసరమన్నారు. ఆర్థిక సమస్యగా ఉందని ఆ విద్యార్థులు అదేపాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయిని నూనె ప్రమీలాదేవితో వారి బాధ చెప్పగా ఆమె సేవాసదన్ రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి మాల్యాద్రితో సంప్రదించి సాయం అందేలా చూసింది. సేవా సదన్ దాతల సహాయంతో సేకరించిన 10,200 రూపాయలను వారికి నగదుగా అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి, గౌరవాధ్యక్షులు కట్టా యేసునాదం, కట్టా కొండలరావు పాల్గొన్నారు. క్రియాశీలక సభ్యులుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.జనార్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సులోచన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శంకర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి కె.నాగసూర్య శర్మ, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు తులుగు ప్రసాద్, నేలకుర్తి శకుంతల, జి లక్ష్మీనారాయణ, వై.రమేష్, యం.శ్రావణ్ బోస్, టి నాగసరస్వతి, డి.రాము, పంపన శ్రీనివాస్, కడలి విమల, బి రాజశేఖర్, యం. శివ కృష్ణ ఉన్నారు.

## వధూవరులు ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**వలేటివారిపాలెం, జూలై 6, ప్రభాతవార్త**



మండల పరిధిలోని సింగమనేనిపల్లి గ్రామంలో నాయుడు రామచంద్రయ్య, నిర్మల దంపతుల కుమార్తె ప్రియాంక, వెంకట శశాంక్ రిసెప్షన్ సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి గ్రామ టిడిపి అధ్యక్షుడు బత్తిన మహేష్, పార్టీ నాయకులు అత్తోట విజయసారథి, వెంకటేశ్వర్లు, సురేష్, గుర్రం లక్ష్మీనరసింహం, మహేష్, చిడిపోతు మల్లికార్జున, బాసం వెంకటేశ్వర్లు, బత్తిన మాల్యాద్రి, సురేష్, నవులూరి రత్తయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణలో 60శాతం లక్ష్యాలు పూర్తి: తాసిల్దార్ రవినాయక్

**బల్లికురవ, జూలై 6, ప్రభాతవార్త**



మండలంలో జరుగుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ కార్యక్రమంలో 60 శాతం లక్ష్యాలను పూర్తి చేసినట్లు తాసిల్దార్ రవినాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని కొప్పెరపాలెం, మల్లాయపాలెం, గుంటుపల్లి, కొమ్మినేనివారిపాలెం బిఎల్‌ఓల పరిధిలో జరుగుతున్న సర్ ప్రక్రియను తాసిల్దార్ స్వయంగా పర్యవేక్షించారు. ఒకవైపు బిఎల్ఓ లకు, మరొకవైపు ఓటర్లకు నిర్దిష్ట సమాచారం అందజేస్తూ, సమయం ముగిసేలోపు పూర్తిస్థాయి లక్ష్యాలను విజయవంతంగా చేరుకునేందుకు సహకారం అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని నివాస గృహాలకు చేరుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతిరోజు బిఎల్వోలు తమ పరిధిలో నిర్దేశించుకున్న మ్యాపింగ్ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సంక్షిప్త ఓటరు సవరణ జాబితా విజయవంతంగా పూర్తిచేస్తామని తాసిల్దార్ రవినాయక్ ప్రభాతవార్తకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట డిటిపరహర్ష ఉన్నారు.

## నక్క బొక్కలపాడులో మంత్రి గొట్టిపాటి పరామర్శలు

**బల్లికురవ, జూలై 6, ప్రభాతవార్త**





రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం మండలంలోని నక్క బొక్కలపాడు గ్రామంలో పలువురిని పరామర్శించాడు. ముందుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు ధూళిపాళ్ల. వెంకటేశ్వర్లు వయో భారంతో ఇటీవల మరణించారు. సోమవారం వారి నివాస గృహానికి చేరుకొని కుమారుడు కృష్ణమూర్తిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా దూళిపాల వీరాంజనేయులు ఇటీవల పాముకాటుకు మరణించాడు. వారి నివాసగృహానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన కట్టా రామమ్మూర్తి భార్య నాగేంద్రం లివర్ సంబంధిత వ్యాధితో ఇటీవలే మరణించారు. వారి నివాస గృహానికి చేరుకొని నాగేంద్రం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట క్లస్టర్ ఇంచార్జ్ మల్లినేని గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షులు, ధూళిపాళ హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షులు దరిశి రామస్వామి, దర్శి హనుమంతరావు, ధూళిపాళ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## కృష్ణమూర్తికి కరణం పరామర్శ

**బల్లికురవ, జూలై 6, ప్రభాతవార్త**



మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన ధూళిపాళ్ల కృష్ణమూర్తి తండ్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఇటీవల మరణించారు. సమాచారం అందుకున్న చీరాల వైకాపా ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు సోమవారం ఆయన నివాసగృహానికి చేరుకొని, వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నేతలు కార్యకర్తలు ఉన్నారు.

## ఎల్లమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

**సంతమాగులూరు, జూలై 6, ప్రభాతవార్త**



మండలం లోని మిన్నెకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ నాగారపు ఎల్లమ్మ తల్లి దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని మంత్రి గొట్టిపాటి ఆకాంక్షించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల టిడిపి అధ్యక్షులు చేవూరి వాసిరెడ్డి సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, ముప్పాళ్ళ శ్రీను బాబు, వసంత వేణుబాబు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## దర్శి ఎస్సైగా ఏడుకొండలు బాధ్యతలు స్వీకరణ

**దర్శి, జూలై 6, ప్రభాతవార్త**




దర్శి మండలం ఎస్సైగా జి.ఏడుకొండలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహించారు. గతంలో దర్శి ఎస్సైగా పని చేసిన ఎం.మురళి సీఐగా ప్రమోషన్ రావడంతో బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతల కోసం పని చేస్తానని మండలంలోని ప్రజలు సహకరించాలన్నారు. అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎస్సీ సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించిన గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, జూలై 6, ప్రభాతవార్త**

దర్శినియోజకవర్గ స్థాయి ఎస్సీ సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించిన దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఎస్సీ సోదరులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. దర్శి నియోజకవర్గంలోని ఎస్సీ సోదరులకు రాజకీయపరంగా ఉన్నత పదవులు, ఇళ్ల స్థలాల విషయంలో గాని, పక్కాగృహాల మంజూరు చేసే విషయంలో గాని మీకు అండగా ఉంటామని తెలియజేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు రామిసూతల పరిశుద్ధరావు, మాజీ ఎంపీపీ నూనె విజయ్ కుమారి, తెల్లయ్య, వరగాని పౌలు, సువయ్య, దర్శి మున్సిపల్ కౌన్సిలర్ ఇత్తడి సునీత, దినకర్, అనిల్, నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్ కుమార్

### - విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

**సంతనూతలపాడు(మద్దిపాడు), జూలై 6, ప్రభాతవార్త**



మద్దిపాడు మండలం బసవన్నపాలెం హైస్కూల్లో సోమవారం నాడు జరిగిన ఒక కార్యక్రమంలో చీమకుర్తి-రామతీర్థం, గ్రామాల పరిధిలోల ఏపీ మిడ్వెస్ట్ గ్రానైట్ కంపెనీ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ప్రారంభించారు. అదే విధంగా పాఠశాలకు వారు కంప్యూటర్ ను బహుకరించారు. గోల్డెన్ గ్రానైట్ కంపెనీ అధినేత మండవ రవి ఆధ్వర్యంలో వెంకటాచలం రవి, మండవ బ్రదర్స్ వారి సౌజన్యంతో అందించిన సైకిళ్లను విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే విజయ్ కుమార్ అభినందించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు విద్యార్థులు వీటిని సద్వినియోగపరుచుకొని ముందంజలో నిలవాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ కోరారు. ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న సదుపాయాల ద్వారా విద్యార్థులు భాగా చదివి ముందంజలో నిలిచి గ్రామానికి జిల్లాకి, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ మేనేజర్ నతానియల్, కంపెనీ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతిబాబు, జిల్లా కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ రంగారావు, హైస్కూల్ హెడ్‌మాస్టర్ చెన్నుపాటి మంజుల, ఎంపీడీవో డీఎస్పీ ప్రసాద్, తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, గోల్డ్ గ్రానైట్ అధినేత మండవ రవి, బసవన్నపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు కొప్పోలు విశ్వనాథం, హైస్కూల్ చైర్‌పర్సన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ పనిదినాల కార్యక్రమాన్ని పరిశీలించిన డైరక్టర్ శివారెడ్డి

**సంతనూతలపాడు, జులై 6, ప్రభాతవార్త**



రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంనకు సంబంధించి సంవత్సరానికి 100 రోజులకు బదులుగా 125 రోజులు పని దినాలను నూతనంగా ప్రవేశపెట్టిన ఆయా పనులను రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరక్టర్ పీవీ శివారెడ్డి పరిశీలించారు. మండలం కొనగానివారిపాలెం గ్రామంలో వీబీజీరామ్‌జీ పనులను ఈ సందర్భంగా డైరక్టర్ శివారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు బాలినేని కళ్యాణ్‌రెడ్డి, బీజేపీ నాయకులు సంకె సుబ్బారావు, దుంపా కోటిరెడ్డి, బాలినేని చెంచిరెడ్డి, బీజేపీ నాయకులు దేసు రాంబాబు, సురేష్, ఆదినారాయణ, సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్, పవన్ కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

**సంతనూతలపాడు, జూలై6, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామంలో పోలేరమ్మ పోతురాజు విగ్రహాలు ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి మహిళలచే నిర్వహించిన కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ కోలాటం మాస్టర్ నేరేడుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలు విశేషంగా ఈ కోలాటంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాట బృందాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు నల్లూరి వెంకటరావు, టీడీపీ నాయకులు నల్లూరి రామచంద్రరావు, ముండ్లమూడి ప్రసాదరావు, నల్లూరి గోపిచంద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు, మహిళలచే నిర్వహించిన ఈ కోలాట ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న గొట్టిపాటి

**జె.పంగులూరు జూలై 6 ప్రభాతవార్త**



ఏకాగ్రతతో ఆధ్యాత్మిక ధ్యానము చేసుకొనుటకు పవిత్రమైన స్థలం దేవాలయంలోనే కొనసాగుతుందని మంత్రి గొట్టిపాటి అన్నారు. మండలంలోని జనకవరం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్లను దర్శించుకొనగా పూజారి చందలూరి సునీల్ శర్మ మండల పూజా కార్యక్రమం, విశేషంగా పంచ అమృత అభిషేకాలతో, విశేష ద్రవ్యములతో, అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి గొట్టిపాటికి అమ్మవారు, అయ్యవారిల ఆశీస్సులు కలకాలం ఉండాలని అక్షింతలు శిరస్సునసి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో చందులూరి అచ్యుత శర్మ, చందలూరి భరత్ శర్మ, కొండ కావూరి నాగ శ్రీనివాసరావు పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. జనకవరం భక్తుల శివనామ స్మరణతో మారు మ్రోగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, భక్త బృందం పాల్గొన్నారు.

## యూరియా, డీఏపీ అవసరమైన రైతు పంట నమోదు తప్పనిసరి

### - వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి

**జె.పంగులూరు జూలై 6 ప్రభాతవార్త**



మండలంలోని కోటపాడు గ్రామంలో ఖరీఫ్ 2026 కాలానికి పంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాలని వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులను సోమవారం సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి.డి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ కోటపాడు గ్రామంలో పంటనమోదు కార్యక్రమం లో పాల్గోని రైతులకు పంట నమోదు గురించి తెలియజేస్తూ పంటల సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవడం వల్ల యూరియా, డిఏపీ పొందుటకు అవకాశందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వలన పంట నష్టం జరిగితే నష్టపరిహారం పొందుటకు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పండించిన పంటను మద్దతు ధరకు అమ్మ కొనుటకు, సున్నా వడ్డీ రాయితీ పొందుటకు స్వచ్ఛందంగా పంటలకు బీమా చేయించుకున్న వారికి పంటలు బీమా పొందుటకు, ప్రభుత్వం అందించే ప్రతి సదుపాయాన్ని పొందవచ్చునన్నారు.

## విద్యుత్తులేక ఎండిపోతున్న వేరుశెనగ

**ఉలవపాడు, జూలై 6, ప్రభాతవార్త**



వేరుశనగ రైతులకు విద్యుత్ సమస్యలు మొదలయ్యాయి. వారం రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పైర్లు వాడు మొకం పట్టాయి. ఉలవపాడు మండలం కరేడు గ్రామం పరిధిలో ఉన్న తీరంలో వేరు శనగ సాగు చేస్తున్నారు. గత వారం రోజుల నుండి విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. సోమవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు సబ్ స్టేషన్ కు వచ్చి గొడవ చేశారు. అయినా అధికారులు స్పందించలేదు. దీనితో రైతులు సింగరాయకొండలోని విద్యుత్ శాఖ ఏడిని ఫోనులో మాట్లాడారు. విద్యుత్ సరఫరా సమయాన్ని మార్చాలని కోరారు. అనంతరం ఒంగోలులోని ఎస్ ఈ ని కలిసి వేరుశనగ రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, అదేవిధంగా ఉదయం ఐదు గంటలకు విద్యుత్ ఇచ్చేలా సమయం మార్చాలని అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అలగాయపాలెం, బట్టి సోమయ్య పాలెం, టెంకాయ చెట్ల పాలెం రైతులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం - ఎమ్మెల్యే ఉగ్ర

**కనిగిరి, జులై 16, ప్రభాతవార్త**



మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం కనిగిరి ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో విగ్రహానికి కనిగిరి ఎమ్మెల్యే ఒంగోలు పార్లమెంట్ టీడీపీఅధ్యక్షులు డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో విశిష్ట ముద్ర వేసిన మహానేత అని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్‌ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, బుల్ల బాలబాబు, ఓబుల్‌రెడ్డి, కొల్లూరి శ్రీనివాసులు, షేక్ రెహ్మాన్, షేక్ రిటా ఫయాజ్, రోషన్ సంధాని, షేక్ ఇస్మాయిల్, కనుమరుల కృష్ణారెడ్డి, ముకుందతో పాటు పలువురు టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ఒ ప్లాంట్ మరమ్మత్తులకు దాతల సహకారం

**అద్దంకి, జులై 6, ప్రభాతవార్త :**

శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు ఆర్ఒ ప్లాంట్ రిపేర్ ఉండగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అద్దంకి వారు స్పందించి 25000 రూపాయలు విలువ గల హై ప్రెజర్ మోటర్ సమకూర్చారని హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. మానవత కమిటీ 12,500, సభ్యులు గార్లపాటి శ్రీనివాసరావు ( భాస్కర సప్లయర్స్ 5000), తాత సురేష్ ( త్రివిక్రమ ఎలక్ట్రికల్స్ 5000), ఆలూరి ప్రసాద్ ( శ్రీ వెంకటరమణ టైల్స్ శానిటరీ 2500) అందజేశారని కన్వీనర్ సుంకర శ్రీదేవి, అధ్యక్షులు పేరం సుధాకర్ రెడ్డి, కార్యదర్శి గోనుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు.

## ఎరువుల షాపుల తనిఖీలు

**అద్దంకి, జులై 5, ప్రభాతవార్త :**



అద్దంకి పట్టణంలో సోమవారం ఎరువుల షాపులు తనిఖీలు నిర్వహించారు. ఎపిఎఐఎంఎస్ యాప్ ద్వారా నే యూరియా, డిఎపి ఎరువులు అమ్మాలని సింగరాయకొండ వ్యవసాయ సహాయకులు నిర్మల కుమారి తెలిపారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తో కలిసి గత మూడు నెలల గా అమ్మిన ఎరువుల వివరాలు, రికార్డ్స్‌లను పరిశీలించారు.

## క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలకి మంత్రి పరామర్శ

**అద్దంకి, జులై 6, ప్రభాతవార్త :**



మండలంలోని చిన్న కొత్తపల్లి గ్రామంలో ధూళిపాళ్ల పూర్ణయ్య, సతీమణి రమాదేవి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి నివాసానికి వెళ్లి రమాదేవిని పరామర్శించి, ఆరోగ్య విషయమై వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వున్నారు.

### ధూళిపాళ్ల సుబ్బారావుకు మంత్రి పరామర్శ



అద్దంకిలో ఆర్‌టిపి ఏజెంటుగా పనిచేస్తున్న చిన్న కొత్తపల్లి గ్రామంలో ధూళిపాళ్ల సుబ్బారావు తండ్రి సత్యనారాయణ, ఈనెల 2వ తేదిన మృతిచెందారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం చిన్నకొత్తపల్లిలోని సుబ్బారావు గృహానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట కరి పరమేష్, మానం దాసు, తదితరులు వున్నారు.

## నూతన వధూవరులకు మంత్రి శుభాకాంక్షలు

**అద్దంకి, జులై 6, ప్రభాతవార్త :**



అద్దంకి పట్టణంలోని 6వ వార్డులో కమ్మిశెట్టి శ్రీధర్, లక్ష్మి దంపతుల కుమారుడి వివాహం ఇటీవలే జరుగగా, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులు బాలాజీ, కవిత లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోటరీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళి

**అద్దంకి , జులై 6, ప్రభాతవార్త :**




రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40 వ వర్ధంతి కార్యక్రమం కట్టకిందపాలెంలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు పువ్వాడ రామ కోటేశ్వరరావు, సెక్రటరీ కరి రామయ్య, ట్రెజరర్ గూడా లక్ష్మీ రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, స్థానికులు పాల్గొన్నారు.

## గొట్టిపాటికి సంఘీభావం తెలిపిన వెంకటాపురం వైసిపి అభిమానులు

**అద్దంకి, జులై 6, ప్రభాతవార్త :**



సంతమాగులూరు మండలం, పుట్టావారి పాలెం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని అద్దంకి మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన జనరాజుపల్లి కోటేశ్వరరావు, దాసరి రామయ్య, పాలపర్తి సౌలు, జనరాజుపల్లి ఐజాక్, దాసరి ఆనందరావు కుటుంబాలు మర్యాదపూర్వకంగా కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈ కుటుంబాల సభ్యులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, ప్రజా అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు ప్రకటించారు.

## దర్శిలో ఎరువుల దుకాణాల తనిఖీ

**దర్శి, జులై 6, ప్రభాతవార్త**



దర్శిలోని పలు ఎరువుల దుకాణాలను అద్దంకి ఏడీఏ, ఇంటర్నల్ స్క్వాడ్ ఎఫ్రాయిం సోమవారం తనిఖీ చేశారు. జూన్ 28వ తేదీ వరకు యూవరేజ్ కంటే ఎక్కువ యూరియా అమ్మకాలు జరిగిన రిటైల్ డీలర్స్ జాబితాలో 11 మంది దర్శి మండలంనకు చెందిన డీలర్ షాపులను మండల వ్యవసాయాధికారి తో కలిసి తనికీ చేశారు. 1,79,114 రూపాయల విలువ గల 30.55 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలకు అమ్మకాలు నిలుపుదల, రైతు వారి రసీదులు, స్టాక్ రిజిస్టర్‌లు సరిగ్గా లేకపోవడం వలన నాగార్జున ట్రేడర్స్, దర్శి శ్రీ వీరాంజనేయ ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్, రాజంపల్లి షాపుల రిటైల్ ఎరువుల లైసెన్స్‌లను వారం రోజుల పాటు సస్పెండ్ చేయమని, మండల వ్యవసాయాధికారి, దర్శి వారికి ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత ఊరియా అమ్మకాల రికార్డులు సరి చేసిన పిదవ సస్పెన్షన్ ఆర్డర్ రీ ఒకే చేస్తామని తెలియజేశారు.

## డిజిటిలైజేషన్ పక్రియను పరిశీలించిన దర్శి ఎన్నికల అధికారి శాంతి లక్ష్మీ

**ముండ్లమూరు, జులై 6, ప్రభాతవార్త**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమంలో భాగంగా ఏ.శాంతి లక్ష్మీ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, 103- దర్శి అసెంబ్లీ నియోజకవర్గ తాళ్లూరు మండలంలో పోలింగ్ కేంద్రం 245, 250 విఠలాపురం, ముండ్లమూరు మండలంలో పోలింగ్ కేంద్రం 181,182, 183 కెల్లంపల్లి పోలింగ్ కేంద్రం నెంబరు 194, 195, 196 పసుపుగల్లు, ముండ్ల మూరు మండలం, దర్శి అర్బన్ పోలింగ్ కేంద్రం నెం 132 లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి డిజిటలైజేషన్ తక్కువ ఫోగ్రెస్ ఉన్న బూత్‌లెవల్ అధికారులతో మాట్లాడుతూ డిజిటలైజేషన్ పక్రియ ను వేగవంతం చేయాలని, ఓటర్‌కు సంబంధించి విజిబుల్స్ గా ఫొటో ఉంటే వారి నుండి ఫొటో కరెక్ట్ చేయనవసరం లేదని, ఎన్యుమరేషన్ ఫారంలో పూర్తించాల్సిన కాలములను ఫిల్ చేసి ఓటరు, బూత్ లెవల్ అధికారుల సంకతాలతో ఎన్యుమరేషన్ ఫారం మొదటి పేజి మాత్రమే అప్లోడ్ చేయాలని రెండవ పేజి అప్లోడ్ చేయనవసరం లేదని సదరు విషయంలో బీఎల్‌వోలకు తెలియజేశారు.

## రాజంపల్లిలో మహిళలకు అవగాహన కల్పించిన దర్శి సీఐ రామారావు

**దర్శి, జులై 16, ప్రభాతవార్త**




మహిళలు, చిన్నారులపై జరుగుతున్న వేదింపులు, లైంగిక దాడులు, గృహహింస, సైబర్ నేరాల నివారణపై రాజంపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో దర్శి సీఐ రామారావు మహిళలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు లేదా చిన్నారులపై ఎలాంటి వేదింపులు జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు కూడా మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సీఐ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


7-7Pg5_7-7Pg5.qxd 06/Jul/26 11:08 PM Page 1



# అయోధ్య ట్రస్ట్‌కు కొత్త జనరల్ సెక్రటరీ?

## చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం





**అయోధ్య,జులై 6:** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో నెలకొన్న వివాదం మధ్య ఆయన తన పదవికి రాజీనామా చేశారు. చంపత్ రాయ్ వారసుడిగా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బాగ్రా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా, ప్రభుత్వ రంగ సంస్థ నాల్కో మాజీ అధిపతిగా పనిచేసిన బాగ్రాకు పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో విశేష అనుభవం ఉందని, ట్రస్ట్ కార్యకలాపాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు ఆయన సేవలు ఉపయోగపడతాయని వర్గాలు భావిస్తున్నాయి. ట్రస్ట్ తదుపరి దశలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో పరిపాలన, ఆర్థిక నిర్వహణ, సంస్థాగత పాలనపై పట్టు ఉన్న వ్యక్తిని బాధ్యతల్లోకి తీసుకురావాలన్న ఆలోచనతో ట్రస్ట్ ఉన్నట్లు సమాచారం. అయితే చంపత్ రాయ్ మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటే తప్ప ట్రస్టీగా కొనసాగనున్నారని తెలుస్తోంది. కొత్త జనరల్ సెక్రటరీ పేరును వెంటనే ప్రకటించే అవకాశం లేదని సమాచారం. ఈనెల 19, 20 తేదీల్లో ఢిల్లీలో జరిగే వీహెచ్‌పీ ద్వైవార్షిక జాతీయ కార్యవర్గ సమావేశంలో సంస్థాగత మార్పులు, బదిలీలతో పాటు ఈ అంశంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రామ మందిర విరాళాల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కఠిన వైఖరి అవలంబించగా, దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అనంతరం చంపత్ రాయ్‌తో పాటు ట్రస్టీ అనిల్ మిశ్రా తమ రాజీనామాలను సమర్పించారు. ఎస్ఐటీ ప్రాథమిక నివేదిక ప్రకారం, ఆలయానికి వచ్చిన నగదు విరాళాలను లెక్కించే బాధ్యతలో ఉన్న సిబ్బంది, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ఫుటేజీని క్రమం తప్పకుండా పరిశీలించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నగదును అపహరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనలో సుమారు రూ.7 నుంచి రూ.7.5 కోట్ల వరకు నగదు గల్లంతైనట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ రామ్ శంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ కూడా ఉన్నాడు. టిన్నూ యాదవ్ తనపై ఉంచిన నమ్మకాన్ని దుర్వినియోగం చేసి ఈ మోసానికి పాల్పడ్డాడని చంపత్ రాయ్ తన సన్నిహితులతో చెప్పినట్లు వర్గాలు వెల్లడించాయి. పట్టుబడే పరిస్థితి వచ్చినప్పుడు టిన్నూ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఓ నేతకు సమాచారం లీక్ చేశాడని కూడా సమాచారం. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ఇతర నిందితుల్లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ ఉన్నారు. ఇప్పటివరకు చంపత్ రాయ్, మిశ్రా, ప్రత్యేక ఆహ్వానితుడు గోపాల్ రావుపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయితే వీరిపైనా కేసు నమోదు చేయాలని కోరుతూ ఫైజాబాద్ బార్ అసోసియేషన్‌కు చెందిన అయోధ్య న్యాయవాదులు పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు.



## పహల్గామ్ ఉగ్రదాడి కేసు

# నిందితుడు హఫీజ్ సయీదే!

## అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఎ

## నిందితుల జాబితాలో టిఆర్ఎఫ్ సంస్థ పేరు

**న్యూఢిల్లీ, జులై 6:** పహల్గామ్ ఉగ్రదాడి కేసులో తాజాగా, పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సోమవారం అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. సోమవారం జమ్మూలోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఈ కొత్త ఛార్జిషీట్‌లో, సయీద్, అతని అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్ఎఫ్) పేర్లను చేర్చారు. ఈ టిఆర్ఎఫ్ సంస్థ కాశ్మీర్‌లో ఎల్ఇటికి కార్యాచరణ విభాగంగా పనిచేస్తోంది. జమ్మూలోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో, ఉగ్రవాద నిరోధక సంస్థ హఫీజ్ సయీద్‌పై అతని 'వ్యక్తిగత హోదాలో', లష్కరేతోయిబా (ఎల్ఇటి), టిఆర్ఎఫ్ అధిపతిగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. భారతదేశంపై యుద్ధం ప్రకటించడం, సరిహద్దు దాటి కుట్ర పన్నడం వంటి ఆరోపణలపై కూడా ఎన్ఐఎ తన ఛార్జిషీట్‌లో హఫీజ్ సయీద్‌పై శిక్షాస్మృతి సెక్షన్‌ను ప్రయోగించింది. డిసెంబర్ 15, 2025న దాఖలు చేసిన తన మునుపటి ఛార్జిషీట్‌లో, ఎన్ఐఎ పాకిస్తానీ ఉగ్రవాది సారథి సాజిద్ జట్‌తో పాటు, జులై 2025లో ఆపరేషన్ మహాదేవ్ సమయంలో భద్రతా దళాల చేతిలో హతమైన ముగ్గురు ఉగ్రవాదులు, అలాగే అరెస్టు చేయబడిన ఇద్దరు నిందితులను నిందితుడిగా చేర్చింది. పహల్గామ్ ఉగ్రదాడిని ప్రణాళిక చేయడం, సులభతరం చేయడం, అమలు చేయడంలో నిషేధిత ఎల్ఇటి/టిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ పాత్రకు గాను, దానిని ఒక చట్టబద్ధమైన సంస్థగా కూడా పరిగణించి అభియోగాలు మోపింది.



# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

### ఆరుగురు ఉగ్రవాదులు అరెస్టు, తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలు స్వాధీనం

**న్యూఢిల్లీ, జులై 6:** పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు మాడ్యూళ్లను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల ఫలితంగా భట్టితో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఒక ఉగ్రవాద మాడ్యూల్‌తో పాటు అక్రమ ఆయుధాల రవాణా నెట్‌వర్క్‌ను కూడా ఛేదించారు. ఈ మూడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అనంతరం ఈ ఆపరేషన్ చేపట్టారు. అరెస్టు అయిన ఆరుగురు నిందితులు ఈ నెట్‌వర్క్‌లో భాగమని, కుట్ర పూర్తి స్థాయిని నిర్ధారించడానికి, ఈ ఆపరేషన్‌తో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించడానికి వారిని విచారిస్తున్నామని అధికారులు తెలిపారు. దాడుల సమయంలో, ఈ నెట్‌వర్క్‌లోని సభ్యులు ఉపయోగించినట్లు ఆరోపించబడిన అనేక తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రాంచీ ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై దాడిలో బాంబులు వాడారు:** రాంచీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై ఇటీవల జరిగిన దాడిలో పెట్రోల్ బాంబులను కూడా ఉపయోగించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆ ఘటనకు, షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపించబడిన నెట్‌వర్క్‌కు మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయేమో దర్యాప్తు అధికారులు పరిశీలిస్తారని పోలీసులు తెలిపారు. అయితే, అటువంటి సంబంధం ఉన్నట్లు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఢిల్లీ పోలీసుల ప్రకారం, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఆరోపించబడిన ఉగ్రవాద, ఆయుధ సరఫరా మాడ్యూళ్ల గురించి మరింత సమాచారం సేకరించడానికి నిందితులను విచారిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని అరెస్టులు, స్వాధీనాలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నీరవ్ మోడీ అప్పగింతకు లైన్‌క్లియర్

## అంతర్జాతీయ కోర్టులోనూ లభించని ఊరట



**లండన్, జులై 6:** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఇసిహెచ్ఆర్) నుండి ఉపశమనం పొందేందుకు చేసిన విఫల ప్రయత్నంతో సహా, యునైటెడ్ కింగ్‌డమ్‌లో తనకున్న అన్ని చట్టపరమైన మార్గాలను వినియోగించుకున్న తర్వాత, భారతదేశానికి అప్పగించబడే అవకాశం ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, యుకె కోర్టులలో అప్పీళ్లను వినియోగించుకున్న తర్వాత మోడీ ఏప్రిల్‌లో ఇసిహెచ్ఆర్‌ను ఆశ్రయించారు. యూరోపియన్ కోర్టు ఆయనకు ఉపశమనం కల్పించలేదని, దీంతో ఆయన అప్పగింతను సవాలు చేయడానికి తదుపరి చట్టపరమైన మార్గాలు ఏవీ మిగల్లేదని వర్గాలు తెలిపాయి. చట్టపరమైన ప్రక్రియ వాస్తవంగా పూర్తవడంతో, మోడీని భారత అధికారులకు అప్పగించడానికి అవసరమైన పరిపాలనా లాంఛనాలను యుకె ప్రభుత్వం ప్రారంభించినట్లు సమాచారం. ఈ అప్పగింత ఇప్పుడు ఎప్పుడైనా జరగవచ్చని దౌత్య వర్గాలు సూచించాయి. 2019 మార్చి నుంచి లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైల్లో నిర్బంధంలో ఉన్న నీరవ్ మోడీ, తనను భారత్‌కు అప్పగిస్తే అక్కడ తనకు హింస ఎదురవుతుందని వాదిస్తూ పలు అప్పీళ్లు దాఖలు చేశారు. అయితే ఈ వాదనలను భారత్ తరఫున సిబిఐ, ఇడి అధికారులు బలమైన ఆధారాలతో ఖండించినట్లు సమాచారం. పిఎన్‌బి మోసం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోడీని స్వదేశానికి తీసుకురావడం భారత్ దర్యాప్తు సంస్థలకు పెద్ద విజయంగా భావిస్తున్నారు. మోడీ భారతదేశంలో పిఎన్‌బి మోసం కేసు, మనీలాండరింగ్ దర్యాప్తు, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, సాక్షులను ప్రభావితం చేశారనే ఆరోపణలతో కూడిన మరో కేసుతో సహా మూడు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.

# అబార్షన్‌పై నిర్ణయం తల్లిదే

## విడిపోయిన భర్త అనుమతి అనవసరం

### మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు





**ఇండోర్, జులై 6:** వైద్యపరమైన గర్భవిచ్ఛిత్తి చట్టం, 1971 ప్రకారం, విడిపోయిన భర్త సమ్మతి లేకుండానే తన 13 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి ఒక మహిళకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. హైకోర్టు ఇండోర్ బెంచ్‌లోని జస్టిస్ సందీప్ ఎన్ భట్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ఆ మహిళ తన భర్త నుండి విడిగా నివసిస్తోందని, వైవాహిక సంబంధాన్ని కొనసాగించడానికి ఇష్టపడటం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆమెకు పునరుత్పత్తి స్వేచ్ఛ హక్కు ఉంది. అందువల్ల, ఆమెకు గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడానికి అనుమతివ్వాలని పేర్కొంది. గర్భంకొనసాగించాలా?లేదా అబార్షన్ చేయించుకోవాలా? అన్నది తల్లి నిర్ణయం ప్రధానమని వ్యాఖ్యానించింది. భర్తనుంచి దూరంగా ఉంటున్నందున అతని అనుమతి అవసరంలేదని పేర్కొంది. వారు మొదట విడాకుల విషయంలో ఒక అంగీకారానికి వచ్చినప్పటికీ, ఆ తర్వాత భర్త వెనక్కి తగ్గడంతో, స్థానిక కోర్టు అతనికి నోటీసు జారీ చేసింది. అయితే, అతను కోర్టు ముందు హాజరు కాలేదు. ఆ తర్వాత భార్య, తాను 13 వారాల గర్భవతి అని కోర్టుకు తెలియజేస్తూ, అబార్షన్‌కు అనుమతి కోరుతూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్‌ను ఆశ్రయించింది. అయితే, భర్త తరఫున కోర్టులో ఎవరూ హాజరు కాలేదు. ఆమె వాదనలన్నీ విన్న తర్వాత, కోర్టు అబార్షన్‌కు అనుమతి మంజూరు చేసింది.

# 11న భారత్ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మహేంద్రగిరి



**న్యూఢిల్లీ, జులై 6:** భారత నౌకాదళం మరో అత్యాధునిక యుద్ధ నౌకను తన బలగాల్లోకి చేర్చుకోనుంది. స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన ప్రాజెక్ట్17ఏకు చెందిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ మహేంద్రగిరిని ఈ నెల 11న విశాఖపట్నంలో అధికారికంగా కమిషన్ చేయనున్నారు. ఎఫ్38 పెన్నెంట్ నంబర్ కలిగిన ఈ యుద్ధ నౌకను భారత నౌకాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరును ఈ యుద్ధనౌకకు పెట్టారు. ఈ పేరుతో భారత నౌకాదళంలో చేరుతున్న తొలి యుద్ధనౌక ఇదే కావడం విశేషం. స్వదేశీ రూపకల్పన, స్వదేశీ నిర్మాణంతో ఆధునిక యుద్ధనౌకలను అభివృద్ధి చేసే భారత నౌకాదళ లక్ష్యంలో ఇది మరో మైలురాయిగా భావిస్తున్నారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి నీలగిరి క్లాస్ లేదా ప్రాజెక్ట్17ఏలో భాగంగా నిర్మితమైంది. ఇప్పటికే సేవలందిస్తున్న శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్‌లకు మరింత ఆధునిక రూపంగా వీటిని రూపొందించారు. రాడార్‌కు సులభంగా కనిపించకుండా ఉండే స్టెల్త్ సాంకేతికత, తక్కువ ఇన్‌ఫ్రారెడ్ ఉద్గారాలు వంటి ప్రత్యేకతలతో ఈ యుద్ధనౌకను అభివృద్ధి చేశారు. శత్రు రాడార్లు, క్షిపణుల గుర్తింపును తప్పించుకునే సామర్థ్యం మరింత పెరుగుతుంది.

# రాజ్యసభ మూడు స్థానాలకు నోటిఫికేషన్



**కోల్‌కత్తా,జులై 6:** పశ్చిమ బెంగాల్ లో అధికార మార్పిడి అనంతరం అనేక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీకి ముఖ్యమంత్రి సువేందు అధికారి సారథ్యంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంవరుస షాకులిస్తోంది. ఇప్పటికే ఈడీ, ఐటీ దాడులు జరుగుతున్నాయి. వ్యతిరేకంగా ప్రచారం చేసిన సెలెబ్రెటీలను కూడా వదలట్లేదు. కేసులు నమోదవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య పశ్చిమ బెంగాల్ లో మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అసెంబ్లీ ప్రాంగణంలో పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. రాత్రికి ఫలితాలు వెల్లడవుతాయి. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు సభ్యులు తమ పదవీ కాలం ముగియక ముందే రాజీనామాలు చేయడం వల్ల ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. కిందటి నెల 8న సుఖేందు శేఖర్ రాయ్, 10న సుస్మితా దేవ్, 11న ప్రకాష్ చిక్ బరాక్ తమ సభ్యత్వాలకు రాజీనామాలు సమర్పించారు. అవి ఆమోదం పొందాయి. ఈ ఎన్నికల ద్వారా నూతనంగా ఎంపికయ్యే ఎంపీలు 2029 ఆగస్టు, 2030 ఏప్రిల్ వరకు సభ్యులుగా కొనసాగుతారు. పశ్చిమ బెంగాల్ రాజ్యసభ ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7 మంగళవారం నోటిఫికేషన్ జారీ అవుతుంది. నామినేషన్లను దాఖలు చేయడానికి చివరి తేదీ 14. 15 నాటికి నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి 17వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. 24 పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కిస్తారు. 27వ తేదీ నాటికి ఉప ఎన్నికల ప్రక్రియ మొత్తం కూడా పూర్తవుతుంది. ఉప ఎన్నికలను ఎటువంటి వివాదాలు లేకుండా, అత్యంత పారదర్శక పద్ధతిలో నిర్వహించడానికి, పోలింగ్ పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక పర్యవేక్షక బృందాలను రంగంలోకి దించనుంది. నిష్పక్షపాత వాతావరణంలో ఈ కీలక ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా సరిపోవు భద్రతా సిబ్బంది, ప్రత్యేక పరిశీలకులను నియమిస్తున్నట్లు అండర్ సెక్రటరీ రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

# ఆర్మీ ట్రయల్స్‌పరీక్షల్లో ఉగ్రమ్ రైఫిల్ సక్సెస్

### హైదరాబాద్ స్టార్టప్ డ్వీపా డిఫెన్స్ రైఫిల్‌కు రక్షణ కొనుగోళ్లు


**న్యూఢిల్లీ,జులై 6:** రక్షణ తయారీ సంస్థ డ్వీపా డిఫెన్స్ దేశీయ రక్షణ తయారీలో కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ అభివృద్ధి చేసిన ఉగ్రం 7.6251 మి.మీ. బ్యాటిల్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కీలక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ రైఫిల్‌ను పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో కలిసి ఈ రైఫిల్‌ను అభివృద్ధి చేశారు. కేవలం 100రోజుల్లోనే దీని రూపకల్పన, తయారీ పూర్తి కావడం విశేషం. ఇది దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చేసిన స్వదేశీ ఆయుధ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. డ్వీపా డిఫెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిబు జోసెఫ్ మాట్లాడుతూ 2021లోసంస్థకు తయారీ లైసెన్స్ లభించిందని, తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 13 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో హైదరాబాద్‌లో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2021లో ప్రారంభమైన తమ ప్రయాణంలో ఇప్పటివరకు 100కు పైగా స్వదేశీ ఆయుధ వ్యవస్థలు, వాటి వేరియంట్లు అభివృద్ధి చేశామని, అందులో ఉగ్రామ్‌తమ ప్రధాన ఉత్పత్తిగా నిలిచిందని సిబు జోసెఫ్ పేర్కొన్నారు. భారత భద్రతా బలగాల కోసం ప్రపంచ స్థాయి రక్షణ ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఉగ్రామ్ రైఫిల్ విశ్వసనీయత, మన్నికకు సంబంధించిన విస్తృత పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసింది. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ కోసం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది.

గ్యాస్ ఆపరేటెడ్ రొటేటింగ్ బోల్ట్ వ్యవస్థతో రూపొందించిన ఈ రైఫిల్ బరువు నాలుగు కిలోల కంటే తక్కువ. దీని ప్రభావవం తమైన కాల్పుల పరిధి 500 మీటర్లు.డ్వీపా డిఫెన్స్ ప్రస్తుతం అసాల్ట్ రైఫిళ్లు, కార్బైన్లు, సబ్ మెషిన్ గన్స్, అల్ట్రా లైట్ మెషిన్ గన్స్, యాంటీ డ్రోన్ వ్యవస్థలతో కూడిన స్వదేశీ ఆయుధాల శ్రేణిని కూడా అభివృద్ధి చేస్తోంది. ఆర్మీ ట్రయల్స్ విజయవంతంగాపూర్తికావడం, కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కావడంతో స్వదేశీ రక్షణ తయారీ కేంద్రంగా హైదరాబాద్ మరింత బలోపేతం అవుతుందని సంస్థ భావిస్తోంది.

# ఢిల్లీలో నవవధువు మృతి కలకలం..

## భర్త అరెస్ట్.. కట్న వేధింపుల కేసు నమోదు

**న్యూఢిల్లీ, జులై 6:** నవవధువు అనుమానాస్పద మృతి కేసు సంచలనంగా మారింది. పెళ్లై కేవలం 72 రోజులకే 28 ఏళ్ల అకృతి సుతార్ మృతి చెందడంతో పోలీసులు కట్న వేధింపుల కేసు నమోదు చేసి ఆమె భర్త అరస్తు సిక్కాను అరెస్ట్ చేశారు. ఈనెల 4న ఢిల్లీలోని లోధీ కాలనీ ప్రాంతంలోని పాలికా కుంజ్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ హత్య కలకలం రేపింది. అపార్ట్‌మెంట్ భవనం పై అంతస్తు నుంచి కిందపడిన స్థితిలో అకృతి తీవ్రగాయాలతో కనిపించింది. వెంటనే ఆమెను ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.అకృతి తల్లి అను సాయ్ సుతార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కుమార్తెను భర్త అరస్తు సిక్కా, అత్తింటి కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపించారు. అకృతి ఈ ఏడాది ఏప్రిల్ 24న తన చిన్ననాటి స్నేహితురాలు అగస్టికా సోదరుడు అరస్తు సిక్కాను ప్రేమపెళ్లి చేసుకుంది. ఛత్తర్‌పూర్‌లోని ఓ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న అకృతి, పెళ్లి తర్వాత కూడా ఉద్యోగం కొనసాగిస్తానని పెళ్లికి ముందే స్పష్టంగా చెప్పిందని ఆమె తల్లి తెలిపారు. ఆ షరతుకు అత్తింటి వారు అంగీకరించిన తర్వాతే వివాహానికి ఒప్పుకున్నామని వెల్లడించారు. పెళ్లి అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆమె ఆరోపించారు. ఉద్యోగం మానేయాలని, త్వరగా గర్భం దాల్చాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చారని, ఇంటి పనులతో ఇబ్బంది పెట్టి ఉద్యోగాన్ని వదిలేయాలనే పరిస్థితి సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లితో ఫోన్‌లో మాట్లాడినా, పుట్టింటికి వెళ్లినా అవమానించేవారని, మానసికంగా, శారీరకంగా వేధించేవారని ఆమె తెలిపారు. జూన్ 17న ఫోన్ సైలెంట్‌లో ఉండటంతో కాల్ అందుకోలేదనే కారణంగా భర్త బెల్ట్‌తో కొట్టాడని అకృతి తనకు చెప్పిందని తల్లి వెల్లడించారు. మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందంటూ భర్త తరచూ అనుమానాలు వ్యక్తం చేసేవాడని ఆరోపించారు. జూన్ 29న తనను చంపే అవకాశం ఉందని అకృతి భయపడుతూ ఫోన్‌లో చెప్పిందని తల్లి పేర్కొన్నారు. అదే రోజు తాను వండిన భోజనం వేడి చేయలేదనే కారణంతో మరోసారి భర్త దాడి చేశాడని ఆరోపించారు.ఆ తర్వాత అకృతి తన స్నేహితురాలు, మరదలు అయిన అగస్టికా ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పిందని, అక్కడికి వచ్చిన అరస్తు మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు సర్దిచెప్పి ఇద్దరినీ ఇంటికి పంపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



# 9న ఆఖరి కార్యాచరణ: పాకిస్థాన్‌కు పిఒకె నేతల తుది హెచ్చరిక



**ముజఫరాబాద్, జులై 6:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకాశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) పాక్ సర్కారుకు అల్టిమేటమ్ ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పిఒకె ప్రజలు, ప్రవాస కాశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పిఒకెలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్రమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాకిస్థాన్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జెఎఎసి అభ్యర్థించింది. నిరసనల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జెఎఎసి డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమ కు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది.

**భారత్ సహాయం కావాలి:** కాగా.. జెఎఎసి నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓవిడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.' మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరతఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్లుగా ఆవిడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్ ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిందని అందులో ఆరోపించారు.


# సంక్షిప్త వార్తలు

## అణ్వస్త్రరహిత ప్రాంతంలో చైనా బాలిస్టిక్ క్షిపణి పరీక్ష



**బీజింగ్, జులై 6:** దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని అణ్వస్త్ర రహిత మండలంలో అణుశక్తి జలాంతర్గామి నుంచి చైనా దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని సోమవారం పరీక్షించింది. ఈ ప్రయోగం పలు ప్రాంతీయ దేశాల్లో ఆందోళనకు దారితీసింది. దీనిపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, ఈ ప్రయోగం సైనిక వార్షిక శిక్షణలో భాగమే నని చైనా తెలిపింది. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహించామని, ఏ దేశాన్ని లేదా లక్ష్యాన్ని ఉద్దేశించి చేయలేదని పేర్కొంది. అందులో నిజమైన అణు వార్‌హెడ్‌కు బదులుగా డమ్మీ వార్‌హెడ్‌ను ఉపయోగించినట్లు వెల్లడించింది. ఇదే తరహా పరీక్షను రెండేళ్ల కిందట కూడా నిర్వహించినట్లు చైనా తెలిపింది.

## కీవ్‌పై రష్యా భారీ డ్రోన్ దాడి



**కీవ్, జులై 6:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా భీకర దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో మాస్కో విరుచుకుపడటంతో అనేక భవనాలు ధ్వంసమయ్యాయని, 12 మంది ప్రాణాలు కోల్పోయారని కీవ్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నాటో శిఖరాగ్ర సదస్సు లో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ కానున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. కీవ్‌లోని సైనిక–పారిశ్రామిక సౌకర్యాలు, ఇంధన, శక్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## తేజ్‌ప్రతాప్ పార్టీనుంచి వీణామాన్వీ బంకిపూర్ నుంచి పోటీ




**పాట్నా,జులై 6:** బీహార్‌లో బంకీపూర్ ఉప ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది. తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్ శక్తి జనతా దళ్ కూడా బరిలో దిగింది. సామాజిక కార్యకర్త వీణా మాన్వీని తమ అభ్యర్థిగా ప్రకటించింది. తేజ్ ప్రతాప్ యాదవ్ తన పార్టీ ఫారమ్‌ను ఆమెకు అధికారికంగా అందజేశారు. అనంతరం వీణా మాన్వీ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచినందుకు పార్టీకి ధన్యవాదాలు తెలియజేశారు. బంకిపూర్ ప్రజల గొంతుకగా నిలుస్తానని, పార్టీ అంచనాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## శ్రీలంక జైలులో రక్తపాతం..మృతుల సంఖ్య 25కు పెరుగుదల

**కొలంబో, జులై 6:** శ్రీలంక పశ్చిమ తీరంలోని నెగొంబో జైలులో జరిగిన ఘర్షణలు తీవ్ర విషాదానికి దారితీశాయి. ఖైదీల మధ్య చెలరేగిన హింసలో మృతుల సంఖ్య 25కు చేరింది. ఈ విషయాన్ని సోమవారం అక్కడి అధికారులు అధికారికంగా వెల్లడించారు. రెండు ప్రత్యర్థి ఖైదీ వర్గాల మధ్య ప్రారంభమైన ఘర్షణలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. సోమవారం కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగింది. కొందరు ఖైదీలు జైల్లోని ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో భద్రతా పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 19 మంది మృతి చెందగా, వంద మందికిపైగా గాయపడ్డారు.

## మోహన్‌లాల్‌ను వెంటాడుతున్న ఏనుగుదంతాల కేసు



**తిరువనంతపురం,జులై 6:** మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగుదంతాల అక్రమనిల్వ కేసు కేరళ హైకోర్టులో కొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది.ఆ పత్రాల ప్రకారం మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతోపాటు దంతాలతో చేసిన మరో 1 కళాఖండాలు ఉన్నాయి. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి.

## దలైలామాకు ప్రధాని మోడీ జన్మదిన శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 6:** ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా 91వ పుట్టిన రోజును పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రపంచ శ్రేయస్సు పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు.

7-7Pg6exHMNWJQE_7-7Pg6exHMNWJQE.qxd 06/Jul/26 10:41 PM Page 1



# ఎమ్మెల్సీ సీటుపై తమ్ముళ్ల గంపెడాశలు!




**● త్వరలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో 2 స్థానాలు భర్తీ ● పార్టీ అధిష్టానానికి దరఖాస్తు ● అగ్రనేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు**

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసన మండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ సీట్లు కోసం టిడిపి నేతలు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో వివిధ పదవులకు పోటీ భంగపడిన నేతలు ఈ పర్యాయం అధిష్టానం తమను కరుణిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. శాసనమండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలోని 2 స్థానాలు ఈ నెల 28తో ఖాళీ అవుతున్నాయి. మండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం, వైసిపి ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుంది. ఇందులో ఒకటి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యకు ఇస్తారని అంటున్నారు. ఇటీవల జరిగిన రాజ్య సభ ఎన్నికల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. దీనితో సీనియర్ అయిన ఆయనకు కనీసం ఎమ్మెల్సీ పదవి అయినా ఇవ్వడం ధర్మం అని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిసింది. 2027 జూన్ నెలలో మరో 23 స్థానాలు ఖాళీ అవుతాయి. అప్పుడు రామయ్యకు శాసన మండలి చైర్మన్ పదవి ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. లేదా మంత్రి వర్గంలోకి తీసుకునే అవకాశం ఉందంటున్నారు. 4 రాజ్యసభ స్థానాల్లో రెండు కమ్మ, బలిజ, బిసి వర్గాలకు ఒక్కోటి ఇచ్చారు. రెడ్డి, ఎస్సీలకు ఒక అవకాశం ఇవ్వలేదు. అలాగే రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించలేదు. ఈ నేపథ్యంలో ఎస్సీ నుంచి రామయ్యకు, రాయలసీమ నుంచి ఒక రెడ్డికి అవకాశం కల్పించవచ్చు అనుకుంటున్నారు. తిరుపతికి చెందిన టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారని తెలిసింది. సైకాలజిస్ట్‌గా పేరున్న ఆయన 2020 నుంచి గత ఏప్రిల్ వరకు అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, కె.నారాయణస్వామి తదితరులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ కూడా అయిన తనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కడప నుంచి మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి కూడా రేసులో ఉన్నారు. ఆయన రాజ్యసభ సీటు ఆశించి విఫలం అయ్యారు. ఆయన భార్య మాధవీ రెడ్డి కడప ఎమ్మెల్యేగా ఉన్నారు. పార్టీలో సీనియర్ నేతలు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వారికి, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో చాలా మంది నాయకులు పోటీ పడుతున్నారు. దేవినేని ఉమామహేశ్వర రావు, టిడి జనార్దన్, పీతల సుజాత, జవహర్, కెఇ ప్రభాకర్. పిఠాపురం నుంచి ఎస్‌విఎస్ఎన్ వర్మ, పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు, వంగవీటి రాధా, బుద్దా వెంకన్న, కొమ్మాలపాటి శ్రీధర్ దువ్వారపు రామారావు, మోపిదేవి వెంకటరమణ రేసులో ఉన్నారు.

## ఎపి సిఆర్‌డిఎ అధికారిక వెబ్‌సైట్‌లో యూనిట్ ఆఫీసుల వద్ద వార్షిక కౌలు వివరాలు

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణానికై భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సౌకర్యార్థం, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎపి సిఆర్‌డిఎ) కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులకు అందించే వార్షిక కౌలు చెల్లింపుల స్థితిగతులను పారదర్శకంగా తెలియజేసే ఉద్దేశంతో పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అలాగే రాజధాని గ్రామాలలోని కాంపిటెంట్ అథారిటీ కార్యాలయాలవద్ద కౌలు చెల్లింపు వివరాలను ప్రదర్శించారు. రైతుల సౌకర్యార్థం ప్రతి యూనిట్ ఆఫీస్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి రైతులకు వార్షిక కౌలు చెల్లింపుపై తలెత్తిన సందేహాలను సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది వివరించడం జరుగుతోంది. అదే విధంగా సోమవారం రాయపూడిలోని ప్రధాన కార్యాలయంలో రైతుల ఎన్‌పిసిఐ, బ్యాంక్ లింకేజి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకుగాను హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా సీఆర్డీఏ సిబ్బంది పలువురు రైతులకు లింకేజి ప్రక్రియ పూర్తి చేశారు. వెబ్‌సైట్‌లో పొందుపర్చబడిన సమాచారంలో వార్షిక కౌలు జమ అయిన రైతుల వివరాలతో పాటు, ఇంకా కౌలు జమ కాని రైతుల వివరాలు, చెల్లింపులు నిలిచిపోవడానికి గల కారణాలను సైతం వెల్లడించారు. ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలను కలిగిన రైతుల జాబితాను సైతం అందుబాటులో ఉంచారు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతున్న నేపథ్యంలో, విశిది। లింకేజీ సక్రమంగా లేకపోవడం లేదా బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా ఉండటం వంటి కారణాల వల్ల కొందరి ఖాతాలకు చెల్లింపులు జమ కావడం లేదు. అలాంటి రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని ఎపి సిఆర్‌డిఎ సూచించింది.

**క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా వివరాలు:** రైతులు తమ వార్షిక కౌలు చెల్లింపు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు సిఆర్‌డిఎ నుంచి క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌పేజీలో రాజధాని రైతులు తమ వివరాలను చెక్ చేసుకోవచ్చు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే కౌలు లబ్ధి సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించింది. కౌలు లబ్ధి పొందని రైతులు తమ పేర్లు, ఖాతా వివరాలు, ఏ కారణం చేత కౌలు జమ కాలేదోనన్న అంశాలను సైతం చెక్ చేసుకోవచ్చు. ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలలో కౌలు నగదు జమ చేయుట సాధ్యపడదు కనుక ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలు కలిగిన రైతులు వెంటనే ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని కోరింది.

## విద్యుత్ బస్సులు ఆర్‌టిసినే కొనుగోలు చేపట్టాలి

**● ఆర్‌టిసి ఉద్యోగుల ఐకాస డిమాండ్**



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ బస్సులు కొనుగోలు ఆర్టిసి ద్వారానే చేపట్టాలన్న ప్రధాన డిమాండ్‌తో ఆ సంస్థ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి (జెఎసి) డిమాండ్ చేసింది. ఆర్టిసి సిబ్బందితోనే ఈబస్సుల నిర్వహణ చేయాలని కోరింది. ప్రైవేట్ ఆపరేటర్లతో బస్సులు నడుపుతామంటే అంగీకరించబోమని ఉద్యోగ సంఘాలు తేల్చిచెప్పాయి. ఉద్యోగుల సమస్యలపై ఆర్టిసి జెఎసి నేతలతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఇడిలు బ్రహ్మానందరెడ్డి, వర్మతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఉద్యోగసంఘాల నేతలతో ఇడి ఆపరేషన్స్ నాగేశ్వరరావు పలు కీలక అంశాల గురించి చర్చలు జరిపారు. అనంతరం స్పెషల్ సిఎస్, ఎడిలకు ఇడిలు వివరాలను తెలిపారు. మరోవైపు 'స్త్రీ శక్తి' పథకానికి అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేసింది. స్త్రీ శక్తి పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగిందని, ఆర్టిసికి రావాల్సిన బకాయిలు వసూలు చేసి బస్సులు కొనాలని సూచించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయటం సహా 30 డిమాండ్లను ఆర్టిసి ఐకాస అధికారుల ముందుంచారు. ప్రతిపాదించిన కార్యాచరణ ప్రకారం నిరసన కార్యక్రమాలు ఉంటాయని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. తమ అజెండాపై ఇంకా స్పష్టత రాలేదని ఉద్యోగ సంఘాల కన్వీనర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఆర్టిసి ద్వారానే విద్యుత్ బస్సులు కొనాలని చెప్పగా దానిపై వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఆపరేటర్లతో విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్టిసిని ప్రైవేటీకరణ చేయడమే అవుతుందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశం మొక్కుబడిగా జరిగిందని ఉద్యోగ సంఘాల కన్వీనర్ దామోదరరావు వివరించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇడిలు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులతో విద్యుత్ బస్సుల కొనుగోలు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. మూసివేసిన డిపోలు పునరుద్ధరించాలి. పరిష్కరించాల్సిన సమస్యలపై 10 రోజుల్లో సమావేశం పెడతామన్నారు. మా పోరాటం వ్యక్తిగతం కాదు, ఆర్టిసిని రక్షించుకోవడమే అని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

## త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడే విద్యుత్ తీగలు, లోఓల్టేజ్ తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది జిల్లాల నుండి 52 మంది తమ సమస్యలు తెలిపారు. డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, ఆర్.వర్మ, వి.ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్‌కుమార్, ఎమ్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, ఈఈ, పిఆర్‌ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.




## చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని అరెస్టు చేయాలి

**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రోత పనులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి ర్యాలీగా వచ్చారు. ప్రజాస్వామ్యంగా ఫిర్యాదు చేయడానికి వస్తున్న వారిని పోలీసులు అడ్డుకుని ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ముందుకు వెళ్లనీయలేదు. పోలీసుల అడ్డంకులను దాటుకుని ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్న తర్వాత కూడా ప్రధాన గేట్లు మూసివేసి లోపలికి వెళ్లకుండా నిలువరించారు. దీంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రధాన ద్వారం ఎదుటే రోడ్డుపై బైఠాయించడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఫిర్యాదు చేసే హక్కును కూడా కాలరాస్తున్నారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఆయనతో పాటు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు గేటు ఎదుటే నిరసనకు దిగగా, పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బైఠాయింపును విరమింపజేసేందుకు పోలీసులు బలవంతంగా ప్రయత్నించగా పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు యత్నించడంతో చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, శివశంకర్‌రాజుతో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను అడ్డుకునేందుకు పార్టీ కార్యకర్తలు పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు ఎస్పీని కలవనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు.

## ఏపి సచివాలయంలో ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరం

**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రారంభించారు. ఏపి సచివాలయం మూడవ భవనం అప్సా (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించి ఉద్యోగుల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సూచించారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్‌లైన్ సబ్మిషన్, కొత్త ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫొటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు (ఎపిక్ కార్డు) ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో వచ్చి వారి ఓటరు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అనంతరం ఈ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు వివరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సిఇఒ వివేక్ యాదవ్ ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జాయింట్ సిఇఒ ఇ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలి కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో 'లెనిన్' చిత్రబృందం



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సినీనటుడు అక్కినేని నాగార్జున, అక్కినేని అఖిల్, అమల కుటుంబంతో సహా "లెనిన్" చిత్రం బృందం సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈనెల 10వ తేదీ విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి ఆదివారం తిరుపతిలో ప్రి రిలీజ్ వేడుకలు జరిగాయి. అనంతరం సోమవారం తిరుమలకు చేరుకున్న చిత్ర బృందం నాగార్జున, అఖిల్‌తోబాటు సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, నటి భాగ్యశ్రీ, కమెడియన్ సునీల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి వెళ్ళారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయం చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన నటుడు నాగార్జున, అఖిల్‌ను చూసి అభిమానులు కరచాలనం, సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో సినీనటుడు మాధవన్, తెలంగాణ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధ్యప్రదేశ్ మంత్రి గోవింద్ సింగ్ రాజ్‌పుత్, ఉత్తరప్రదేశ్ ఎంపి గణేష్ సింగ్ కుటుంబసభ్యులతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశ విదేశాల నుండి 'శ్రీవారి వైద్యసేవ'కు ముందుకొస్తున్న వైద్యులు



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సేవ ప్రతి భక్తుడి జీవితంలో లభించే మహాభాగ్యమని, అదే స్ఫూర్తితో టిటిడి ప్రారంభించిన "శ్రీవారి వైద్యసేవ" కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా, విదేశాల్లోని నిపుణ వైద్యుల నుంచి విశేష స్పందన లభిస్తోందని టిటిడి జెఇఒ ఎ.శరత్ తెలిపారు. భక్తుల సేవలో విజయవంతంగా కొనసాగుతున్న శ్రీవారి సేవ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు వైద్య, పశువైద్య, ఇతర వృత్తి నిపుణులను స్వచ్ఛంద సేవలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో శ్రీవారి వైద్యసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మార్గదర్శకత్వంలో స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద కళాశాల, గోశాల, వైద్య విభాగం తదితర సంస్థల అధిపతులతో పలు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించిన అనంతరం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మూడు నెలల ట్రయల్ రన్‌గా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఎస్వీ గోసంరక్షణ శాలలో జరుగుతున్న వైద్యసేవలను ఆయన నిపుణ వైద్యులతో కలిసి పరిశీలించారు. జూన్ 20 నుండి స్లాట్ బుకింగ్ ప్రారంభం కాగా ఇప్పటికే 488 మంది స్పెషలిస్టు వైద్యులు, వివిధ విభాగాల నిపుణులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు మూడు రోజుల సేవా అవకాశం, ఇతర వైద్యులకు ఏడు రోజుల సేవా వ్యవధిని కల్పించామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు నెల రోజులు, ఆరు నెలలు లేదా ఏడాది పాటు కూడా సేవలందించే అవకాశాన్ని కల్పించామని తెలిపారు. ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా ఆయా విభాగాధిపతుల ద్వారా సేవా స్లాట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

**గోసేవకు అపూర్వ స్పందన:** శ్రీవారి వైద్యసేవలో భాగంగా ప్రారంభించిన గోసేవ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని జెఇఒ శరత్ తెలిపారు. ఇప్పటివరకు మూడు బ్యాచ్‌ల సేవా స్లాట్లు పూర్తిగా భర్తీ కావడం ఈ కార్యక్రమానికి లభిస్తున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. వారం రోజుల పాటు సేవలందించిన డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ జి.పద్మ నాభన్ తదితరులు ఈ సేవ తమ జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, ఈ అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చెప్పినట్లు తెలిపారు.

గోశాలను రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పి.వి. లక్ష్మయ్య సందర్శించి గోవులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. గోసేవలో పాల్గొంటున్న నిపుణ వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులకు టిటిడి కల్పిస్తున్న వసతి, భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీయగా, వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్

## ఎస్వీ గోసంరక్షణశాలకు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ-టెండర్ల ఆహ్వానం

తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్.వి. గోసంరక్షణశాల డెయిరీ ఫామ్ అవసరాల కోసం రెండు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ టెండర్లను టిటిడి ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల సంస్థలు, సరఫరాదారులు హెచ్‌టిటిపిఎస్://టెండర్. ఎపిఇప్రొక్యూర్‌మెంట్. జివొవి. ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కరెంట్ టెండర్స్ విభాగంలో ఎస్వీ గోసంరక్షణ శాల డైరీ ఫామ్‌ను సర్కిల్/ డివిజన్‌గా ఎంపిక చేసి టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. టెండర్ పత్రాల డౌన్‌లోడ్ ప్రక్రియ సోమవారం సాయంత్రం 5గంటల నుండి ప్రారంభమైంది. టెండర్ పత్రాలను జులై 21 సాయంత్రం 5.05 గంటల లోపు సమర్పించాలి. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం 92814 13626 నంబర్‌లో సంప్రదించాలని టిటిడి కోరింది.

## తిరుమలలో గోగుల కుటుంబ సభ్యులపై పిడి యాక్ట్ ఇద్దరిని కడప సెంట్రల్ జైలుకు తరలింపు

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, భక్తులను, స్థానిక వ్యాపారులను, విధుల్లో ఉన్న పోలీసు భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న గోగుల కుటుంబానికి చెందిన నేరస్థులపై తిరుపతి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సాధారణ చట్టాల ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు ప్రివెంటివ్ డిటెన్షన్(పిడి) యాక్ట్ అమలు చేశారు. గోగుల కోటయ్య(22), గోగుల శ్రీనివాసులు(20)లను అరెస్ట్ చేసి, శ్రీకాళహస్తి సబ్ జైలు నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గోగుల శ్రీకాంత్ (25) ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అతనిపై కూడా పిడి యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. గోగుల నాగేష్ (44)తో కలిసి గత కొంతకాలంగా తిరుమలలో వివిధ నేరకార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. తిరుమలలో అక్రమ హాకింగ్ నిర్వహించడం, భక్తులకు నామాలు పెట్టే పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడడం, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయించడం, తోటి వ్యాపారులను బెదిరించడం, ఎదిరించిన వారిపై దాడులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పోలీసులు భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసిన సమయంలో బ్లేడ్లతో తమను తాము గాయపరుచుకోవడం, గోడలకు తలలు బాదుకుని స్వీయ గాయాలు చేసుకోవడం ద్వారా పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేసే విధానాన్ని అనుసరిస్తూ విధుల్లో ఉన్న సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం వీరి నేరశైలిగా గుర్తించారు.

గత రెండేళ్లలో తిరుమల వన్ టౌన్, టూ టౌన్, రేణిగుంట, యెర్పేడు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దొంగతనం, దౌర్జన్యం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై విడుదలైన ప్రతిసారి తిరిగి నేరాలకు పాల్పడుతూ, పోలీసు అధికారులను ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో వీరిపై పిడి యాక్ట్ అమలు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

## ఎర్రచందనం ముద్దాయి నాసర్ బాయ్‌పై పిడియాక్ట్



**తిరుపతి, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేసిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళకు చెందిన నాసర్ బాయ్(53)పై టాస్క్‌ఫోర్స్ అధికారులు పిడి యాక్ట్ అమలు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె.కులశేఖర్ ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్‌లు అమలు చేస్తున్నారు. తాజాగా కేరళకు చెందిన నాసర్ కెఎన్ అనే నాసర్ బాయ్ తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాలయంలో ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇతనిపై పిడి యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిపై ఆరు ఎర్రచందనం కేసులు ఉన్నాయి. ఇతనిపై పిడి యాక్ట్ అమలులో భాగంగా నిందితుడ్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.



## తిరుమలలో శ్రీవారి భక్తజనం

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలలో మోస్తరుగా భక్తులు ఉన్నారు. వారాంతం సెలవులు ముగియడంతో సోమవారం ఉదయానికి వైకుంఠమ్-2లో 27 కంపార్టుమెంట్లలో భక్తులు నిరీక్షిస్తుండగా సాయంత్రానికి 23 కంపార్టుమెంట్లలో ఉన్నారు. సర్వదర్శనం కోసం 16గంటలు సమయం పడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.31 లక్షలు విరాళం

**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలకు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం టిటిడికి చెందిన వివిధ పథకాలకు రూ.31 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లయన్ సాయివెంకట్ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు స్వర్ణ విహార్ ఇన్ ఫ్రా ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున రూ.10 లక్షలు, జయహో రామానుజ సినిమా ఆగస్టు 15న విడుదల సందర్భంగా మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. అలాగే గుంటూరుకు చెందిన జి.లావణ్య వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.11,11,111 లక్షలు విరాళంగా అందించారు. ఈవిరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## దలైలామా శతాధిక కాలం జీవించాలి

**జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సిఎం చంద్రబాబు**



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** బౌద్ధమత గురువు దలైలామాకు ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఎక్స్" వేదికగా ఆయన ట్వీట్ చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి, కరుణ, మానవత్వాన్ని పెంపొందించే తన పవిత్రమైన ఆశయ సాధనలో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు చేకూరాలని, శతాధిక కాలం జీవించాలని ప్రార్థిస్తున్నా. అని సిఎం అన్నారు.

7-7Pg7exHMNWJQE_7-7Pg7exHMNWJQE.qxd 06/Jul/26 10:46 PM Page 1



# ఉదయగిరి అభివృద్ధికి పరిశ్రమలే పునాది

● కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి ● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



**ఉదయగిరి, (నెల్లూరు) జులై 6 ప్రభాతవార్త:** ఉదయగిరి ప్రాంత సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గత రెండేళ్లలో ఉదయగిరి సంక్షేమం కోసం రూ.1,098.79 కోట్లు కేటాయించామని, ఇప్పటికే నాలుగు పరిశ్రమలకు ఆమోదం లభించగా వాటి ద్వారా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సోమవారం ఉదయగిరికి చేరుకున్న మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, యువనేత నారా లోకేష్ కృషితో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం ఆంధ్రప్రదేశ్‌కు రప్పించగలిగామని పేర్కొన్నారు. ఉదయగిరి ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని, పరిశ్రమలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్ర పరిస్థితులు క్రమంగా మెరుగు పడుతున్నాయని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రికొనియాడారు. తాను కూడా నారాయణ నేత్ర జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ రాకతో ఉదయగిరి అభివృద్ధికి మరింత వేగం వస్తుందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఉదయగిరి రూపు రేఖలు మారిపోతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరిలో అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, యువ నేత లోకేష్ కృషితో పరిశ్రమలు ప్రారంభం కానున్నాయని, ఉదయగిరి– సీతారాంపురం మండలాలకు తాగు, సాగునీటి శాశ్వత పరిష్కారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నందవరం– ఉదయగిరి రోడ్డుకు నిధుల కేటాయింపు, బనగానపల్లి రోడ్డుకు అటవీశాఖ అనుమతుల సమస్య పరిష్కారం, ఉదయగిరిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతమ్మ, టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, చిరంజీవిరెడ్డి, బాబు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు అభివృద్ధే నా ధ్యేయం

● రూ.2 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం ● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు (నెల్లూరు), జులై 6 ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహిస్తూ జేజేలు చేస్తూ పూలవర్షం, హారతులతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. ప్రజల ఆశీర్వాదమే తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈసందర్భంగా సుమారు 2కోట్ల వ్యయంతో పూర్తయిన నూతన జడ్పీ హైస్కూల్ భవనం, సిసిరోడ్లు, పశువుల షెడ్లు ప్రారంభించడంతోపాటు శ్రీకోందడరామ స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆత్మకూరు మండలంలోని ఈగ్రామానికి రాలేకపోయినా తనను రెండోసారి ఎమ్మెల్యేగా రాష్ట్ర మంత్రిగా ఆశీర్వదించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు శాశ్వత ప్రయోజనం:** రైతాంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సోమశిల ఉత్తరకాలువ పొడిగింపు, 42 ఆర్ కాలువ పనులు ఎన్నో అడ్డంకులు ఎదురైనా పూర్తిచేసే దిశగా ముందుకు తీసుకెళ్ళామన్నారు. గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. మిగిలిన పంటకాలువల పనులను కూడా దశల వారీగా పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

**పరిశ్రమలు, యువతకు ఉపాధే లక్ష్యం:** ఆత్మకూరును వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగంలోను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం తెలిపారు. రూ.67 కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కును పూర్తిచేశామని, పరిశ్రమలకు అవసరమైన నీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 23 పరిశ్రమలు స్థలాలు కేటాయించుకున్నాయని, మరిన్ని భారీ పరిశ్రమలు వచ్చేదశలో ఉన్నాయన్నారు. భూముల ఆక్రమణలను తొలగించి కొత్త పరిశ్రమలకు భూములు అందజేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

**స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం:** యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు ఆత్మకూరులో ప్రభుత్వ– ప్రవేటు భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు. గతంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలతోపాటు ఈ కేంద్రం ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామీణాభివృద్ధి, సాగునీరు, విద్య, ఆలయాల పునరుద్ధరణ, పరిశ్రమల ఏర్పాటు వంటి అనినన రంగాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం ఎన్‌డిఎ కూటమి రెండేళ్ళపాలన విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి ఆనం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును లబ్ధిదారులకు మంత్రి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తుల ఆభరణాలు నిజాయితీగా అప్పగింత



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తులు పోగోట్టుకున్న విలువైన బంగారు ఆభరణాలను టిటిడి సిబ్బంది నిజాయితీతో తిరిగి అప్పగించిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. తిరుమలలో భక్తులు పోగొట్టుకున్న విలువైన బ్యాగ్‌ను గుర్తించి సిసిటివి పర్యవేక్షణతో వేగంగా స్పందించారు. టిటిడి కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి అందులోని నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను యథాతథంగా భక్తులకు భద్రంగా అప్పగించారు. తెలంగాణకు చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులు మేదరమిట్ట నుండి గోగర్భ డ్యాం సమీపంలోని మఠాలకు మహేంద్ర టాక్సీ జీప్‌లో ప్రయాణిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌ను వాహనంలోనే మరిచిపోయారు. విషయం గుర్తించిన వెంటనే టిటిడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు సిసిటివి ప్లేబ్యాక్ ఫుటేజీలను పరిశీలించి ప్రయాణించిన జీప్‌ను గుర్తించారు. అప్పటికే తిరుపతికి చేరుకున్న డ్రైవర్‌ను సంప్రదించి బ్యాగ్‌ను భద్రంగా స్వాధీనం చేసుకుని, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భక్తుల సమక్షంలో బ్యాగ్‌ను తెరిచి అందులోని విలువైన వస్తువులను ధృవీకరించి యథాతథంగా అప్పగించారు. టిటిడి భద్రతా విధానంపై భక్తుల ప్రశంసించారు.

## హాకర్లపై దాడులు... 30 మంది బైండోవర్



**తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో అనదికారికంగా భక్తులకు తిరునామం దరింపజేసి అందినకాడికి వసూలుచేస్తున్న అనదికార హాకర్లపై పోలీసులు దాడులు చేశారు. అనుమతులు, లైసెన్సు లేకుండా భక్తులకు నామాలు పెడుతూ, వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న 30 మందిని గుర్తించారు. వారిని తిరుమల నుంచి తిరుపతికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేసినట్లు తిరుమల పోలీసలు తెలిపారు. తిరుమలలో అనుమతులు లేకుండా నామాలు పెట్టడం, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అత్యవసర సేవల కోసం 112కు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

● ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ స్కాన్ పంపి డబ్బులు చెల్లించాలని ఫోన్లు చేస్తారు

● చిత్తూరు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక



**చిత్తూరు, జులై 6 ప్రభాతవార్త:** దోచుకోవడానికి కాదేది అనర్హం కావడంతో సైబర్ నేరగాళ్ళ దృష్టి ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించే వారిపై పడింది. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ మేరకు ఆస్తి, ట్రేడ్ లైసెన్స్ పన్నులను మీరు చెల్లించాల్సి వుందని, తాము ఫోన్ ద్వారా ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపుతున్నామని, తాము పంపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలని ఇందుకు సంబంధించి రసీదును డబ్బులు చెల్లించిన వెంటనే ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురికి సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఫోన్ చేసి పన్నులు చెల్లించాల్సిందిగా కోరడం ఏమిటని ఒకరిద్దరు ఈ విషయంను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో కమీషనర్ అప్రమత్తం అయ్యారు. సైబర్ నేరగాళ్ళు మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల పేరిట చిత్తూరు నగర ప్రజల నుండి దోపిడి చేయడానికి పక్కా ప్రణాళికతో ఈ విధంగా పన్ను చెల్లింపుదారులకు ఫోన్లు చేస్తున్నారని కమీషనర్ గుర్తించారు. పన్నులు చెల్లించాలని ఫోన్ చేసే సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా వుండాలని మున్సిపల్ కమీషనర్ ప్రజలను హెచ్చరించారు. ఇంటి, ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సుల పన్నులు చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తుల నుండి పలువురికి ఫోన్‌కాల్స్ వస్తున్నాయనే విషయం తమ దృష్టికి వచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నుల మొత్తంను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తాము పంపే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలని సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. పన్నులు చెల్లించమని కమీషనర్ గాని, ఇతర అధికారులు కాని ఎవరికి నేరుగా ఫోన్ చేయరని, అలాగే ఫోన్‌పే, గూగుల్‌పే స్కానర్‌కు డబ్బులు పంపమనే చెప్పే అవకాశం లేదన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంతమంది ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సైబర్ నేరగాళ్ళు 919440 219722 నెంబర్ నుండి ఫోన్ చేసి తాము మున్సిపల్ కార్యాలయం నుండి మాట్లాడుతున్నామని, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పన్నులు చెల్లించాలని అడుతున్నారన్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై ప్రజలు స్పందించవద్దని, డబ్బులు చెల్లించవద్దని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ ఫోన్ కాల్స్‌పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, పన్ను చెల్లింపుదారులకు ఎద్దైనా సందేహాలు వుంటే నేరుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్వహణ ప్రైవేటుకు!

● అర్హత కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నాం ● రూ.306.29 కోట్లతో అత్యాధునిక మౌలిక సదుపాయాలు ● హార్బర్ ద్వారా 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్ష ప్రయోజనం ● వేలాది మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ● మంత్రి బిసి జనార్దన్ రెడ్డి



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి మెరుగుదలతో పాటు, వారి ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నెల్లూరు జిల్లాలో నిర్మితమవుతున్న జువ్వలదిన్నె మత్స్యకార హార్బర్ ఇందుకు ప్రత్యేక నిదర్శనమని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. షిషింగ్ హార్బర్‌కు సంబంధించి కీలకమైన నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు అర్హత కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, పరిశుభ్రత, భద్రత, మానవ వనరుల వినియోగం, మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత మెరుగుపరచడం కోసం ఆపరేషన్స్ మెయింటెనెన్స్ కింద ప్రతిపాదనలు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రధానంగా కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు వంటి వాటి నిర్వహణ ప్రస్తుతం ప్రభుత్వాల తలకు మించిన భారంగా మారుతున్న క్రమంలో, ఈ అంశంపై దేశంలో ఇతర రాష్ట్రాల్లో కూడా జరుగుతున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రవేట్ ఆపరేటర్లు అత్యంత సమర్థవంతంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లను నిర్వహిస్తున్న ఉదంతాలు మనకు కనిపిస్తున్నాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం మత్స్యకారులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ అందించేందుకు ఆపరేషన్స్ మెయింటెనెన్స్ కింద ప్రవేట్ సంస్థల నుంచి టెండర్లు పిలవాలని నిర్ణయించడమైందని తెలిపారు. ఇందులో భాగంగా అత్యధిక వార్షిక లైసెన్స్ ఫీజు కోట్ చేసిన సంస్థను ఆపరేషన్స్ మెయింటెనెన్స్ కోసం ఎంపిక చేయడం జరుగుతుందని, అదే సమయంలో హార్బర్ భూమిపై ఎంపికైన సంస్థకు ఎటువంటి యాజమాన్య బదిలీ లేదా లీజు హక్కులు కల్పించబడవని మంత్రి స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆపరేటర్ ద్వారా హార్బర్‌లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, భద్రత అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించబడుతుందని మంత్రి తెలిపారు. బోట్ల నిలుపుదల నుంచి ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ వరకు అన్ని సదుపాయాలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా నిర్వహణ చేపట్టబడుతుందన్నారు. పారదర్శకమైన వేలం విధానం అమలు చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రభావం తగ్గి, మత్స్యకారులకు వారి చేపలకు పోటీ ధరలు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు.. ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ సమర్థవంతంగా నిర్వహించడం వల్ల చేపల వేట అనంతర నష్టాలు గణనీయంగా తగ్గి, చేపల నాణ్యత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా విశ్రాంతి గదులు, నెట్ మెండింగ్ షెడ్లు, ఇతర సౌకర్యాలన్నీ నిరంతరం నిర్వహించబడటం వల్ల మత్స్యకారులు మరింత సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన వాతావరణంలో తమ వృత్తిని కొనసాగించగలుగుతారని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం జువ్వలదిన్నె షిఫింగ్ హార్బర్‌ను ఆధునిక షిఫింగ్ సెంటర్‌గా అభివృద్ధి చేసి, మత్స్యకారుల ఆదాయం, జీవన ప్రమాణాలు, ఎగుమతి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ముఖ్యంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఇప్పటివరకు రూ. 306.29 కోట్ల వ్యయంతో 95.51శాతం భౌతిక పురోగతి సాధించిందన్నారు. హార్బర్‌లో మొత్తం 1,250 మత్స్యకార బోట్లకు నిలుపుదల సౌకర్యం కల్పించగా, ఇందులో 1,000 మోటరైజ్డ్ బోట్లు, 200 మెకనైజ్డ్ బోట్లు, 50 ట్యూనా లాంగ్‌లైనర్ బోట్లకు వసతి కల్పించే విధంగా రూపకల్పన చేశామన్నారు.

**6100 మంది మత్స్యకారులకు ప్రయోజనం:** ఈ హార్బర్ ద్వారా సుమారు 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుండగా, చేపల వ్యాపారులు, ఐస్ పరిశ్రమ కార్మికులు, రవాణా రంగం, అనుబంధ సేవల ద్వారా వేలాది మందికి పరోక్ష ఉపాధి లభించనున్నట్లు మంత్రి తెలిపారు. హార్బర్‌లో 835 మీటర్ల ఉత్తర బ్రేక్‌వాటర్, 620 మీటర్ల దక్షిణ బ్రేక్‌వాటర్, 10.50 లక్షల క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్, 909 మీటర్ల క్వేలు పూర్తయ్యాయి. అలాగే ఆధునిక ఆక్షన్ హాల్స్, ట్యూనా ప్యాకింగ్ హాల్, చేపల ఎండబెట్టే యార్డ్, 500 రీలి సామర్థ్యంతో ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఐస్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజ్ వంటి సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 9 గేర్ షెడ్లు, 4 నెట్ మెండింగ్ షెడ్లు, 3 విశ్రాంతి గదులు, కమ్యూనిటీ హాల్, రెస్టారెంట్‌డార్మిటరీ, గెస్ట్ హౌస్ నిర్మించారు. అదనంగా 53,695 చ.మీ. అంతర్గత రహదారులు, 33,938.73 చ.మీ. పార్కింగ్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, రేడియో కమ్యూనికేషన్ టవర్, కోస్టల్ పోలీస్ స్టేషన్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది.

# సూపరింటెండెంట్ నుంచి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా జెకె కృష్ణశ్రీకి పదోన్నతి

● నూతన బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆర్‌జెడి పి. తిమ్మప్ప ఆకాంక్ష



**విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జేకే కృష్ణ శ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో)గా పదోన్నతి పొందిన సందర్భంగా జోన్2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) పి. తిమ్మప్ప ఆమెను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సమాచార పౌరసంబంధాల సంచాలకుల కార్యాలయంలో కృష్ణశ్రీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జేడీ పి. తిమ్మప్ప మాట్లాడుతూ.. సూపరింటెండెంట్‌గా ఆమె ఇప్పటివరకు అందించిన సేవలను ప్రశంసించిన ఆర్జేడీ పి. తిమ్మప్ప, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా నూతన బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, సమర్థతతో పనిచేసి శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తన ఉద్యోగ బాధ్యతల్లో సూపరిండెంట్ గా కృష్ణశ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందడం సంతోషకరం. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆర్జేడీ పి. తిమ్మప్ప అన్నారు. అభినందించిన వారిలో సీనియర్ అసిస్టెంట్లు డీవి సుబ్రహ్మణ్యం, ఉమర్ ఫరూక్, జూనియర్ అసిస్టెంట్లు వి. సునీత, రికార్డు అసిస్టెంట్ కృష్ణారావు, ఆఫీసు సబార్డినేట్లు చిన వెంకటేశ్వర రావు, భానుమతి, తదితర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నారి పెళ్లి కూతురు

- టెన్త్ విద్యార్థినికి వివాహం
- మెడలో తాళి, కాళ్లలో మెట్టెలతో స్కూల్ కు హాజరు
- వారం కిందట పెళ్లి
- ఆలస్యంగా వెలుగులోకి
- అయినా స్పందించని జిల్లా విద్యా, ఐసిడిఎస్ అధికారులు

**అనంతపురం (క్రైమ్), జులై 6 ప్రభాతవార్త:** పట్టుమని పదిహేనేళ్ల లేవు. చదువుకునేందుకు పదో తరగతిలోకి అడుగుపెట్టిందో.. లేదో.. అప్పుడే పెళ్లి పీటలెక్కింది ఓ పదో తరగతి విద్యార్థిని. మెడలో తాళిబొట్టు, కాళ్ళల్లో మెట్టెలతో తరగతులకు హాజరు కావడం సంచలనంగా మారింది. ఈ ఘటన అనంతపురం జిల్లా కర్ణాటక సరిహద్దుల్లోని ఓ రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థిని కావడం గమనార్హం. వారం రోజుల కిందట పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. పెళ్ళయ్యాక బాలిక చదువుపై మక్కువతో మళ్ళీ తరగతులకు హాజరవుతుండడంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. అయితే ఈ విషయం ఇంతవరకు జిల్లా విద్యాశాఖ ఇంచార్జ్ అధికారి, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీసు అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

## దుర్గమ్మ హుండీల ద్వారా రూ.3.39కోట్ల ఆదాయం



**ఇంద్రకీలాద్రి, జులై 6 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో సోమవారం జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రు.3కోట్ల 39లక్షల 53వేల 599ల నగదు, 576 యుఎస్ఎ డాలర్స్, 100 ఆస్ట్రేలియన్ డాలర్స్, 22 మలేషియన్ రింగేట్స్, యుఎఇ దిర్హమ్స్ 295, సింగపూర్ డాలర్లు 13, యూరోలు 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, సౌదీ రియాల్స్ 20, కెనడా డాలర్లు 75, నైజీరియా నైరాలు 1500, సౌతాఫ్రికా ర్యాండ్స్ 70, ఒమన్ రియాల్స్ 50, కంబోడియన్ రియాల్స్ 800, కతార్ రియాల్స్ 7, దారుసలేం డాలర్స్ 2, టాంజానియా షిల్లాంగ్స్ 30,000, కెన్యా షిల్లాంగ్స్ 200, కొరియన్ వన్ 850, భూటాన్ న్యూల్‌ట్రుం 1, హాంకాంగ్ డాలర్స్ 160, బంగ్లాదేశ్ టాకాలు 20, కువైట్ దినార్లు 0.5, కొలంబియన్ మిల్ పెసోస్ 2, టర్కి లిరాలు 10 ఫిలిప్పైన్స్ పిసోలు 100, థాయ్‌లాండ్ బాత్‌లు 80, చైనా యువాన్లు 51, పాకిస్తాన్ రుపిలు 500, యుగోస్లోవియా దినార్లు 500 లతో పాటు పాత ఇండియన్ కరెన్సీ నగదు 2వేల నోట్లు 5, వెయ్యి నోట్లు 9, 500 నోట్లు 74 లభించాయని ఇఓ శీనా నాయక్ తెలిపారు.

**దుర్గమ్మ భక్తుల విరాళాలు:** నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన అదృష్టార్ రత్నాలయం జ్యులరీస్ యాజమాని గుడివాడ రమణలాల్ రు.1,00,016ల విరాళం అందించారు. అదేదాత రు.1,00,016లను ఉచిత ప్రసాద పంపిణీ పథకానికి రుచర్మ పేరిట అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# మామిడి రైతును ఆదుకోవడానికి పటిష్ట చర్యలు

● ఉనికి కోసం వైకాపా విమర్శలు ● ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు ధ్వజం



**చిత్తూరు, జులై 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మామిడి రైతును ఆదుకోవడానికి పటిష్ట చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా మామిడి రైతుకు కేజీకి రూ.4 సబ్సిడీ ప్రకటించి దన్నుగా నిలిచి చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. చిత్తూరులోని ఎంపి కార్యాలయంలో సోమ వారం దగ్గుమళ్ళ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. రైతు సంక్షేమం కోసం పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా తన ఉనికిని కాపాడుకోవడం కోసం విమర్శలు చేస్తోందన్నారు. మామిడి రైతుల కష్టాలను గుర్తించి ముందు చూపుతో కేజీకి రూ.4 సబ్సిడీ ప్రకటించి మామిడి రైతుకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కూటమి సర్కార్ అన్నారు. రైతు పక్షపాతిగా మరోసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరూపించారని, ఇది సిఎం పాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనను చూడలేక వైకాపా నేతలు నిరసనల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వం రూ.281 కోట్ల ఆర్థిక సహాయంను అందించాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారని ఎంపి గుర్తు చేశారు. దీనికి కేంద్ర వ్యవసాయ శాఖ స్పందించి తోతాపురి మామిడి ధరలు పడిపోవడానికి గల కారణాలను గుర్తించి, ఆదాయంను పెంచే మార్గాలను అన్వేషించడానికి కేంద్ర ప్రభుత్వం ఐసిఏఆర్ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింద న్నారు. ఈ పరిస్థితుల్లో గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేయడం విడ్డూరంగా వుందన్నారు. మామిడి రైతును వైకాపా ప్రభుత్వం గతంలో ఐదేళ్ళ పాటు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు దేశం కార్యదర్శి అశోక్‌కుమార్, ఎపి మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## జింబాబ్వే టి20 సిరీస్‌కు సంజూ ఔట్, ప్రభ్‌సిమ్రన్ ఇన్
## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన శివమ్ దూబే

**ముంబై, జులై 6:** ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు, జింబాబ్వేతో జరిగేటీ 20 సిరీస్‌లకు టీమిండియా జట్లను బీసీసీఐ ప్రకటించింది. శివమ్ దూబే దాదాపు రెండేళ్ల తర్వాత భారత వన్డే జట్టులోకి వచ్చాడు. గాయంతో దూరమైన నితీశ్ కుమార్ స్థానాన్ని దూబేతో బీసీసీఐ సెలక్షన్ కమిటీ భర్తీ చేసింది. టీ20 జట్టులో కీలక సభ్యునిగా ఉన్న దూబే.. చివరివన్డే 2024 ఆగస్టులో ఆడాడు. ఇదొక్క మార్పుతోనే సరిపెట్టింది.

జూలై 23నుంచి ప్రారంభం కాబోయే జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. సంజూ శాంసన్‌పై సెలక్టర్లు వేటు వేశారు. అతడి స్థానంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను ఎంపిక చేశారు. అలాగే వైభవ్ సూర్యవంశీని కొనసాగించారు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడుతున్న అక్షర్ పటేల్, వాషింగ్టన్ , రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు విశ్రాంతినిచ్చారు. అశోక్ శర్మ, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్‌లు జట్టులోకి రాగా, ఫినిషర్ రింకూ సింగ్ తిరిగి జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు.



**ఇంగ్లండ్‌తో వన్డేలకు భారత్ జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ , కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే.

**జింబాబ్వేతో టీ20లకు భారత్ జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, ప్రభ్‌సిమ్రన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

## గుండె పగిలిన బ్రెజిల్ స్టార్ నేమార్
# సాకర్‌కు అల్విదా

**న్యూజెర్సీ, జులై 6:** బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో కొత్త తరానికి స్ఫూర్తిగా నిలిచిన నేమార్ జూనియర్ వీడ్కోలు పలికాడు. పీలే, రొనాల్డో, రొనాల్డిన్హో వంటి దిగ్గజాల వారసత్వాన్ని కొనసాగించి, షో మ్యాన్‌గా ఓ వెలుగు వెలిగిన నేమార్ అనూహ్యంగా సాకర్‌కు బైబై చెప్పేశాడు. ఫిఫా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లో నార్వే చేతిలో ఓటమితో కుంగిపోయిన బ్రెజిల్ స్టార్ నేమార్.. ఈ తీవ్ర నిర్ణయానికి వచ్చాడు. ఆ సమయంలో తీవ్ర ఉద్వేగానికి గురై, కన్నీరు పెట్టుకున్నాడు. తన కెరీర్ ఎక్కడ మొదలైందో అక్కడే ముగిసిందని వెల్లడించాడు. తన ప్రాణానికి ప్రాణమైన ఆటకు నేమార్ విచార వదనంతో అల్విదా చెప్పడం కోట్లాదిమందిని కలచివేసింది. ఈ నిర్ణయంతో నేమార్ 16 ఏళ్ల కెరీర్ ముగిసింది.

నేమార్... బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఈ పేరు ఓ సంచలనం. బ్రెజిల్ తరపున ఆడిన దిగ్గజ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్రెజిల్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలవడంతో పాటు.. జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 130 మ్యాచ్‌లలో 80గోల్స్ సాధించాడు. 2010లో అరంగేట్రం చేసిన న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలోనే యాదృచ్ఛికంగా చివరి మ్యాచ్ ఆడేశాడు.

రెండో అర్ధభాగంలో మైదానంలోకి వచ్చిన నేమార్.. పెనాల్టీని గోల్‌గా మలిచినా, బ్రెజిల్‌ను టోర్నీ నుండి నిష్క్రమించకుండా ఆపలేకపోయాడు. ఫైనల్ విజిల్ తర్వాత అతను ఏకధాటిగా ఏడుస్తున్న దృశ్యాలు అభిమానుల హృదయాలను కలచివేశాయి. అతని బ్రెజిల్ సహచరులు చాలామంది అతన్ని ఓదార్చడానికి ప్రయత్నించారు, కానీ బార్సిలోనా మాజీ ఆటగాడైన అతను పూర్తిగా కుంగిపోయాడు. "నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇప్పుడు అంతా ముగిసింది" అని నేమార్ అన్నాడు.




*నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇపుడు అది ముగిసింది... నార్వే చేతిలో ఓటమితో బ్రెజిల్ నిష్క్రమించిన తర్వాత గుండె పగిలిన ఆవేదనతో ఫుట్‌బాల్ దిగ్గజం నేమార్ పలికిన మాటలు. సాకర్ ప్రపంచకప్ అందించాలన్న కలలు కల్లలయిన వేళ కన్నీళ్లతో తన ఫుట్‌బాల్ కెరీర్‌కు అల్విదా పలికాడు.*

# మెక్సికోకు ఇంగ్లండ్, బ్రెజిల్‌కు నార్వే షాక్




**న్యూజెర్సీ, జులై 6:** నార్వే సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలిసారి ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో హాట్ ఫేవరెట్ బ్రెజిల్‌పై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. నార్వే స్టార్ ఫార్వర్డ్, మాంచెస్టర్ సిటీ సంచలనం ఎర్లింగ్ హాలాండ్ రెండు గోల్స్‌తో నార్వేకు అద్భుత విజయాన్ని అందించాడు. ప్రారంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అయితే బ్రెజిల్‌కు లభించిన గోల్డెన్ ఛాయిస్‌ను చేజార్చుకుంది. ఆట ప్రారంభంలోనే పెనాల్టీ లభించగా గిమారెస్ దాన్ని గోల్‌గా మలచడంలో తడబడ్డాడు. నార్వేగోల్‌కీపర్ నైలాండ్ అడ్డుకున్నాడు. దీంతో తొలి హాఫ్ ముగిసేసరికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

### చెలరేగిన హాలాండ్

ద్వితీయార్థంలో నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ దూసుకుపోయాడు. ఆట 79వ నిమిషంలో నార్వే ఆటగాడు షెల్డెరప్ అద్భుతమైన క్రాస్‌ను అందించగా దాన్ని హాలాండ్ అత్యంత ఎత్తుకు లేచి బ్రెజిల్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ ఇచ్చిన షాక్ నుంచి బ్రెజిల్ కోలుకోకముందే, హాలాండ్ మరోసారి తన ప్రతాపం చూపించాడు. బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను అనుకూలంగా మార్చుకుంటూ మ్యాచ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు హాలండ్ రెండో గోల్ సాధించి నార్వే ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఇది ఈ సాకర్ వరల్డ్ కప్‌లో హాలాండ్‌కు ఏడో గోల్. మెస్సీ, కిలియన్ ఎంబాపేల సరసన నిలిచిన హాలాండ్... గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు.

### ఇంజ్యూరీ టైమ్‌లో బ్రెజిల్ గోల్

ఇకమ్యాచ్ ఇంజ్యూరీ టైమ్ 10వ నిమిషంలో బ్రెజిల్ ఆటగాడు కాసెమిరోను నార్వే డిఫెండర్ ఓస్టిగార్డ్ ప్రమాదకరంగా అడ్డుకోవడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. ఈ పెనాల్టీని నేమార్ గోల్‌గా మలిచి నార్వే ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. ఈ ప్రపంచ కప్‌లో నేమార్‌కు ఇదే మొదటి గోల్. అప్పటికే సమయం మించిపోవడంతో బ్రెజిల్ 2-1తో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

### బెల్లింగ్‌హామ్ డబుల్.. మెక్సికోపై విజయం

సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అసాధారణ ఆటతీరు కొనసాగుతోంది. మెక్సికోను దాని సొంతగడ్డపై 3-2తో ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ రెండు నిమిషాల వ్యవధిలో (36, 38) రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. కెప్టెన్ హ్యారీ కేన్ పెనాల్టీ ద్వారా మరో గోల్ (60వ నిమిషం) సాధించాడు. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో బెల్లింగ్‌హామ్ తొలి గోల్‌తో ఇంగ్లండ్‌కు ఆధిక్యం అందించాడు. ఆ గోల్‌కు కేవలం 98 సెకన్ల వ్యవధిలోనే మరోసారి గోల్ చేసి స్కోరును 2-0కు చేర్చాడు. అతని వేగవంతమైన డబుల్‌తో మెక్సికో ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది. అయినా పుంజుకుని 42వ నిమిషంలో జూలియన్ క్వినోనెస్ గోల్ చేసి ఇంగ్లండ్ ఆధికాన్ని 2-1కు తగ్గించాడు.

### కేన్ గోల్.. క్వాన్సా రెడ్ కార్డ్

రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్దిసేపటికే ఇంగ్లండ్‌కు పెనాల్టీ లభించింది. 60వ నిమిషంలో హ్యారీ కేన్ దాన్ని గోల్‌గా మలిచి జట్టుకు 3-1 ఆధిక్యంఅందించాడు. అయిదే జారెల్ క్వాన్సా రెడ్ కార్డ్ గురై మైదానం వీడడంతో ... దీన్ని అవకాశంగా మార్చుకుని మెక్సికో వరుస దాడులు చేసింది. రౌల్ జి మెనెజ్ మరో గోల్ చేసి 3-2కు తీసుకువచ్చాడు. చివరి నిమిషాల్లో మెక్సికో సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.








## క్వార్టర్ ఫైనల్లో సినర్, కోకో గాఫ్

**లండన్, జులై 6:** ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్.. వరుసగా ఐదో వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. జపనీస్ క్వాలిఫయర్ షింటారో మోచిజుకిపై 6-3, 7-6, 6-3 తేడాతో గెలుపొందాడు. డిఫెండింగ్ ఛాంపియన్ సినర్..తొలి సెట్‌ను అలవోకగానే నెగ్గాడు. అయితే రెండో సెట్‌లో షింటారో నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. ఎవరి సర్వీసులు వారు నిలుపుకోవడంతో సెట్ టైబ్రేక్‌కు సాగింది. చివరకు అనుభవజ్ఞుడైన సినర్‌దే విజయం అయింది. మూడో సెట్‌ను మరింత ఈజీగా నెగ్గి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఏడుసార్లు వింబుల్డన్ విజేత నోవాక్ జొకోవిచ్ ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా సినర్ నిలిచాడు. పురుషుల సింగిల్స్ మిగతా నాలుగో రౌండ్‌లో కొబొలి 7-4, 7-6, 6-3తో మినార్‌పై అతికష్టంపై గెలుపొండగా...స్టఫ్ 3-6, 6-7, 7-6, 7-5, 4-2తో హుర్కాజ్‌పై గెలుపొందాడు. చివరి సెట్‌లో హుర్కాజ్ తొడకండరాల గాయంతో రిటైర్ అయ్యాడు.

కాగా అమెరికా సంచలనం కోకో గాఫ్... మహిళల సింగిల్స్‌లో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్ చేరింది. నాలుగో రౌండ్‌లో బెలిండా బెన్సిక్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. తొలి సెట్‌లో గాఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కోకో గాఫ్ సర్వీసును బెలిండా బ్రేక్ చేసి తొలి సెట్‌ను 6-4తో నెగ్గింది. అయితే వెంటనే పుంజుకున్న కోకో గాఫ్ రెండో సెట్‌ను 6-3తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌ను కూడా ఈజీగా కైవసం చేసుకుని కోకో గాఫ్ ముందంజ వేసింది. మిగతా నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో నొస్కోవా 6-4, 7-6తో చెమటోడ్చి 26వ సీడ్ కీస్‌పై గెలుపొందగా... మూడు సెట్ల పోరులో పావోలిని 6-4, 4-6, 6-3తో ఇలాపై, మెర్టెన్స్ 6-4, 6-4తో బౌజ్కోవాపై, కోస్ట్యుక్ 6-4, 6-4తో క్రుయేగర్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరారు.

## ఆటో, మెటల్ షేర్ల మద్దతు




## లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జులై 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. తొలి త్రైమాసిక వ్యాపార అప్‌డేట్లు ఆశాజనకంగా ఉండటం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, నైరుతి రుతుపవనాల పురోగతి మెరుగుపడటం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడం వంటి అంశాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగగా.. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడి 78 వేల 285 వద్ద ముగిసింది. నిఫ్టీ 159 పాయింట్లు ఎగిసి 24 వేల 430 వద్ద స్థిరపడింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ దాదాపు 2.36 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచాయి.

మరోవైపు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.679 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడి 95 రూపాయల 40 పైసల వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్పంగా తగ్గగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల 91 సెంట్ల వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లలో యూరప్ సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవగా ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణితో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈనెల వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు పెరగడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఫెడ్ సమావేశపు మినిట్స్‌పై కేంద్రీకృతమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 3.36 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.76, కరూర్ వైశ్యా బ్యాంక్ 4.87, బంధన్ బ్యాంక్ 4.06 శాతం లాభపడ్డాయి. డిక్సన్ టెక్నాలజీస్ దాదాపు 7 శాతం ఎగసింది. ఫెర్మెంటా బయోటెక్ 13.78 శాతం జంప్ చేసింది. మరోవైపు సుప్రియా లైఫ్‌సైన్స్ షేరు 11 శాతానికి పైగా పతనమైంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర షేరు 2.29 శాతం తగ్గింది. కొత్తగా లిస్టైన ఆస్తా స్పింటెక్స్ షేరు ఇష్యూ ధర కంటే స్వల్ప ప్రీమియంతో 136 రూపాయల 45 పైసల వద్ద ముగిసింది. ఫాల్కాన్ కాన్సెప్ట్స్‌కు 101 కోట్ల 93 లక్షల రూపాయల విలువైన వర్క్ ఆర్డర్ లభించడంతో ఆ కంపెనీ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

## భారత్ మార్కెట్ల నుంచి 580 మిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా



**ముంబయి, జులై 6:** భారత్ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో విత్‌డ్రా అయ్యాయి. గతవారం భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకున్నారు. ఎలారా సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు మొత్తం580 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇందులో భారత్‌కే ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టే ఫండ్ల నుంచి 250 మిలియన్ డాలర్లు వెనక్కి వెళ్లగా మిగిలిన నిధులు గ్లోబల్ ఎమర్జింగ్ మార్కెట్స్, ఆసియా ఎక్స్ జపాన్ ఫండ్ల ద్వారా ఉపసంహరణకు గురయ్యాయి.

అంతకుముందు వారంలో 94 మిలియన్ డాలర్లుగా ఉన్న ఉపసంహరణలు ఇప్పుడు మరింత పెరిగాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన భారీ విక్రయాలతో పోలిస్తే ప్రస్తుత ఉపసంహరణలు తక్కువగానే ఉన్నాయి. అమెరికా ఈక్విటీ ఫండ్ల నుంచి ఒక్క వారంలోనే 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. అంతకుముందు వారంలో ఈ మొత్తం 8 బిలియన్ డాలర్లుగా ఉండగా మూడు వారాల క్రితం మాత్రం రికార్డు స్థాయిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి.

మార్చి తర్వాత తొలిసారిగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో కూడా 9 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత పెట్టుబడుల ప్రభావంతో పెరిగిన ఎమర్జింగ్ మార్కెట్ పెట్టుబడుల జోరు తగ్గుముఖం పట్టిందని ఎలారా వెల్లడించింది. ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో తైవాన్ నుంచి 766మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. ఇది గత 11 ఏళ్లలో అత్యధికం. దక్షిణ కొరియా నుంచి 283 మిలియన్ డాలర్లు బయటకు వెళ్లగా బ్రెజిల్ నుంచి గత ఏడు వారాల్లో దాదాపు 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా అయ్యాయి. కమోడిటీ ఫండ్ల నుంచి వరుసగా ఎనిమిదో వారంలో 1.5 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఎనర్జీ ఫండ్ల నుంచి రికార్డు స్థాయిలో 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. బంగారం ఫండ్ల నుంచి 14 వారాల్లో అత్యధికంగా 3.1 బిలియన్ డాలర్లు ఉపసంహరించుకోగా వెండి ఫండ్లలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు.

## స్వల్పకాలిక రుణాలతో రూ.2.53 లక్షలకోట్ల సేకరణ

**ముంబయి, జులై 6:** దేశీయ కార్పొరేట్ సంస్థలు కమర్షియల్ పేపర్లు సీపీల ద్వారా నిధుల సమీకరణలో భారీ వృద్ధికనిపిస్తోంది. అనుకూలమైన వడ్డీ రేట్లు, సీజనల్ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇప్పటికే ఉన్న రుణాల రీఫైనాన్సింగ్ కారణంగా జూన్ నెలలో సీపీల ద్వారా నిధుల సమీకరణ దాదాపు ఐదేళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. జూన్ నెలలో కంపెనీలు కమర్షియల్ పేపర్ల ద్వారా రూ.2 లక్షల 53 వేల కోట్లను సమీకరించాయి. మే నెలతో పోలిస్తే ఇది 84.6 శాతం అధికం. గత ఏడాది జూన్‌తో పోలిస్తే 59.4 శాతం వృద్ధి నమోదైంది.

2021 జూలైలో రూ.2 లక్షల 69 వేల కోట్ల సమీకరణ తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం విశేషం. కరూర్ వైశ్యా బ్యాంక్ ట్రెజరీ విభాగాధిపతి వి. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణాలతో పోలిస్తే కమర్షియల్ పేపర్ల ద్వారా నిధుల సమీకరణ తక్కువ వ్యయంతో ఉండటంతో కార్పొరేట్లు ఈమార్గాన్ని ఎక్కువగా ఎంచుకున్నారని తెలిపారు. వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు, మార్కెట్లో తగినంత నగదులభ్యత కూడా ఇందుకు దోహదపడిందని చెప్పారు. ధనలక్ష్మీ బ్యాంక్ ట్రెజరీ హెడ్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ అధిక వడ్డీతో కూడిన బ్యాంకు రుణాలకు బదులుగా తక్కువ వ్యయంతో లభించే స్వల్పకాలిక మార్కెట్ ఫండింగ్ వైపు కార్పొరేట్లు, ఎన్‌బీఎఫ్‌సీలు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల నుంచి మంచి డిమాండ్, స్థిరమైన క్రెడిట్ పరిస్థితులు కూడా ఈ ధోరణికి బలం చేకూర్చాయని వివరించారు.



కమర్షియల్ పేపర్లు అంటే కంపెనీలు 7 రోజుల నుంచి ఏడాది వరకు స్వల్పకాలిక నిధులు సమీకరించేందుకు ఉపయోగించే రుణ పత్రాలు. జూన్ తొలి భాగంలో కమర్షియల్ పేపర్లపై రిటర్నులు అధికంగా ఉన్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన భారీ లిక్విడిటీ ఇన్ఫ్యూజన్ చర్యలతో అవి తగ్గుముఖం పట్టాయి. ఆర్బీఐ వివిధ వేరియబుల్ రేట్ రెపో వేలాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.6 లక్షల కోట్లకు పైగా తాత్కాలిక లిక్విడిటీని అందించింది. ప్రస్తుతం జూలై 5 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.1 లక్షా 85 వేల కోట్ల అదనపు లిక్విడిటీ ఉన్నట్లు ఆర్బీఐడేటా చెపుతోంది.

## ఎన్ఎస్ఈ భారీ ఐపీవోకు రంగం సిద్ధం
## సెప్టెంబర్‌లో రూ.30 వేల కోట్ల పబ్లిక్ ఇష్యూ




**ముంబయి, జులై 6:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తన భారీ ఐపీవోను ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఐపీవో పరిమాణం సుమారు రూ.30వేల కోట్లు ఉండేఛాన్స్ ఉంది. ఈఇష్యూ విజయవంతమైతే, భారత కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా నిలవనుంది. ఈ ఐపీవో ద్వారా ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు పైగా చేరే అవకాశముందని అంచనా. ఇప్పటికే ఇష్యూకు సంబంధించిన రోడ్‌షోలను ప్రారంభించేందుకు ఎన్ఎస్ఈ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఐపీవో విజయవంతమైతే, 2024 అక్టోబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా చేపట్టిన రూ.27,870 కోట్ల ఐపీవో రికార్డును అధిగమించనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే జరుగుతుంది. ఇందులో మొత్తం 14 కోట్ల 89 లక్షల ఈక్విటీ షేర్లు విక్రయానికి రానుండగా, ప్రస్తుత వాటాదారులు కలిపి సంస్థలోని సుమారు 6 శాతం వాటాను విక్రయించనున్నారు.

ప్రస్తుతం ఎన్ఎస్ఈకి దాదాపు 1.8 లక్షల మంది షేర్‌హోల్డర్లు ఉన్నారు. వాటా విక్రయిస్తున్న ప్రధాన వాటాదారుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధికంగా 2.48కోట్ల షేర్లు విక్రయించనుండగా, ఎంఎస్ స్ట్రాటజిక్ 1.60 కోట్ల షేర్లు విక్రయించనుంది. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ది న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ తదితర సంస్థలు కూడా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయించనున్నాయి. అయితే ఎన్ఎస్ఈలో 10.72శాతం వాటాతో అతిపెద్ద వాటాదారైన ఎల్ఐసీ ఈ షేర్ విక్రయంలో పాల్గొనబోవడం లేదని స్పష్టం చేసింది. సెబీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) లభించిన అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ఐపీవో ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఐపీవో నిర్వహణ కోసం ఎన్ఎస్ఈ ఇప్పటికే 20 మంది మర్చంట్ బ్యాంకర్లను, న్యాయ సలహాదారులు, ఇతర మధ్యవర్తులను నియమించింది. ఎన్ఎస్ఈ ఐపీవో ప్రకటన అనంతరం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్‌లు కూడా సెబీకి తమ డ్రాఫ్ట్ పత్రాలను సమర్పించింది. జియో ప్లాట్‌ఫామ్‌ల ఐపీవో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్రం వాటాల విక్రయం



**కొచ్చిన్, జులై 6:** ప్రభుత్వ రంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం తన వాటాలను విక్రయిస్తోంది. ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా గరిష్ఠంగా5.04 శాతం వాటాను విక్రయించనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.1,400ను ఇష్యూ ధరగా నిర్ణయించారు. తొలి దశలో 2.52 శాతం వాటాను విక్రయించనుండగా పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభిస్తే గ్రీన్‌షూ ఆప్షన్ కింద మరో 2.52 శాతం వాటాను కూడా విక్రయించే అవకాశం ఉందని దీపమ్‌తెలిపింది. ఈఆఫర్‌లో జూలై 7న నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లు, జూలై 8న రిటైల్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలో భారీ వాటాల విక్రయానికి కేంద్రం సిద్ధమవుతోందన్న వార్తలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల ఖండించిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. మార్కెట్ అంచనాల ప్రకారం ఈ లావాదేవీ ద్వారా కేంద్రానికి రూ.16 వేల కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉందనిఅంచనా. తాజా షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రమోటర్ అయిన కేంద్రానికి 67.91 శాతం వాటా ఉంది. ఎల్ఐసీ సంస్థకు 3.34 శాతం వాటా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో తన వాటాను తగ్గించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం సాధారణంగా ఆఫర్ ఫర్ సేల్ విధానాన్ని అనుసరిస్తుంది. డిస్‌ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా పెరుగుతున్న ఆదాయంప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా కేంద్రం ఇప్పటికే దాదాపు రూ.14 వేల కోట్లు సమీకరించింది.

## మైక్రోసాఫ్ట్‌లో భారీ ఉద్యోగాల కోత
## 4,800 మందికి ఉద్వాసన

**శాన్‌ఫ్రాన్సిస్కో, జులై 6:** ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు శ్రీకారంచుట్టింది. సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 2.1 శాతం, అంటే దాదాపు 4,800 మందిని తొలగించనున్నట్లు ప్రకటించింది. కృత్రిమమేధ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వ్యాపార కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐ వినియోగాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బిగ్ టెక్ కంపెనీలు ఏఐమౌలిక సదుపాయాలపై 700 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయని అంచనా. ఇప్పటికే అమెజాన్, మెటా వంటి సంస్థలు కూడా వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి. 2026 తొలి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేర్ ధర దాదాపు 23 శాతం పడిపోవడం 2022 తర్వాత కంపెనీకి ఇదే అత్యంత బలహీనమైన తొలి అర్ధవార్షిక ప్రదర్శనగా నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps